# లోకల్ గైడ్
జాతీయ దినపత్రిక
LOCAL NEWS GOBAL FOCUS
LGTV
తెలంగాణ www.localguidenews.com ఆంధ్రప్రదేశ్
RNI No:APBIL/2013/50718

ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 14, | సంచిక ,237 | పేజీలు -12 | శనివారం -27 - జూన్ - 2026 | వెల రూ.2/-

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal,



లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com
విలేకరులు కావలెను
సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.
ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి
8977761499/9110308094


# ప్రభుత్వం కోసం కష్టపడే ఉద్యోగుల భద్రతను కాపాడటం తమ బాధ్యత

## 14 బ్యాంకులతో తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూలు

- ★ ఉద్యోగుల నమ్మకమే ప్రభుత్వానికి బలం
- ★ ప్రభుత్వాలు మారినా ఉద్యోగ వ్యవస్థ శాశ్వతం
- ★ ప్రమాద బీమా కవరేజీ రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్లు
- ★ ఉద్యోగులకు భారీ భరోసా.. ఉచిత బీమా, పీఆర్సీపైనా సీఎం హామీ
- ★ రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత ప్రమాద బీమా
- ★ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపు
- ★ విమాన ప్రమాద బీమా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు




అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు కూడా ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు 14 బ్యాంకులతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. రవీంద్రభారతిలో జరిగిన మిగతా 2 లో




## తెలంగాణలో 13 మంది ఐఏఎస్‌ల బదిలీ

- ● చేనేత హస్తకళల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్‌కు బాధ్యతలు
- ● అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్
- ● సీఎం ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్
- ● సీఎంవోలోనూ కీలక మార్పులు

## వెనెజువెలాకు భారత్ భారీ సాయం.. ‘ఆపరేషన్ అమిస్తాద్’ ప్రారంభం

ఐఏఎఫ్‌కు చెందిన రెండు సీ-17 విమానాల్లో వైద్య సామగ్రి




- భీష్మ క్యూబ్‌లు, మందులు, 35 టన్నుల సహాయ సామగ్రి
- బయలుదేరిన 41 మంది వైద్య బృందం
- 235కు చేరిన మృతుల సంఖ్య
- వేలాది మంది గల్లంతు




## జిల్లాల్లో అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- ‘రాజీవ్ యువ వికాసం’లో స్వయం ఉపాధి కార్యక్రమాలు
- గురుకులాల నిర్వహణకు అత్యవసరంగా రూ.29 కోట్లు అవసరం
- పెండింగ్‌లోని రూ.27 కోట్ల అద్దె చెల్లింపులు విడుదల చేయాలి
- 2023 నుంచి పెండింగ్‌లోని రూ.7.5 కోట్ల మరమ్మతు బిల్లులు వెంటనే మంజూరు చేస్తాం

హైదరాబాద్: సంక్షేమశాఖల పరిధిలోని స్వయం ఉపాధి

## రాముడి పేరుతో మోసం.. సహించేది లేదు: యోగి హెచ్చరిక

రామమందిర విరాళాల దుర్వినియోగంపై స్పందించిన యోగి ఆదిత్యనాథ్




- ఈ కేసులో జీరో టాలరెన్స్ విధానమే అమలు చేస్తామని స్పష్టీకరణ
- సిట్ నివేదిక అందిన వెంటనే చర్యలు చేపట్టామని వెల్లడి
- ప్రజల విశ్వాసంతో చెలగాటం ఆడేవారిని ఉపేక్షించబోమని హెచ్చరిక

# పంచాయతీ రాజ్‌శాఖలో మరోసారి ప్రమోషన్లు

## సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- పంచాయతీరాజ్ శాఖలో ప్రమోషన్ల పండగ.. కీలక ఆదేశాలు జారీ చేసిన పవన్
- 42 మంది ఎంపీడీవోలకు డీడీవోలుగా పదోన్నతులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక 10 వేల మందికి ప్రమోషన్లు



అమరావతి: ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆ శాఖ అధికారులకు మరో తీపికబురు అందించారు. తాజాగా 42 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు మిగతా 2 లో




## కూటమి సర్కార్‌లో మహిళలకు రూ. 6,000 కోట్ల ప్రయోజనం అందలేదు

- “చంద్రబాబు నాయుడు మోసపూరిత వాగ్ధానాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపిస్తోంది
- స్వయం సహాయక గ్రూపు రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చింది
- మా ప్రభుత్వ హయాంలో డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ కింద రూ. 4,969 కోట్లు చెల్లించాం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందని వైఎస్ జగన్ ఆరోపించారు.

# ఎన్నికల హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదు

## 2028లో కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని కార్యకర్తలకు పిలుపు

- రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే: కేటీఆర్
- రూ.కోటి విలువ భూములు ఇప్పుడు రూ.60 లక్షలకు కూడా అమ్ముడవడం లేదని వ్యాఖ్య
- కేసీఆర్ హయాంలో పరిశ్రమలతో భూముల విలువలు పెరిగాయని వెల్లడి
- రైతు బంధు, దళిత బంధు అంశాల్లో ప్రజలను మోసం చేశారని విమర్శ



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు రియల్ ఎస్టేట్‌పై గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అధికారంలోకి మిగతా 2 లో

## కింగ్ చార్లెస్ వ్యక్తిగత పన్నుల వెల్లడితో సరికొత్త రికార్డు

చరిత్ర సృష్టించిన కింగ్ చార్లెస్: సొంత పన్నుల వివరాలు వెల్లడించిన తొలి బ్రిటన్ రాజు!

సింహాసనం అధిష్టించినప్పటి నుంచి రూ. 320 కోట్లకు పైగా పన్ను చెల్లింపు




- చట్టపరమైన మినహాయింపులు ఉన్నప్పటికీ స్వచ్ఛందంగా పన్ను కట్టిన రాజు
- యూకేలోనే అత్యధిక పన్నులు కట్టే టాప్ 100 మంది వ్యక్తుల్లో స్థానం
- బకింగ్‌హామ్ ప్యాలెస్ పునరుద్ధరణ ముగిసినా అక్కడికి మారబోనని స్పష్టీకరణ




## నిరుద్యోగుల కోసం జూలైలో ‘నైపుణ్యం’ పోర్టల్ ఆవిష్కరణ

- ● అధ్యాపక పోస్టుల భర్తీ వేగవంతం చేయండి
- ● అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశం
- ● అన్ని ప్రభుత్వ ఐటీఐలలో ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుకు చర్యలు
- ● ప్రతి మూడు నెలలకు ఒకసారి నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు
- ● ఓంక్యాప్ ద్వారా వచ్చే నెలలో 146 మందికి విదేశీ ఉద్యోగాలు

# పారిశ్రామికవేత్తల కోసం వారానికి ఒక రోజు కేటాయిస్తా...

## పారిశ్రామికవృద్ధి అంటే ప్రజల జీవనోపాధి

- హైదరాబాద్ ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది
- ఈవీ వాహనాలపై 100% రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు
- ప్రభుత్వం, పరిశ్రమల మధ్య ఎఫ్‌టీసీసీఐ ఒక బలమైన వారధిగా పనిచేస్తోంది




హైదరాబాద్: పారిశ్రామికవేత్తల కోసం వారానికి ఒక రోజు కేటాయిస్తానని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కేవలం పెద్ద కంపెనీలకే కాకుండా చిన్న పరిశ్రమలకు, మహిళా, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు అందాలనేదే మిగతా 2 లో

## వెనెజువెలా జంట భూకంపాలు.. 40వేల మంది మిస్సింగ్

- ఆ ఒక్క నగరంలోనే 100 భవనాలు కూలి..
- ప్రకృతి ప్రకోపానికి ఇప్పటివరకు 235 మంది బలైనట్లు
- ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడి
- భవన శిథిలాల కింద ఇంకా అనేక మంది చిక్కుకున్నట్లు పేర్కొంది



ఢిల్లీ: లాటిన్ అమెరికా దేశం వెనెజువెలాలో సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగతా 2 లో

## వెనెజువెలాకు భారత్ భారీ సాయం..
# ‘ఆపరేషన్ అమిస్తాద్’ ప్రారంభం

ఢిల్లీ: వరుస భూకంపాలతో తీవ్రంగా నష్టపోయిన వెనెజువెలాకు భారత్ అండగా నిలిచింది. బాధితులకు అత్యవసర సాయం అందించేందుకు ‘ఆపరేషన్ అమిస్తాద్’ (స్పానిష్‌లో అమిస్తాద్ అంటే స్నేహం) పేరుతో ప్రత్యేక సహాయక చర్యలను ప్రారంభించింది. ఈ మేరకు భారత వైమానిక దళానికి చెందిన రెండు సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానాల్లో వైద్య బృందం, భీష్మ క్యూబ్‌లు, మందులు, ఇతర సహాయ సామగ్రిని పంపింది. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు. వెనెజువెలా ప్రజలకు ఈ క్లిష్ట సమయంలో భారత్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సహాయక బృందంలో 60 పారా ఫీల్డ్ హాస్పిటల్‌కు చెందిన 41 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో తొమ్మిది మంది వైద్యులు ఉన్నారు. అత్యవసర వైద్యం, శస్త్రచికిత్సలు, ఇతర ఆరోగ్య సేవలు అందించేందుకు వీరు సిద్ధంగా ఉన్నారు. విదేశాంగ శాఖ అందించిన సుమారు ఆరు టన్నుల వైద్య సామగ్రి కూడా వెంట తీసుకెళ్లారు. అలాగే ఆరోగ్య మైత్రి ప్రాజెక్టు కింద రూపొందించిన రెండు భీష్మ క్యూబ్‌లను కూడా పంపించారు. ఇవి విపత్తుల సమయంలో తాత్కాలిక ఆసుపత్రులుగా ఉపయోగపడే ఆధునిక వైద్య యూనిట్లు. వెనెజువెలాలో బుధవారం నిమిషం వ్యవధిలో రెండు భూకంపాలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ విపత్తులో ఇప్పటివరకు 235 మంది మృతి చెందారు. 1,500 మందికిపైగా గాయపడ్డారు. వేలాది మంది ఇంకా గల్లంతైనట్లు అక్కడి అధికారులు తెలిపారు. రాజధాని కరాకస్, లా గువైరా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా, బ్రెజిల్, మెక్సికో, అర్జెంటీనా తదితర దేశాలు కూడా సాయాన్ని ప్రకటించాయి.

## నిరుద్యోగుల కోసం జూలైలో ‘నైపుణ్యం’ పోర్టల్ ఆవిష్కరణ

అమరావతి: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టులకు గాను ఇప్పటివరకు 1,89,316 దరఖాస్తులు వచ్చాయని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును డేటా ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. విశ్వవిద్యాలయాన్ని యూనిట్‌గా తీసుకుని నియామకాలు చేపడుతున్నందున, ఎంపిక కమిటీలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా ఈ నియామక ప్రక్రియను ముగించాలని ఆదేశించారు. స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుకు సంబంధించి పరిశ్రమలతో తప్పనిసరిగా ఒప్పందాలు ఉండాలని, దీని కోసం రూపొందించే చట్టం దేశానికే ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత కోసం రూపొందించిన ‘నైపుణ్యం’ పోర్టల్‌ను వచ్చే నెలలో ఆవిష్కరించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. దీని ద్వారా నమోదైన ప్రతి ఒక్కరికీ ఆన్‌లైన్ స్కిల్ కార్డు జారీ చేస్తామని వెల్లడించారు. పీఎం సేతు పథకం కింద మంజూరైన క్లస్టర్లలో ఐటీఐలను బలోపేతం చేయాలని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్ని ప్రభుత్వ ఐటీఐలలో ఏఐ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కార్పొరేషన్ (ఓంక్యాప్) ఆధ్వర్యంలో వచ్చే నెలలో 146 మందికి విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1,30,422 మందికి ఉద్యోగాలు లభించాయని, ఇకపై ప్రతి త్రైమాసికానికి నియోజకవర్గ కేంద్రాల్లో జాబ్ మేళాలు నిర్వహించాలని లోకేష్ ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్త, స్కిల్ డెవలప్‌మెంట్ ఎండీ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 13 మంది ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్: తెలంగాణలో 13 మంది ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. చేనేత హస్తకళల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్‌కు బాధ్యతలు అప్పగించింది. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించిన ప్రభుత్వం.. దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శిగా ఆమెకు అదనపు బాధ్యతలు ఇచ్చింది. జీఏడీ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్‌ను నియమించింది. మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. సీఎం ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్ నియమితులయ్యారు. రాష్ట్ర అటవీ ప్రధాన సంరక్షణ అధికారిగా వినయ్ కుమార్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చింది. మరోవైపు సీఎంవోలోనూ కీలక మార్పులు జరిగాయి. ఈనెల 30న పదవీ విరమణ చేయనున్న సీఎస్ రామకృష్ణారావును సీఎం సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. సీఎంవో ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డిని ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా బదిలీ చేసింది. సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్‌ను నియమించింది.

## రాముడి పేరుతో మోసం.. సహించేది లేదు: యోగి హెచ్చరిక

ఢిల్లీ: అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో నిందితులపై ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్ష చూపబోదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. సనాతన ధర్మం, ప్రజల విశ్వాసంతో చెలగాటం ఆడేవారిపై జీరో టాలరెన్స్ విధానమే అమలు చేస్తామని హెచ్చరించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని యోగి తెలిపారు. “అయోధ్య విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని ముందే చెప్పాం. విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం” అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విపక్షాలపై కూడా యోగి తీవ్ర విమర్శలు చేశారు. “ఒకప్పుడు శ్రీరాముడు లేడని చెప్పినవారే ఇప్పుడు భక్తి గురించి మాట్లాడుతున్నారు. రామమందిర నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కోర్టుల్లో పోరాడినవాళ్లే ఇప్పుడు విశ్వాసం గురించి మాట్లాడటం విచిత్రం” అని వ్యాఖ్యానించారు. రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో ఇప్పటికే ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆలయ విరాళాల నగదు నిర్వహణ, ఉద్యోగుల నియామకాలు, సీసీటీవీ పర్యవేక్షణ, బంగారం, వెండి వంటి కానుకల నిర్వహణలో పలు అవకతవకలు జరిగినట్లు సిట్ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## కింగ్ చార్లెస్ వ్యక్తిగత పన్నుల వెల్లడితో సరికొత్త రికార్డు

ఢిల్లీ: బ్రిటన్ రాచకుటుంబ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. రాజుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తాను చెల్లించిన వ్యక్తిగత పన్నుల వివరాలను బహిరంగపరచి కింగ్ చార్లెస్ III సరికొత్త చరిత్ర సృష్టించారు. ఒక బ్రిటన్ రాజు తన సొంత పన్ను వివరాలను ఇలా అధికారికంగా ప్రకటించడం ఇదే తొలిసారి. గురువారం బకింగ్‌హామ్ ప్యాలెస్ విడుదల చేసిన వార్షిక ఆర్థిక నివేదికల ప్రకారం.. సెప్టెంబర్ 2022లో రాజుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కింగ్ చార్లెస్ రూ. 320 కోట్లకు పైగా (30 మిలియన్ పౌండ్లు) వ్యక్తిగత పన్నులు చెల్లించారు. ఒక్క 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే ఆయన ఆదాయ, మూలధన లాభాల పన్నుల కింద దాదాపు రూ. 140 కోట్లు (12.9 మిలియన్ పౌండ్లు) కట్టారు. దీంతో యునైటెడ్ కింగ్‌డమ్‌లోనే అత్యధిక పన్ను చెల్లించే టాప్ 100 మంది వ్యక్తుల జాబితాలో బ్రిటన్ రాజు నిలిచారు. ఇదే సమయంలో ప్రిన్స్ విలియం కూడా దాదాపు రూ. 84 కోట్ల (7.76 మిలియన్ పౌండ్లు) పన్ను చెల్లించినట్లు ప్రకటించారు. నిజానికి బ్రిటన్ చట్టాల ప్రకారం రాజులు ఆదాయ, వారసత్వ పన్నులు కట్టాల్సిన అవసరం లేదు. కానీ, తన తల్లి క్వీన్ ఎలిజబెత్ II 1993లో నెలకొల్పిన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కింగ్ చార్లెస్ స్వచ్ఛందంగా ఈ పన్నులు చెల్లించారు. ఈ వివరాలను ప్రజల ముందు ఉంచడం రాజు వ్యక్తిగత నిర్ణయమని ప్యాలెస్ అధికారులు తెలిపారు. చారిత్రాత్మక ‘డచీ ఆఫ్ లాంకాస్టర్’ తో పాటు శాండ్రింగ్‌హామ్, బాల్మోరల్ వంటి ప్రైవేట్ ఎస్టేట్ల ద్వారా వచ్చే ఆదాయంపై ఈ పన్నులు లెక్కించారు. ఇదే నివేదికలో రాచకుటుంబం మరో కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. దాదాపు రూ. 4,000 కోట్ల (369 మిలియన్ పౌండ్లు) వ్యయంతో పదేళ్లుగా జరుగుతున్న బకింగ్‌హామ్ ప్యాలెస్ పునరుద్ధరణ పనులు వచ్చే ఏడాది పూర్తి కానున్నాయి. అయినప్పటికీ, కింగ్ చార్లెస్, క్వీన్ కమిల్లా దంపతులు అక్కడికి మారకూడదని నిర్ణయించుకున్నారు. బకింగ్‌హామ్ ప్యాలెస్‌ను కేవలం అధికారిక కార్యకలాపాలకు హెడ్ క్వార్టర్స్‌గా మాత్రమే వాడతామని, తాము ప్రస్తుత నివాసమైన క్లారెన్స్ హౌస్‌లోనే ఉంటామని స్పష్టం చేశారు.

## జిల్లాల్లో అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుకు
# ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

హైదరాబాద్: సంక్షేమశాఖల పరిధిలోని స్వయం ఉపాధి కార్యక్రమాలను రాజీవ్ యువ వికాసం కింద అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అధికారులకు సూచించారు. జిల్లాల్లో అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ప్రైవేటు భవనాల్లోని గురుకులాలను వీలైనంత త్వరగా యంగ్ ఇండియా సమీకృత గురుకుల భవనాలకు తరలించే అవకాశాలు పరిశీలించాలని సూచించారు. గురుకులాల నిర్వహణకు అత్యవసరంగా రూ.29 కోట్లు అవసరమని, పెండింగ్‌లోని రూ.27 కోట్ల అద్దె చెల్లింపులు విడుదల చేయాలని ఈ సందర్భంగా అధికారులు విజ్ఞప్తి చేశారు. మంత్రి స్పందిస్తూ.. “సంక్షేమ గురుకుల పాఠశాలలు, వసతిగృహాల్లో మరమ్మతు పనులు నెలలో పూర్తి చేయాలి. 2023 నుంచి పెండింగ్‌లోని రూ.7.5 కోట్ల మరమ్మతు బిల్లులు వెంటనే మంజూరు చేస్తాం. గురుకులాలు, వసతిగృహాల అద్దెలు, డైట్, కాస్మెటిక్ ఛార్జీలకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు ఆర్థికశాఖకు పంపించాలి. స్టడీసర్కిళ్లను బలోపేతం చేసి యూపీఎస్సీ, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల్లో శిక్షణ ఇచ్చి, విజయ శాతాన్ని పెంచాలి. అంబేడ్కర్ భవనాన్ని 2027 ఏప్రిల్ 14 నాటికి ప్రారంభించేలా లక్ష్యం పెట్టుకోవాలి” అని ఆదేశించారు.

## పంచాయతీ రాజ్‌శాఖలో మరోసారి ప్రమోషన్లు

(ఎంపీడీవోలు), డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా (డీడీవోలు) పదోన్నతులు కల్పించే ప్రక్రియకు పచ్చజెండా ఊపారు. ఇందుకు సంబంధించిన సీనియారిటీ జాబితాను డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ఆమోదించింది. దీంతో త్వరలోనే వీరందరూ ఉన్నత హోదాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో పదోన్నతుల ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతోంది. ఇప్పటికే సుమారు 10 వేల మందికి పైగా సిబ్బందికి ప్రమోషన్లు కల్పించారు. గత పదేళ్లలో ఇంత భారీ సంఖ్యలో ఈ శాఖలో పదోన్నతులు ఇవ్వడం ఇదే ప్రథమమని అధికారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణ తేజతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. “వర్షాకాలంలో నిలిచి ఉన్న నీటితో దోమలు పెరిగి, పైపులైన్ల లీకేజీల వల్ల తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది. ప్రతి గ్రామ పంచాయతీ ప్రజారోగ్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలి. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి. అన్ని గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు అందుబాటులో ఉంచి, అవసరమైన చోట తక్షణం వినియోగించాలి” అని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

## కూటమి సర్కార్‌లో మహిళలకు
# రూ. 6,000 కోట్ల ప్రయోజనం అందలేదు

మొదటి పేజి తరువాయి

డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. మహిళల చేతిలో నిధులు ఉంటే స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు, ఉత్పాదక రంగాల్లో పెట్టుబడులు పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ రాయితీ అందించడం లేదని ఆరోపించారు. ఈ మేరకు వైఎస్ జగన్ ఎక్స్‌లో పోస్టు చేశారు. “చంద్రబాబు నాయుడు మోసపూరిత వాగ్దానాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపిస్తోంది. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ అమలు చేయకపోవటంతో ఆర్థిక సమస్యలు వస్తున్నాయి. మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందితే మహిళల్లో ఆర్థిక స్వావలంభన చేకూరుతుంది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జీవనాడి వంటింది. వారి చేతికి అందే రుణాలు పెరిగితే ఉత్పాదక రంగాల్లో పెట్టుబడులకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా మహిళా స్వయం సహాయక సంఘాల ఆదాయాన్ని పెంచే సామర్థ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు, వాటి స్థిరత్వానికి దోహదపడుతుంది. రుణాల పెరుగుదల ఆగిపోవటంతో పెట్టుబడులు, ఆదాయాలు తగ్గాయి. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ పన్నుల ఆదాయ వృద్ధి -3.22 శాతం నెగటివ్‌గా ఉంది. స్వయం సహాయక గ్రూపులకు ఇచ్చే రుణాలపై వడ్డీ రాయితీ చాలా కీలకమైన పథకం. మా ప్రభుత్వ హయాంలో డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ కింద రూ. 4,969 కోట్లు చెల్లించాం. అదనంగా ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా మహిళలకు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందించాం. ఇవన్నీ మహిళలకు స్వయం ఉపాధికి మంచి అవకాశాలుగా మారాయి. టీడీపీ-జనసేన కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో స్వయం సహాయక గ్రూపు రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా చేతులు ఎత్తేసింది.

## ప్రభుత్వం కోసం కష్టపడే ఉద్యోగుల
# భద్రతను కాపాడటం తమ బాధ్యత

మొదటి పేజి తరువాయి

రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం స్వయంగా ఒప్పందాలపై సంతకాలు చేసి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, ప్రభుత్వం కోసం కష్టపడే ఉద్యోగుల భద్రతను కాపాడటం తమ బాధ్యత అని చెప్పారు. ఉద్యోగులు అడగక ముందే ప్రభుత్వం ముందడుగు వేసి ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా బీమా ప్రయోజనాలు కొనసాగించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రమాద బీమా కింద ఉద్యోగులకు రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు కవరేజీ లభిస్తుందని తెలిపారు. విమాన ప్రమాదాల సందర్భంలో బ్యాంకులు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు బీమా రక్షణ అందిస్తాయని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఉద్యోగులందరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ స్పష్టం చేశారు. పీఆర్సీ విషయంలో ఇచ్చిన హామీని కూడా తప్పకుండా అమలు చేస్తామని చెప్పారు. ఉద్యోగుల నమ్మకమే ప్రభుత్వానికి బలమని, ప్రభుత్వాలు మారినా ఉద్యోగ వ్యవస్థ శాశ్వతమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉండేదని విమర్శించిన సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా తొలి రోజే జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయం పెరిగేలా ఉద్యోగులు ప్రతిరోజూ అదనంగా గంట పనిచేయాలని కోరారు. వచ్చే అదనపు ఆదాయాన్ని ఉద్యోగుల సంక్షేమానికే వినియోగిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాజకీయ అంశాలపైనా స్పందించిన సీఎం తాను “గుంపు మేస్త్రీ”నని, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేసే తన బృందానికి నాయకత్వం వహిస్తున్నానని అన్నారు. మూసీ నది ప్రక్షాళన, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

## అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ
# నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు, అభ్యసన ఫలితాలపై ఈ విద్యా సంవత్సరం ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల విద్యశాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖకు సంబంధించిన పలు కీలక వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు సుమారు 1,06,000 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని మొత్తం 7,620 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3,515 పాఠశాలలు (46.13 శాతం) ప్రస్తుతం పూర్తి సామర్థ్యంతో నడుస్తున్నాయని వారు వివరించారు. విద్యా రంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్లే ఈ సానుకూల మార్పు చోటుచేసుకుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణ అంశంపై కూడా ప్రధానంగా చర్చించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించి ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, నివేదిక సమర్పించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. మరోవైపు, సెప్టెంబర్ 5 నుంచి మొదటి విడత కింద 175 ‘లీప్’ పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థుల కోసం ‘ఏఐ ట్యూటర్’ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఈ విధానాన్ని ‘క్లిక్కర్స్’కు అనుసంధానించాలని మంత్రి అధికారులకు సూచించారు. అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, విశాఖపట్నంలో డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ, మంగళగిరిలో స్కిల్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. వచ్చే నెలలో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే రంగాన్ని పూర్తిగా దెబ్బతీశారని విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు రూ.కోటి పలికిన ఎకరం భూమి ప్రస్తుతం రూ.50-60 లక్షలకు కూడా కొనుగోలుదారులు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. రియల్ ఎస్టేట్‌పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ చెప్పారు. షాబాద్ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి మైక్రోసాఫ్ట్, అమెజాన్, వెల్స్‌పన్ వంటి అంతర్జాతీయ సంస్థలను తీసుకొచ్చామని చెప్పారు. పరిశ్రమల విస్తరణతో ఒకప్పుడు రూ.30 లక్షలు ఉన్న ఎకరం భూమి విలువ రూ.3 కోట్లకు చేరిందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు. రైతు బంధు, దళిత బంధు, ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూముల పట్టాల అంశాల్లో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వ అప్పులపై విమర్శలు చేసే కాంగ్రెస్ నేతలు తమ పాలనలో చేసిన అప్పుల లెక్కలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసమే ఖర్చయ్యాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## వెనెజువెలా జంట భూకంపాలు.. 40వేల మంది మిస్సింగ్

ఢిల్లీ: లాటిన్ అమెరికా దేశం వెనెజువెలాలో సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ విలయంలో మృతులు అంతకంతకూ పెరుగుతుండగా గల్లంతైన వారి సంఖ్య వేలల్లో ఉండటం విచారకరం. ప్రకృతి ప్రకోపానికి ఇప్పటివరకు 235 మంది బలైనట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. మరో 4300 మంది గాయపడినట్లు తెలిపింది. భవన శిథిలాల కింద ఇంకా అనేక మంది చిక్కుకున్నట్లు పేర్కొంది. ఈ వరుస భూకంపాల అనంతరం దాదాపు 40వేల మంది జాడ తెలియరాలేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వెనెజువెలా రాజధాని కారకాస్ సహా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఈ భూప్రకంపనలు సంభవించాయి. అయితే, అత్యంత తీవ్రంగా ప్రభావితమైన లా గువేరాలో మాత్రం పరిస్థితి దయనీయంగా ఉంది. భూకంపం ధాటికి ఈ తీర నగరం అతలాకుతలమైంది. ఇక్కడ 100కు పైగా భవనాలు నేలమట్టమైనట్లు సహాయక చర్యల్లో పాల్గొన్న ఐరాస ప్రతినిధులు వెల్లడించారు. వీటి కింద చిక్కుకున్నవారిని గుర్తించడం కూడా కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. శిథిలాలను తొలగించడానికి చాలా సమయం పడుతోందని తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా శిథిలాల దిబ్బగా మారినట్లు తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వెల్లడించారు. భూకంపం నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని ఐరాస ప్రతినిధులు వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. సోషల్ మీడియాతో ప్రజలు కీలక సమాచారాన్ని వేగంగా తెలుసుకోగలుగుతారని పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలా పౌరులకు ‘ఎక్స్’ అందుబాటులోకి వచ్చింది. 2024లో మదురో అధికారంలో ఉన్నప్పుడు ఈ మైక్రోబ్లాగింగ్ సైట్‌ను నిషేధించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఈ క్లిష్ట సమయంలో వెనెజువెలాను ఆదుకునేందుకు పలు దేశాలు ముందుకొస్తున్నాయి. 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని అందిస్తామని అమెరికా ప్రకటించింది. దీన్ని తరలించేందుకు ఇప్పటికే రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసింది. స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్, మెక్సికో, బ్రెజిల్ వంటి దేశాలు కూడా సహాయక సిబ్బంది, వైద్య సిబ్బంది, మానవతా సాయం అందించేందుకు సిద్ధమయ్యాయి.

## ప్రైవేటు కాలేజీల్లో ఫీజుల వసూలు..
# ప్రభుత్వానికి విజయశాంతి కీలక ప్రతిపాదన

హైదరాబాద్: తెలంగాణలోని ప్రైవేట్ కాళాశాలల యాజమాన్యాలు ఫీజులు వసూళ్లతో పాటు, కనీస విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సీనియర్ నేత విజయశాంతి డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులను ఆయా కళాశాలల్లో విద్యా నాణ్యత, ప్రమాణాల అమలుతో ముడిపెట్టాలని ఆమె సూచించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను విజయశాంతి స్వాగతించారు. అయితే, ప్రభుత్వ చెల్లింపులు, విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్ల కోసం ఆరాటపడే యాజమాన్యాలు, నాణ్యమైన విద్యను, కనీస వసతులను అందించడంలో విఫలమవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. “ఫీజులు వసూలు చేసే హక్కు ప్రైవేట్ యాజమాన్యాలకు ఉన్నప్పటికీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యతను కూడా వారు విధిగా నెరవేర్చాలి” అని ఆమె స్పష్టం చేశారు. గతంలో విజిలెన్స్ కమిషన్ సమర్పించిన నివేదిక సైతం పలు ప్రైవేట్ కళాశాలల్లో సరైన వసతులు లేవని స్పష్టం చేసిన విషయాన్ని విజయశాంతి గుర్తుచేశారు. ఈ అంశాన్ని తాను ఇదివరకే శాసనమండలిలో సైతం ప్రస్తావించినట్లు ఆమె తెలిపారు. ప్రజాధనంతో చెల్లించే రీయింబర్స్‌మెంట్ నిధులు విద్యార్థుల భవిష్యత్తుకు నిజమైన ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని విద్యా సంస్థలపై కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## పారిశ్రామికవేత్తల కోసం వారానికి ఒక రోజు కేటాయిస్తా...

హైదరాబాద్: పారిశ్రామికవేత్తల కోసం వారానికి ఒక రోజు కేటాయిస్తానని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కేవలం పెద్ద కంపెనీలకే కాకుండా చిన్న పరిశ్రమలకు, మహిళా, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు అందాలనేదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఇందుకోసం ప్రతి శుక్రవారం ఎంఎస్ఎంఈ సంఘాలు, పారిశ్రామిక రంగ ప్రతినిధులతో చర్చల కోసం సమయం కేటాయిస్తానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారికంగా ప్రకటించారు. ప్రజా ప్రభుత్వానికి పారిశ్రామిక వృద్ధి అంటే కేవలం పెట్టుబడుల గణాంకాలు మాత్రమే కాదని.. అది ప్రజల జీవనోపాధి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం నాడు హైటెక్స్ లో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్ పో 2026 ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం, పరిశ్రమల మధ్య ఎఫ్‌టీసీసీఐ ఒక బలమైన వారధిగా పనిచేస్తోందని అన్నారు. ‘పారిశ్రామిక ప్రదర్శన కేవలం యంత్రాలు, ఉత్పత్తుల ప్రదర్శన మాత్రమే కాదని, ఆలోచనలు పంచుకునే ఒక అద్భుత వేదిక’ అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ‘ఇక్కడ చిన్న వ్యాపారులకు కొత్త కస్టమర్లు, తయారీదారులకు సరికొత్త సాంకేతికత, స్టార్టప్‌లకు తొలి కొనుగోలుదారులు లభించే అవకాశం ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పెట్టుబడిదారుల నమ్మకాన్ని చూరగొని పటిష్టంగా వృద్ధి చెందిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని చెప్పుకొచ్చారు.మన వృద్ధి కేవలం సేవల రంగానికే పరిమితం కాకూడదని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. జీడీపీలో పారిశ్రామిక రంగం, ముఖ్యంగా ఎంఎస్ఎంఈల వాటా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి కల్పనలో, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మాన్యుఫ్యాక్చరింగ్ రంగం కీలకమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కేవలం పెద్ద కంపెనీలకే కాకుండా చిన్న పరిశ్రమలకు, మహిళా, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు అందాలనేదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఇందుకోసం ప్రతి శుక్రవారం ఎంఎస్ఎంఈ సంఘాలు, పారిశ్రామిక రంగ ప్రతినిధులతో చర్చల కోసం సమయం కేటాయిస్తానని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారికంగా ప్రకటించారు.

### ఈవీ వాహనాలపై 100% రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు

ఈ ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్ పోలో ఎలక్ట్రిక్ మొబిలిటీ, పునరుత్పాదక ఇంధనం, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి భవిష్యత్ సాంకేతికతలపై దృష్టి పెట్టడం అభినందనీయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. దేశంలో కంప్యూటర్ విప్లవానికి నాంది పలికిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల అన్ని కేటగిరీలపై 100% రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇచ్చిందని... కేవలం ఈవీలను వాడటమే కాకుండా వాటి సప్లై చైన్ టెక్నాలజీని ఇక్కడే అభివృద్ధి చేయడమే మన లక్ష్యం అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు.

## కేంద్ర కేబినెట్‌లో భారీ మార్పులు..
# లిస్టులో ఆర్‌బీఐ మాజీ గవర్నర్?

ఢిల్లీ: కేంద్ర మంత్రివర్గంలో త్వరలోనే భారీ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశాలపై ఢిల్లీ రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. జూన్ 28 (ఆదివారం) లేదా జూన్ 29 (సోమవారం) మంత్రివర్గ విస్తరణ, శాఖల పునర్విభజన జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్రపతి భవన్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. వివరాల ప్రకారం.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన తేదీలపై చర్చించినట్లు రాజకీయ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ సమాచారం అధికారికంగా ధృవీకరించబడలేదు. కాగా, ఈసారి యువత, ముఖ్యంగా జెన్-జీ (+వళ్ళ) ఆశయాలకు అనుగుణంగా కొత్త నాయకత్వానికి అవకాశం కల్పించాలనే ఆలోచనలో బీజేపీ అధిష్ఠానం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పనితీరు ఆధారంగా కొంతమంది సీనియర్ మంత్రులను తప్పించి, కొత్త ముఖాలకు అవకాశం కల్పించే అవకాశం ఉందని తెలుస్తోంది.

### మాజీ ఆర్‌బీఐ గవర్నర్ చాన్స్..

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత్ దాస్‌కు కేంద్ర కేబినెట్‌లో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అలాగే ప్రస్తుతం ఆర్థిక శాఖను నిర్వహిస్తున్న నిర్మలా సీతారామన్‌ను విద్యాశాఖకు మార్చి, ఆర్థిక శాఖకు కొత్త నాయకత్వాన్ని తీసుకురావచ్చని కూడా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురిలను మంత్రివర్గం నుంచి తప్పించే అవకాశముందని వార్తలు వస్తున్నాయి. అలాగే, గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన అనురాగ్ ఠాకూర్‌కు మళ్లీ కేబినెట్‌లో చోటు దక్కే అవకాశం ఉందని ప్రచారం కొనసాగుతోంది. ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలకు కూడా ప్రాధాన్యం పెంచే దిశగా కసరత్తు జరుగుతోందని సమాచారం. ముఖ్యంగా శివసేన (షిండే వర్గం) నుంచి ఎంపీ శ్రీకాంత్ షిండేకు కేబినెట్ మంత్రి పదవి దక్కే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అలాగే అరుణ్ గోవిల్, విష్ణుదత్ శర్మ, జనార్దన్ సింగ్ సిగ్రీవాల్ పేర్లు కూడా కొత్త మంత్రుల జాబితాలో బలంగా వినిపిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర సహాయ మంత్రి పంకజ్ చౌదరిని తప్పించే అవకాశం ఉందని, పంజాబ్‌లో రవ్నీత్ సింగ్ బిట్టూ స్థానంలో బీజేపీ నేత తరుణ్ చుగ్‌కు అవకాశం ఇవ్వవచ్చని ప్రచారం జరుగుతోంది.

నితీశ్‌కు అవకాశం..

ఇదే సమయంలో బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు కేంద్ర మంత్రివర్గంలో ప్రత్యేక స్థానం కల్పించే అంశంపైనా చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. అయితే దీనిపై కూడా అధికారిక స్పష్టత లేదు. ఇక కేంద్ర సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ వద్ద ఉన్న ఆరోగ్య శాఖ సహాయ మంత్రి బాధ్యతలను మార్చి, ఆయుష్ శాఖను మాత్రమే కొనసాగించే అవకాశం ఉందని, కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ వద్ద ఉన్న విద్యుత్ శాఖను మరో మంత్రికి అప్పగించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అంతేకాకుండా, పనితీరు సరిగా లేదనే అభిప్రాయంతో అరడజను మంది కేంద్ర సహాయ మంత్రులను (వీశీ) మంత్రివర్గం నుంచి తప్పించే అవకాశాలు కూడా ఉన్నాయని ఢిల్లీ రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

## క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు

హైదరాబాద్: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ కల నెరవేర్చే క్రమంలో వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివశిస్తున్న ప్రాంతాలలోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గారు స్పష్టం చేశారు. సచివాలయంలోని తన కార్యలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి గారు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీ లోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా జూన్ 28లోగా సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు. క్యూర్ పరిధిలో అత్యంత ముఖ్యమైన ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నామని ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ క్రింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే మోడల్ లో ఆర్.డి.ఓ., తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు.ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వీలైనంత త్వరితగతిన పనులు ప్రారంభించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే, ఆర్.డి.ఓ. తహశీల్దార్ కార్యాలయాల భవనాల మరమ్మత్తులకు సంబంధించి హౌసింగ్ ఏ.ఈ. లు భవనాలను విజిట్ చేసి ప్రతిపధనలు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి, డి.ఎస్. లోకేశ్ కుమార్, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ పకడ్బందీగా జరిగేలా బి ఎల్ ఏ లు కృషి చేయాలి బిజెపి లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ



నారాయణపేటజూన్26 లోకల్ గైడ్ :ఎన్నికల కమిషన్ ఓట్ల ప్రక్షాళనకు నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ నారాయణపేట జిల్లాలో పకడ్బందీగా జరిగేలా బిజెపి బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది బిజెపి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ ఒక ప్రకటనలో కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి బి ఎల్ ఏ లు దగ్గరుండి అధికారు లకు సహకరించాలని అన్నారు.ముఖ్యంగా దొంగ ఓట్లనుతొలగించాలని,రోహిగ్యాల ఒక్క ఓటు ఉండకుండా చూడాలని,వలస వెళ్లి అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారి ఓట్లను తొలగించాలని,చనిపోయిన వారి ఓట్లను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఓట్లను తొలగించాలని సూచించారు.అధికార కాంగ్రెస్,మైనార్టీ ఓట్లకు కక్కుర్తి పడే బి ఆర్ ఎస్ పార్టీలు పశ్చిమ బెంగాల్ నుంచి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో రోహిగ్యాలు జొరబడుతున్నారని అట్టి వారి ఓట్ల నమోదుకు ఆపార్టీలు పని చేస్తాయని హెచ్చరించారు.దీని పట్ల ప్రతి ఏజెంట్ అప్రమత్తంగా ఉండి దొంగ ఓట్లను నమోదు చేయకుండా అడ్డుకోవాలని కోరారు.

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పర్యవేక్షించిన కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట జూన్ 26: లోకల్ గైడ్ ఓటరు జాబితాల ఖచ్చితత్వం కోసమే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని, ఓట్లు తొలగిస్తారనే అపోహలను ఎవరూ నమ్మ వద్దని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. ఈ నెల 25 నుంచి ప్రారంభమైన (సర్) ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. అందులో భాగంగా నారాయణపేట మండలంలోని జాజాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని కలెక్టర్ పరిశీలించారు. గ్రామానికి చెందిన బసుదే కిష్టప్ప ఇంటికి వెళ్ళి స్వయంగా కలెక్టరే ఫారాలను పంపిణీ చేశారు. అంతేకాకుండా ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా నింపాలో ఇంటి యజమానికి అర్థం అయ్యేలా వివరించారు. నింపిన ఫారాలను రెండు, మూడు రోజుల్లో తిరిగి బీ ఎల్ వో లకు అందజేయాలని తెలిపారు. రెండు రోజుల్లో గ్రామంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలని బీ ఎల్ వో లను ఆమె ఆదేశించారు. ఫారాలు ఇచ్చేటప్పుడే ఓటర్ల అనుమానాలను బీఎల్ వోలు నివృత్తి చేయాలన్నారు. ఎలాంటి అపోహలకు తావు లేకుండా ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలలో అన్ని వివరాలు రాసి తిరిగి ఇచ్చేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం బసుదే కిష్టప్ప ఇంట్లో మగ్గంపై నేత కార్మికులు నేస్తున్న నారాయణపేట కాటన్ చీరలను ఆమె ఆసక్తిగా చూశారు. చీరలు నేసే మొత్తం ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. కిష్టప్ప ఇంట్లో ఉన్న కాటన్ చీరలను పరిశీలించి మూడు చీరలను కలెక్టర్ కొనుగోలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగీత, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## మహిళా కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని...



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్26(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం హనుమకొండలోని బాలసముద్రం 30వ డివిజన్ శ్రీనివాస నగర్‌లో సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలు, మహిళల ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.మహిళా కమ్యూనిటీ హాల్ స్థానిక మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు, సామాజిక, శిక్షణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళల సమావేశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, వివిధ సామాజిక కార్యక్రమాలకు ఈ భవనం కేంద్రంగా నిలుస్తుందన్నారు.పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం మహిళల అభ్యున్నతి లక్ష్యంగా పెట్టుకుని ప్రతి డివిజన్‌లో అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ అభివృద్ధిని వేగవంతం చేస్తోందని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## మేడ్చల్ డివిజన్ లో ఇందిరమ్మ చీరల పంపిణీ - మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ భరోసా




లోకల్ గైడ్ మేడ్చల్ న్యూస్,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్లలో ఎస్ హెచ్ జి మెంబర్ ప్రతి ఆడబిడ్డకు ఇందిరమ్మ చీర అందిస్తామని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ, పట్టణంలోని ప్రాథమిక బాలికల పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోనియా గాంధీ స్ఫూర్తితో ఇందిరమ్మ పేరుతో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నాం,కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు సముచిత గౌరవం స్థానం ఉంటుంది,మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు చేసి చూపించాం, త్వరలో మహిళా సంఘాలకు పెట్రోల్ బంకుల నిర్వహణ




బాధ్యతలు అప్పగిస్తాం, మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి రూ.500 గ్యాస్ సిలిండర్ తో ప్రతి ఇల్లు ఆనందంగా ఉండాలి వందలాది మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు స్వప్న, బాలమణి, జయమ్మ, అనిత, మేడ్చల్ మున్సిపాలిటీ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు గుండ శ్రీధర్ కురుమ,మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కుత్తడి నర్సింగ్ రావు, పెగుడ శ్యాంరావ్, చెవిటి అవినాష్,మహమ్మద్ అమీర్, అష్రఫ్,కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం చెడు వ్యసనాలను దూరంగా తరిమేద్దాం

### బంగారు భవిష్యత్తు కోసం యువత వ్యసనా లకు దూరంగా ఉండాలి. కలెక్టర్ ప్రియాంక ,ఎస్పీ వినీత్.




నారాయణపేట జూన్ 27 లోకల్ గైడ్ :డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నుండి సమాజాన్ని విముక్తి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెడు వ్యస నాలకు దూరంగా ఉండి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టా లని, యువత యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా పని చేయాలని జిల్లా కలెక్టర్ సి ఎచ్ ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ లు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్ర వ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, ఎస్పీ డా వినీత్ లు ముఖ్య అతిథిగా హాజరై



జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎస్పీ కార్యాలయం నుండి సత్యనారాయణ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం సత్యనారాయణ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ కు వ్యతిరేకంగా అందరూ కలిసి సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు బాధ్యత వహించాలన్నారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తోటి వారూ ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య దశలో బంగారు భవిష్యత్తు కోసం లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఫ్రెండ్స్ , ఎంజాయ్ అంటూ ఇప్పుడు తిరిగితే మన సమయం బాగా లేనప్పుడు మనకు తోడుగా ఎవ్వరూ రారని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. మిమ్మల్ని తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని, వాళ్ళు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని సూచించారు.అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్టేట్ ఈగల్ ఫోర్స్ టీం డ్రగ్స్ పై దాడులు నిర్వహిస్తున్నాయని, ప్రజలు యువత వాటికి దూరంగా ఉండాలని తెలిపారు.డ్రగ్స్ అనేవి ఒక విధంగా టెర్రరిస్ట్‌లాంటివని, ఇవి దేశ భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారిగా మారాయని తెలిపారు. యువత ఎక్కువగా ఉన్న భారతదేశాన్ని బలహీనపరచేందుకు డ్రగ్స్‌ను ఒక ఆయుధంగా ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఒక దేశాన్ని నాశనం చేయాలంటే అణుబాంబులు అవసరం లేదని, ఆ దేశ యువతను చెడు మార్గంలోకి నెట్టేస్తే చాలు అని తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే యువత భవిష్యత్తు పూర్తిగా అంధకారంలోకి వెళ్లిపోతుందని, అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్ అనేది జాతీయ భద్రత కు భంగం కలిగించేలా చేస్తుందని, అందువల్ల విద్యార్థులు, యువత ఈ చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండి దేశ అభివృద్ధికి పునాదులు వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమాజంలో అవగాహన పెంచుతూ యాంటీ నార్కోటిక్ డ్రగ్ వారియర్స్‌గా పని చేయాలని పిలుపునిచ్చారు.ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగం చేస్తున్నట్లు గమనించినట్లయితే 1908 టోల్ ఫ్రీ నంబర్ లేదా డయల్ 100 కు వెంటనే సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.డ్రగ్స్‌ను ఒక్కసారి తాకితే జీవితాంతం దాని ప్రభావం ఉండే ప్రమాదం ఉందని, అందువల్ల యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ సమాజాన్ని కాపాడే యోధులుగా మారాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్, ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్,ఆర్ ఐ విజయ్ భాస్కర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, గాయత్రి, కృష్ణ చైతన్య, ఎక్సైజ్ ఎస్ఐ లు,మరియు విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ పూర్తి..



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్26(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యుల ఓటరు వివరాల ఎన్యూమరేషన్ ప్రక్రియను అధికారులు శుక్రవారం పూర్తి చేశారు.బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ ప్రక్రియలో అధికారులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , వారి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి నమోదు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ఎంఆర్ఓ రవీందర్ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ (ఎన్నికలు) విఠలేశ్వర్, ఆర్ఐ దశరథ్ రామ్ రెడ్డి , స్థానిక బీఎల్వో సరస్వతి పాల్గొని అవసరమైన వివరాలను నమోదు చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల మేరకు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఓటర్లందరూ తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని సూచించారు.

## మహబూబాబాద్ మున్సిపాలిటీ 19వ వార్డు జర్నలిస్ట్ కాలనీలో బోర్ నూ ప్రారంభించిన కౌన్సిలర్ చిదిరాల అరుణ జ్ఞానేశ్వర్.



లోకల్ గైడ్ మహబూబాబాద్ మహబూబాబాద్ జిల్లా ప్రజా సమస్యల కోసం నిత్యం గళం విప్పే పాత్రికేయ సోదరుల అవసరాన్ని గుర్తించి, మహబూబాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ కాలనీలో ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను సోమవారం జర్నలిస్టుల ఆహ్వానం మేరకు 19వ వార్డు కౌన్సిలర్ చిదిరాల అరుణ -- జ్ఞానేశ్వర్ కొబ్బరికాయ కొట్టి, పసుపు--కుంకుమతో పూజలు నిర్వహించి, జర్నలిస్టులతో కలిసి ప్రారంభించి నీటి సరఫరాను అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు కౌన్సిలర్ దంపతులకు ఘనంగా సన్మానం చేసి కృతజ్ఞతలను తెలియజేశారు.అనంతరం జర్నలిస్టుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొని వినతిపత్రాలను స్వీకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ళు అందేలా కృషి చేస్తామని, కాంగ్రెస్ పార్టీ తరపున ఎల్లప్పుడూ ప్రజలకు అండగా నిలుస్తామని కౌన్సిలర్ చిదిరాల అరుణ -- జ్ఞానేశ్వర్ హామీ ఇచ్చారు.

## నేడే మెగా జాబ్ మేళా.




హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్26(లోకల్ గైడ్ న్యూస్): నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ. నేడు వరంగల్ లో కౌశల్ మహోత్సవాన్ని నిర్వహించనుంది అన్నారు.కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ లో కాలేజీ లో జరిగే ఈ కార్యక్రమంలో 50కి పైగా ప్రముఖ కంపెనీ యజమానులు పాల్గొని, తెలంగాణ వ్యాప్తంగా 5,000కు పైగా ఉపాధి, అప్రెంటిస్‌షిప్ అవకాశాలను అందిస్తారని ఎమ్మెస్ డీఈ డైరెక్టర్ వి ఎస్ అరవింద్, రీజనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ తౌటం రాము తెలిపారు. వరంగల్ కిట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేటి మెగా జాబ్ ఫెయిర్ వివిధ నైపుణ్య , విద్యా స్థాయిల వారికి సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు, నిరుద్యోగులు,యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. పాఠశాల విద్య పూర్తి చేసినవారైనా, ఐటీఐ పట్టభద్రులైనా, డిప్లొమా హోల్డర్ అయినా, లేదా విశ్వవిద్యాలయ డిగ్రీ కలిగి ఉన్నవారైనా, ఇక్కడ ప్రారంభ స్థాయి నుండి అనుభవజ్ఞుల కోసం ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు,అగ్రశ్రేణి నియామకదారులు హాజరై,కీలక పరిశ్రమలలో అక్కడికక్కడే ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఐటీ-ఐటీఈఎస్,టెలికాం బ్యాంకింగ్, ఆర్థిక సేవలు ఒ బీమా తయారీ, ఆటోమోటివ్, వస్త్ర పరిశ్రమలాజిస్టిక్స్, రిటైల్, హెల్త్‌కేర్, పర్యాటకం , ఆతిథ్యం తదితర సంస్థలు ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయన్నారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) అంతర్జాతీయ నియామకాల కోసం అర్హులైన అభ్యర్థులను చురుకుగా నియమించు కోనుందని తెలియజేశారు,ఈ అవకాశాన్ని నిరుద్యోగయువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిట్స్ కళాశాల ప్రిన్సిపల్ అశోక్ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఆఫీస్ వద్ద ( బ్యాంక్ మిత్ర )



నాగలవంచ రైల్వే కాలనీ :లోకల్ గైడ్ :పంచాయతీ ఆఫీస్ వద్ద ( బ్యాంక్ మిత్ర ) కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఈ సి ఎస్ పి కేంద్రం ద్వారా మన గ్రామంలో వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు ఇవ్వడం జరిగింది. ఈ ( బ్యాంకు మిత్ర ) కేంద్రం ద్వారా ప్రతినెల మన పంచాయతీ ఆఫీస్ వద్ద వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు మరియు ఇతర బ్యాంక్ లావాదేవీలు కరువు పని డబ్బులు ఇవ్వటం జరుగుతుంది. కావున గ్రామస్తులందరూ ఈ సి ఎస్ పి సేవలను మన గ్రామంలోనే పొచ్చు. ఇకనుంచి నాగలవంచ బ్యాంకుకు వెళ్లవలసిన పని లేకుండా పింఛన్లు ఇతర సేవలను పొందవచ్చును. పింఛన్దారులు వృద్ధులు వికలాంగులు వితంతువులు మాట్లాడుతూ మేము ఎన్నో ఏళ్ల నుంచి నాగలవంచ ఎండకు, వానకు తడిసి నడుచుకుంటూ వెళ్లి బ్యాంకు వద్ద పడి కాపులు కాసి పింఛన్లు తెచ్చుకునే వాళ్ళము. కానీ మన గ్రామంలో మొట్టమొదటిసారిగా పింఛన్లు తీసుకోవడం చాలా సంతోషంగా, ఆనందంగా ఉంది అని వారి ఆనందాన్నివ్యక్తం చేసినారు. అలాగే ఈ ( బ్యాంకు మిత్ర ) సేవలను మన గ్రామానికి ఎంతో కష్టపడి మాలాంటి వారి కోసం తీసుకువచ్చిన సర్పంచ్, ఉప సర్పంచ్ పాలకవర్గానికి వారు కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఉపేందర్ గారు వార్డ్ మెంబర్ లో నల్లబెల్లి మరియమ్మ, జక్కుల మానస, బత్తుల రాధమ్మ, లేతాకుల రవి గ్రామస్తులు బండి రామారావు గారు లేత ఆకుల గోపయ్య గారు కొంగల రవి ఇమ్మిడి నవీన్ గంధం వెంకటేశ్వర్లు ( ఎర్ర అబ్బాయి ) పంచాయతీ సిబ్బంది మాతంగి రాము, మరియన్ ( బాబురావు ) మొదలైన వాళ్ళు పాల్గొన్నారు.

## ఘనంగా ఆరంభమైన కోటి దేవిఖడ్గమాల స్తోత్ర పారాయణం



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్26(లోకల్ గైడ్ న్యూస్):హనంకొండ జిల్లా కాజీపేట లోని స్వయంభూ శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయం దివ్య క్షేత్రంలో నిజ జేష్ఠ శుద్ధ ద్వాదశి రోజున శుక్రవారం సందర్భంగా దేవి ఖడ్గమాల స్తోత్ర పారాయణమును కోటి సార్లు నిర్వహించేందుకు సంకల్పం చేసి ప్రారంభించారు. ముందుగా ఆది గణపతి ఆరాధన చేసి గణపతి పూజ పుణ్యాహవాచనం చేసుకొని మరి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ధరిత్రి నేతృత్వంలో ఆలయ పరిపాలక నిర్వాహకులు సాయి కృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఎంతోమంది మహిళలతో ఈ పారాయణాన్ని నిర్వహించారు. ముందుగా అయినవోలు రాధాకృష్ణ శర్మ సిద్ధాంతి గణపతి పూజ పుణ్యాహవాచనాన్ని జరిపించగా సాయి కృష్ణ శర్మ సిద్ధాంతి ఖడ్గమాల స్తోత్రం ను భక్తుల చే పటియింప చేస్తూ ఖడ్గమాల స్తోత్ర మహిమ, విశిష్టతను వివరిస్తూ శుక్రవారం రోజు నుంచి విశేష సంఖ్యలో భక్తులు ప్రత్యక్షంగా పరోక్షంగా ఈ యజ్ఞంలో పాల్గొని దీన్ని విజయవంతం చేయాలని తద్వారా అమ్మవారి యొక్క సంపూర్ణ ఆగ్రహాన్ని శ్వేతార్క గణపతి అనుగ్రహాన్ని పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమాదేవి . దరిత్రి ,సులోచన,సరోజన,ఉమా దేవి,ఉమా రాణి, అరుణ,కల్పన, అరుణ,సునీత,మంజూష,మాలిక,భాగ్య లక్ష్మి,మంజుల,సుజాత,శ్రావణి, సాయిరాం,వెంకట సాయి,వారికోల్ సాయి తేజ , తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: అదనపు డీసీపీ కుశాల్కర్

అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆర్వీఎం మెడికల్ కాలేజీలో పోలీసుల అవగాహన సదస్సు





లోకల్ గైడ్ ములుగు, జూన్ 26: అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ములుగు మండలంలోని ఆర్వీఎం మెడికల్ కాలేజీలో విద్యార్థులు, యువతకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వల్ల వ్యక్తితో పాటు కుటుంబం, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతుందని అన్నారు.సిద్దిపేట జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయం, వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల సరఫరా లేదా వినియోగంపై సమాచారం అందితే వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు, గజ్వేల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, తోగుట సీఐ లతీఫ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి, ములుగు ఎస్ఐ రఘుపతి, ఆర్వీఎం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, డీన్, కళాశాల యాజమాన్య ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోటమైసమ్మ ఆలయంలో వేలంపాట



ఖమ్మం జిల్లా, కారేపల్లి: లోకల్ గైడ్, జూన్ 26 : కారేపల్లి మండలం ఉసిరికాయల పల్లి కోట మైసమ్మ తల్లి ఆలయంలో ఏడాది కాలపరిమితి తో టెంట్ సామాను కిరాయికి ఇచ్చుకోవడానికి, కొబ్బరి చిప్పల పోగు చేసుకోవడానికి వేలం పాటను ఈనెల 29వ తారీఖున నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ పట్టాభి రామారావు, ఈవో కే. వెంకటయ్య తెలిపారు. జూలై 1వతేది నుండి 31జూన్2027 కాలపరిమితితో కోట మైసమ్మ తల్లి ఆలయ పరిసరాలలో టెంట్ సామానుల నిర్వహణ, కొబ్బరి చిప్పల పోగు చేసుకోవడానికి ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. టెంట్ హౌస్ నిర్వాణ కోసం రూ.లక్ష, కొబ్బరి చిప్పల కోసం రూ.5000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్న వచ్చిన తెలిపారు. కొబ్బరి చిప్పల పోగుకు జాతర సమయంలో 20 రోజులు అవకాశం లేదన్నారు. ఆ సమయంలో వేరే టెండర్ అమలులో ఉంటుందని తెలిపారు.

## బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ తొలి వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలి: సదన్ మహరాజ్

ఈనెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వార్షికోత్సవ సభ



లోకల్ గైడ్ సిద్దిపేట, జూన్ 26: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మత మైనారిటీ వర్గాలకు సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధించే లక్ష్యంతో ఏర్పాటైన బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ తొలి వార్షికోత్సవ సభను ఈనెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ సదన్ మహరాజ్ తెలిపారు.జేఏసీ ఆవిర్భవించి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సభకు విద్యావంతులు, మేధావులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.గత ఏడాది కాలంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలని జేఏసీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించి బీసీలను చైతన్యపరిచామని తెలిపారు.సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజ్యాధికార సాధనే జేఏసీ లక్ష్యమని పేర్కొంటూ, ప్రజలందరూ ఈ ఉద్యమానికి అండగా నిలవాలని సదన్ మహరాజ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు డి.బి. రాజు, కట్ల అంజిబాబు, నందు తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేట, పెరికబండ గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి.. మనోధైర్యం కోల్పోవద్దని ఓదార్పు



లోకల్ గైడ్ బెజ్జంకి, జూన్ 26: బెజ్జంకి మండలంలోని బేగంపేట, పెరికబండ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శుక్రవారం పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన ఆయన, ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ వారికి ఓదార్పునిచ్చారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న రసమయి బాలకిషన్, వారికి మనోధైర్యాన్ని కల్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మైపాల్ రెడ్డి, లింగాల లక్ష్మణ్, శేఖర్ బాబు, కల్లపల్లి సర్పంచ్ మోహన్, సంజీవరెడ్డి, మల్లేశం, దేవయ్య, సతీష్, తిరుపతి, శంకర్, సంపత్, శ్రీను, నరేష్, పోషమల్లు, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ వన్, గ్రూప్ 2,డీఎస్సీ నోటిఫికేషన్లు ఎప్పుడు? బిజెపి మండల ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్



నారాయణపేట జూన్ 26:నారాయణ పేట జిల్లా లో ఖాళీగా ఉన్న వాలంటీర్ లను తక్షణమే నియమించాలిఅశోక్ గౌడ్ బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నారాయణ పేట జూన్ 26 అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలండర్ ప్రకారం 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్న ఉద్యోగాలు ఏమయ్యాయని మాగనూరు మండల బిజెపి ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇప్పటివరకు ఏ ఒక్క నోటిఫికేషన్ తన సొంతంగా ఏసిందో నిరుద్యోగులకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వం ప్రజాపాలనా అంటూ నిరుపేద విద్యార్థులు మొత్తం కూడా కోచింగ్ సెంటర్లో నిమగ్నమై ఏళ్లకు ఏళ్ల తరబడి పెళ్లిళ్ళు చేసుకోలేక ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తూ ఉన్నారన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లను నేనిచ్చిన అని చెప్పి గొప్పలు చెప్పుకునే దౌర్భాగ్యపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విమర్శించారు. ఈరోజు ఉద్యోగాల విషయంలో ఏ మంత్రి చర్చకు వస్తారో ఎక్కడికి వస్తారు చెప్పండి వాటికి లెక్కలతో సహా ఆధారాలు తీసుకొని మేము వస్తాము అని సవాల్ చేశారు .నిరుద్యోగుల తరపున తక్షణమే జాబ్ క్యాలెండర్ను అమలు చేయాలనీ ఉస్మానియా యూనివర్సిటీ కి ఇస్తా అన్న 1000 కోట్ల నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.నారాయణ పేట జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వాలంటీర్ ను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు.

## అగ్నివీరునికి వీరతిలకం దిద్ది దేశ సేవకు పంపిన గ్రామస్తులు



నారాయణపేట జూన్ 26: లోకల్ గైడ్. భారత సాయుధ బలగాలలో దేశ సేవ చేయుటకు అగ్నివీర్ లో ఆర్మీ కి ఎంపికైన సి. కళ్యాణ్ కు కుటుంబ సభ్యులు గ్రామస్తులు వీరతిలకం దిద్ది దేశ సేవ చేయుటకు శుక్రవారం పంపారు. హైద్రాబాద్ లో శిక్షణ కోసం వెళ్తున్న ఆర్మీ జవాన్ కు పూలమాల తో సన్మానం చేసి అభినందలు తెలిపారు. దేశసేవకు యువకులు గ్రామగ్రామల నుండి వెళ్లడం గర్వకారణం అని తెలిపారు. వారిని కన్న తల్లిదండ్రులకు ప్రతి భారతీయుడు రుణపడి ఉన్నారు అని అన్నారు. దేశసేవ అన్ని సేవల కన్న గొప్పది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్మీ జవాన్ తల్లిదండ్రులు చిన్న చంద్రప్ప, శంక్రమ్మ, అంజయ్య, చంద్రప్ప, హెచ్. నర్సింహా,గోవర్ధన్, నర్సప్ప, మహబూబ్ అలీ, జనార్దన్ గౌడ్,అశోక్,బడేసాబ్, ఉమాంసాబ్, మాల గోవింద్, ఆంజనేయులు, వేణుగోపాల్ చారి, రాములు, తిప్పన్న, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్ కార్యాలయం...





లోకల్ గైడ్. ఖమ్మం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రత ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ డీసీపీ చింతకాని మండలం జగన్నాథపురంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అడిషనల్ డీసీపీ రామానుజం భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటించే మార్గాలు, సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు, వీఐపీ కాన్వాయ్ ప్రయాణించే రూట్లలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయాలు కలగకుండా చర్యల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.రైతు మేళాకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఖమ్మం...




లోకల్ గైడ్. సత్తుపల్లి.మాధకద్రవ్యాల నిర్మూలన నేటి తరం విద్యార్థుల చేతుల్లోనే ఉందని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ అన్నారు.



మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రజలకు అవగాహన కల్పించేందుకు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలో సత్తుపల్లిలోని త్రివేణి పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కల్లూరు ఏసీపీ మాట్లాడుతూ.... మాదకద్రవ్యాల నివారణ సమాజంలో అందరి బాధ్యతని, యువత మాదకద్రవ్యాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోవొద్దని అన్నారు. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల రవాణా అధికంగా జరుగుతుందన్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం దృష్టిసారించిందన్నారు.పెడదారి పడుతున్న యువత కు కళాశాలల్లో కౌన్సిలింగ్ కల్పించాలని తల్లిదండ్రులు సైతం పిల్లల ప్రవర్తన పై దృష్టి సాధించాలని సూచించారు.

## సంఘ బలోపేతానికి రాష్ట్రస్థాయి పద్మశాలి ఉద్యోగుల సదస్సు దోహదం

అనంతుల లక్ష్మీనారాయణ

ఘనంగా నిర్వహించిన తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సదస్సు

హాజరైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు




లోకల్ గైడ్ : భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ( టిపియూఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పద్మశాలి ఉద్యోగుల సదస్సు సంఘ బలోపేతానికి, ఐక్యతకు ఎంతగానో దోహదపడుతుందని ఆ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు అనంతుల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో సంఘ రాష్ట్ర సంస్థాగత అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ ఉన్నత స్థాయి సదస్సు అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.

### హక్కుల పరిరక్షణే ధ్యేయం

ఈ సందర్భంగా జరిగిన సదస్సులో పద్మశాలి ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలు, సేవా కార్యక్రమాల విస్తరణ దిశగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి విచ్చేసిన ప్రతినిధులతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈ చర్చల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, సంఘ భవిష్యత్ కార్యాచరణ, సేవా కార్యక్రమాల విస్తరణపై జిల్లా సభ్యులు తమ అమూల్యమైన అభిప్రాయాలను, సూచనలను సదస్సులో పంచుకున్నారు. రాష్ట్ర సదస్సును అత్యంత విజయవంతంగా నిర్వహించిన రాష్ట్ర కమిటీకి ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గం ప్రత్యేక అభినందనలు తెలియజేసింది.ఈ రాష్ట్రస్థాయి సదస్సులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి జిల్లా అధ్యక్షులు అనంతుల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి దూలం నట్రాజ్, సంస్థాగత కార్యదర్శి పసునూతి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షురాలు కొండి పద్మజ, సంయుక్త కార్యదర్శి వన్నాల విద్యాసాగర్, నిర్వాహక కార్యదర్శి బాతాల వెంకటేశ్వర్లు, క్రియాశీలక సభ్యురాలు విజయ లక్ష్మి లతోపాటు జిల్లాకు చెందిన ఇతర ముఖ్య నాయకులు, పద్మశాలి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## 108 ఉచిత అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి- రవికుమార్



నారాయణపేట జూన్ 26: 108అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవికుమార్ అన్నారు. నారాయణపేట జిల్లా 108 మేనేజర్ సునీల్ కుమార్ తో కలిసి మాగనూర్ ప్రాథమిక కేంద్రంలో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాగనూరు 108 అంబులెన్స్‌లోని సౌకర్యాలు, అత్యవసర వైద్య పరికరాల పనితీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుత రోడ్డు ప్రమాదాలు, పాము కాటు బాధితులు, పాయిజన్ కేసులు మరియు ఏ ఇతర వైద్య సేవలపై బాధితులకు అందించాల్సిన అత్యవసర ప్రథమ చికిత్సపై 108 అంబులెన్స్ సిబ్బందికి ఆయన కీలక సూచనలు చేశారు. బాధితులను ఆసుపత్రికి తరలించే లోపే వారి ప్రాణాలను కాపాడేందుకు తీసుకోవాల్సిన ప్రథమ చికిత్స కు సంబంధించిన పలు జాగ్రత్తలను వివరించారు. అంబులెన్స్‌లో మెడికల్ కిట్లు, పరికరాలుఅవసరమైన మందుల నిల్వలను తనిఖీ చేసి, గడువు ముగిసిన మందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. వైద్య పరికరాలతో పాటు అంబులెన్స్ వాహన పరిస్థితిపై కూడా ఆయన సమీక్షించారు. అత్యవసర సమయాల్లో వాహనం మొరాయించకుండా ఎప్పటికప్పుడు మెకానికల్ చెకప్ చేయించుకోవాలని పైలట్లకు సూచించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణదాతలుగా నిలవాలని సిబ్బందిని కోరారు. ఈ తనిఖీలో 108అంబులెన్స్ సిబ్బంది, టెక్నీషియన్ రాకేష్, పైలెట్ అనిల్, పాల్గొన్నారు.

## వైరాలో నూతన మహిళా క్లబ్ గా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆవని మహిళల సేవ మార్గంలో నడవాలి

మహిళలే మహారాణులు

ఎల్ సి ఎఫ్ ఐ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు



ఖమ్మం వైరా జూన్ 26:లోకల్ గైడ్ : వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైరాలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆవని నూతన క్లబ్ ను ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు జిఎంటి కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాం బాబు క్లబ్బు మహిళా కోఆర్డినేటర్ మాదినేని సునీత ఆధ్వర్యంలో ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ సూచనల మేరకు వారి ప్రతిపాదనలతో మహిళ క్లబ్ ను నిరాడంబరంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు కూడా సేవా రంగంలో ముందుండాలని రాజకీయ రంగంలో కూడా రాణిస్తూ కూడా సేవా మార్గంలో కూడా మరింతగా సేవలందించాలని మహిళలే మహారాణులు గా సేవలు అందించాలని ఉద్దేశంతో మహిళా ను ఏర్పాటు చేయటం జరిగిందని ఎల్సీఎఫ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు పేర్కొన్నారు ఈ సందర్భంగా జిఎంటి కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు మాట్లాడుతూ వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం లయన్స్ క్లబ్ కొణిజర్ల క్లబ్బును ఏర్పాటు చేశామని ఈరోజు మహిళ క్లబ్ ను కూడా జిల్లా 320ఈ గవర్నర్ మదన్మోహన్ రేపాల ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ సూచనలు మేరకు వైరాలో ఈరోజు మహిళా క్లబ్ ను ఏర్పాటు చేశామని మహిళలను కూడా అన్ని రంగాలతో పాటు లయన్స్ క్లబ్ సేవలను కూడా వారి సేవలను సమాజంలోఉపయోగించుకోవాలని ఉద్దేశంతో ఈ మహిళల క్లబ్ ను ఏర్పాటు చేయటం జరిగిందని ఆయన స్పష్టం చేశారు అనంతరం మహిళ నూతన క్లబ్ లయన్స్ క్లబ్ ఆఫ్ వైరాఆవని గా నామకరణం చేసిఈ రోజు ఏర్పాటు చేశామని తెలిపారు. నూతన క్లబ్ మహిళ అధ్యక్షులుగా గద్దె నీరజ ఉపాధ్యక్షులుగా పువ్వాళ జయశ్రీ సెక్రటరీగా సుగ్గల మాధవి జాయింట్ సెక్రటరీగా పైడిపల్లి శ్రావణి కోశాధికారిగా కొదుమూరి భాగ్యలక్ష్మిఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. పదిమందిని సభ్యులుగా చేర్చుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ చింతో జు నాగేశ్వరరావు రీజియన్ సెక్రటరీ జిల్లా డైరీ అసోసియేట్ ఎడిటర్ పెనుగొండ ఉపేందర్ రావుజిల్లా ఉమెన్స్ కేర్ కోఆర్డినేటర్ మాదినేని సునీత నూతన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ తిరుమల సీడ్స్ ఢ పెర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ షాప్‌ను ప్రారంభించిన నాగులవంచ సర్పంచ్ నారగాని రాంబాయి -- శ్రీనివాసరావు దంపతులు



నాగులవంచ :లోకల్ గైడ్ : మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ తిరుమల సీడ్స్ ఢ పెర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ షాప్‌ను గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి -- శ్రీనివాసరావు దంపతులు రూబ్బెన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్ యాజమాన్యం వారికి ఘన స్వాగతం పలికి, ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ నారగాని రాంబాయి మాట్లాడుతూ... రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఒకే చోట అందుబాటులో ఉండడం వ్యవసాయాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. రైతులు ఎల్లప్పుడూ నాణ్యత కలిగిన వ్యవసాయ ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేసి, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు వినియోగించాలని సూచించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో ఇలాంటి వ్యవసాయ సేవా కేంద్రాలు ఏర్పాటు కావడం అభినందనీయమని అన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా షాప్ యాజమాన్యం పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో... గ్రామ ఉపసర్పంచ్ అంబటి శరత్, శ్రీ గజగిరి లక్ష్మీ నరసింహ స్వామి మరియు కోదండరామ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ ముత్తినేని వెంకటేశ్వర్లు,గ్రామ పెద్దలు వంకాయలపాటి లచ్చయ్య, రైతులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు, పాల్గొన్నారు

## గోపాలపూర్ ఊర చెరువు బాధితులకు హైకోర్టులో ఊరట.



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్26(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ,గోపాల పూర్ ఊర చెరువులో జరుగుతున్న పనులపై నాలుగు వారాల పాటు స్టే విధించి తదుపరి విచారణ వరకు పనులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసిందని కందుకూరి శ్రీనాథ్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోపాలపూర్ వాసులతో కలిసి శ్రీనాథ్ మాట్లాడుతూ అభివృద్ధి పేరిట గోపాలపూర్ ఊర చెరువు కట్టరిటర్నింగ్ వాల్ నిర్మాణం పేరుతో గోపాలపూర్ వాసుల సమాధులను కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ గోపాలపూర్ గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారని,దళితులు, బీసీల సమాధులు తొలగిస్తున్నారని పిటిషన్లో పేర్కొన్నామన్నారు. బాధితుల పిటిషన్ను విచారించిన హైకోర్టు చెరువులో జరుగుతున్న పనులపై నాలుగు వారాల పాటు స్టే విధించి తదుపరి విచారణ వరకు పనులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్మశాన వాటికకు కేటాయించిన మూడు ఎకరాల స్థలాన్ని అన్యక్రాంతం కాకుండా ప్రహరీ గోడ నిర్మించి, కూల్చిన సమాధులను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరి మహేందర్, ఇమ్మడి రాజేంద్రప్రసాద్, గిన్నారపు రాజు, ఇమ్మడి అశోక్ బాబు, నూతన్, శ్రీకాంత్,గొర్రె సతీష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## చైతన్య కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ కామర్స్ లెక్చరర్ కరుణాకర్**






(లోకల్ గైడ్ షాద్ నగర్ ) షాద్నగర్ పట్టణంలోని చైతన్య కళాశాల 2005 - 2007 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ విద్యార్థులు నక్షత్ర బంకెట్ హాల్లో అపూర్వ సమ్మేళనం పేరిట ఎంపీసీ పూర్వ విద్యార్థులంతా ఎంతో ఉత్సాహంతో కలుసుకున్నారు.కార్యక్రమంలో వాళ్లకు పాఠాలు బోధించిన ఉపన్యాసకులను సన్మానించి పాత జ్ఞాపకాలను పరస్పరంపంచుకున్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కామర్స్ లెక్చరర్ మరియు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్... విద్యార్థులందరినీ అభినందించారు ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలలో మంచి ఉద్యోగాలు నిర్వహిస్తూ చక్కని స్థాయిలో ఉన్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు అధ్యాపకులు సాకేత్ ప్రవీణ్ మాట్లాడుతూ..... పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు గురుశిష్యుల మధ్య అనుబంధాన్ని మరింత పటిష్టం చేస్తాయని ఇలాంటి సమ్మేళనాలు జరగాలని అభిప్రాయపడ్డారు రసాయన శాస్త్ర అధ్యాపకులు కృష్ణయ్య గణిత శాస్త్ర అధ్యాపకులు శ్రీ వర్ధన్ రెడ్డి ఆంగ్లో ఉపన్యాసకులు రాజశేఖర్ రావు ముజఫర్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులలో రాజకీయ నాయకులు లెక్చరర్లు బ్యాంకు ఉద్యోగులు సాఫ్ట్వేర్ రంగంలో పనిచేస్తున్న విద్యార్థులు అనేక ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలలో బాధ్యతలు నిర్వహిస్తున్న వారిని ఉపన్యాసక బృందం అభినందించి ఆశీర్వదించారు. సమాజ సేవకులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఆద్యంతం ఆనందోత్సాహాల మధ్య మధుర జ్ఞాపకాల మధ్య సాగిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## జూలై 2 'భూ పోరాటం'ను విజయవంతం చేయాలి: -టీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జి సలేంద్ర కొమురయ్య




పెద్దపల్లి , జూన్ 26: (లోకల్ గైడ్ )తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం జూలై 2న హైదరాబాద్ ఉప్పల్ భగాయత్లో నిర్వహించనున్న 'భూ పోరాటం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇంచార్జి సలేంద్ర కొమురయ్య పిలుపునిచ్చారు. టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్లో నిర్వహించిన మీడియా సమావేశంలో సలేంద్ర కొమురయ్యతో పాటు తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ బోగే పద్మ, నాయకుడు మట్ట రాజయ్య పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు త్యాగాలు చేసి, జైలు జీవితం గడిపి, అమరులయ్యారని గుర్తు చేశారు. అలాంటి ఉద్యమకారులు ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, నెలకు రూ.25 వేల పింఛన్, గుర్తింపు కార్డులు అందజేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు ఆ హామీల అమలులో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. జీవో జారీ చేసి, కేకే కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ సమస్య పరిష్కారంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఉద్యమకారులకు అండగా నిలుస్తూ జూలై 2న ఉప్పల్ భగాయత్లో 'భూ పోరాటం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని మిలియన్ మార్చ్ను తలపించేలా విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు పోతు కనకయ్య, దుస్స రవీందర్, హుస్సేన్ రజాక్, అవుదుర్తి శ్రవణ్, బోగే రాజేశ్వరి, దేవా అనసూర్య, అనంతగిరి సంపత్, చామనపల్లి చంద్రశేఖర్తో పాటు టీఆర్ఎస్ నాయకులు బొంగోని శంకరయ్య, దేవనంది లక్ష్మయ్య, సీహెచ్ హనుమాన్లు, కె. రవీందర్, గడ్డం నరసింహ, బి మహేష్, బొంకూర్ సుభాష్, బొల్లబత్తుల భూమయ్య, అంబాల మహేష్, పెద్ద కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**జూన్ 28న పోలియో బూత్ డే 0-5 ఏళ్ల చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి**



పెద్దపల్లి, జూన్-26:(లోకల్ గైడ్ )పెద్దపల్లి జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి,కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 28న 'బూత్ డే' నిర్వహిస్తున్నట్లు, ఆ తర్వాత 29, 30 తేదీలలో ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు జిల్లా వ్యాప్తంగా 62,902 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, పోలియో చుక్కల పంపిణీ కోసం జిల్లాలో 381 బూత్లు, 25 మొబైల్ టీమ్స్, 24 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి చిన్న పిల్లల వివరాలను సేకరించాలని, ముఖ్యంగా వలస కూలీలు, ఇటుక బట్టీలు, నిర్మాణ రంగంలో పనిచేసే వారి పిల్లలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉండే అవకాశం ఉన్నందున, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్ల వంటి రద్దీ ప్రదేశాలలో ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా ప్రయాణికులకు కూడా సేవలందించాలని, ఈ ప్రక్రియలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు విద్యా, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారుల సమన్వయం తప్పనిసరి అని, ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకూడదని,అధికారులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కల్లూరుగూడెం ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించాలి...

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు**





(లోకల్ గైడ్. సత్తుపల్లి.)దేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణలో తెలంగాణ నెంబర్-1... గత ఐదేళ్లలో కొత్తగా సాగులోకి వచ్చిన విస్తీర్ణంలో 36 శాతం తెలంగాణదేరాష్ట్రంలో ప్రస్తుతం 2.44 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు... 10 లక్షల ఎకరాలకు విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యంవేంసూరు మండలం కల్లూరుగూడెం ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మలవేంసూరు, --ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఆగస్టు 15 నాటికి ప్రారంభించేలా అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు.శుక్రవారం వేంసూరు మండలం కల్లూరు గూడెంలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ఫ్యాక్టరీ నిర్మాణ పురోగతి, యంత్రాల ఏర్పాటు, మిగిలిన పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూదేశంలో ప్రస్తుతం 15.70 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు జరుగుతోందని తెలిపారు. దేశం వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే 70 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్--ఆయిల్ పామ్ (ఎన్ఎంఈఓ-ఓపీ) పథకం క్రింద గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 6.82 లక్షల ఎకరాల్లో కొత్తగా ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, అందులో 2.44 లక్షల ఎకరాలు అంటే 36 శాతం తెలంగాణలోనే విస్తరించడం రాష్ట్రం సాధించిన గొప్ప విజయమని మంత్రి పేర్కొన్నారు. దేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణలో తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 79,448 మంది రైతులు 2.94 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని తెలిపారు. రానున్న రెండు మూడు సంవత్సరాల్లో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.గతంలో రాష్ట్రంలో కేవలం రెండు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు మాత్రమే ఉండేవని, రైతుల అవసరాలకు అనుగుణంగా కొత్త ఫ్యాక్టరీల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధిపేటలో నూతన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించారని, ప్రస్తుతం కల్లూరుగూడెంలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం చివరి దశకు చేరుకుందని, ఆగస్టు 15న ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు అనుగుణంగా ప్రతి జిల్లాలో ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో ఆయిల్ పామ్ గెలల ధర టన్నుకు రూ.12 వేలుగా ఉండేదని, ప్రభుత్వం చేసిన నిరంతర కృషి ఫలితంగా ప్రస్తుతం టన్నుకు రూ.23,852కు పెరిగిందని మంత్రి తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసంతో పాటు శ్రీరామచంద్రుని అనుగ్రహంతో ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే అవకాశం లభించిందన్నారు. జిల్లాలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులను కూడా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.బుగ్గపాడులో ప్రస్తుతం ఏర్పాటు అవుతున్న పరిశ్రమతో పాటు మరో రెండు మూడు నెలల్లో మరో రెండు మూడు పరిశ్రమలు కూడా వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.అభివృద్ధి అన్ని రంగాల్లో ఖమ్మం జిల్లాను తెలంగాణలోనే నెంబర్ వన్ జిల్లాగా నిలపడం తన లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 28,29 న జరిగే రైతు మేళాను రైతులు వినియోగించుకోవాలి.. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**150 స్టాళ్లతో అధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన ప్రదర్శనలు**

**జూన్ 30న నిర్వహించే రైతు ఆశీర్వాద సభ కు పకడ్బందీగా ఏర్పాట్లు**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన కు కట్టుదిట్టమైన భద్రత**

**చింతకాని మండలం జగన్నాథపురం వద్ద స్టాల్స్, స్టేజి, భోజనం వసతులు, పార్కింగ్ ఏర్పాట్ల పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



ఖమ్మం, జూన్ - 26:లోకల్ గైడ్ :ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం జగన్నాథపురం వద్ద ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రైతు మేళా, ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమ ప్రాంగణంలోని స్టాళ్లు, ప్రధాన వేదిక, భోజనశాలలు, పార్కింగ్ స్థలాలు, ప్రజల రాకపోకల మార్గాలు, పారిశుధ్య ఏర్పాట్లు, తాగునీటి వసతులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, జూన్ 28, 29, 30 తేదీల్లో నిర్వహించే రైతు మేళాలో 150కు పైగా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్య, పాల ఉత్పత్తి, సేంద్రీయ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సాగు పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వంటి విభిన్న రంగాలకు సంబంధించిన ప్రదర్శనలు రైతులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల రైతులు సద్వినియోగం చేసుకొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలని పిలుపునిచ్చారు.రైతులకు ప్రత్యక్ష అనుభవం కలిగేలా ఆధునిక వ్యవసాయ యంత్రాల ప్రదర్శనలు, అధిక దిగుబడులు అందించే సాగు పద్ధతులపై ప్రత్యేక డెమోలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి రైతుల



సందేహాలకు ప్రత్యక్షంగా సమాధానాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతు మేళాకు వచ్చే ప్రతి రైతుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, భోజన వసతులు, సమాచార కేంద్రాలు, తగిన సంఖ్యలో కౌంటర్లు, విశాలమైన పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. మహిళా రైతులు, వృద్ధులకు సౌకర్యాలను ప్రత్యేకంగా దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని సూచించారు.జూన్ 30న నిర్వహించే ముఖ్యమంత్రి రైతు ఆశీర్వాద సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి ఏర్పాట్లను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, పశుసంవర్ధక, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య, మిషన్ భగీరథ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15 నాటికి కల్లూరుగూడెం ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించాలి...

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు**

**దేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణలో తెలంగాణ నెంబర్-1... గత ఐదేళ్లలో కొత్తగా సాగులోకి వచ్చిన విస్తీర్ణంలో 36 శాతం తెలంగాణదేరాష్ట్రంలో ప్రస్తుతం 2.44 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు... 10 లక్షల ఎకరాలకు విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యం వేంసూరు మండలం కల్లూరుగూడెం ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల**



వేంసూరు, జూన్ -26:లోకల్ గైడ్ :ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఆగస్టు 15 నాటికి ప్రారంభించేలా అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు.శుక్రవారం వేంసూరు మండలం కల్లూరు గూడెంలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ఫ్యాక్టరీ నిర్మాణ పురోగతి, యంత్రాల ఏర్పాటు, మిగిలిన పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం 15.70 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు జరుగుతోందని తెలిపారు. దేశం వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే 70 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్--ఆయిల్ పామ్ (ఎన్ఎంఈఓ-ఓపీ) పథకం క్రింద గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 6.82 లక్షల ఎకరాల్లో కొత్తగా ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, అందులో 2.44 లక్షల ఎకరాలు అంటే 36 శాతం తెలంగాణలోనే విస్తరించడం రాష్ట్రం సాధించిన గొప్ప విజయమని మంత్రి పేర్కొన్నారు. దేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణలో తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 79,448 మంది రైతులు 2.94 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని తెలిపారు. రానున్న రెండు మూడు సంవత్సరాల్లో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.గతంలో రాష్ట్రంలో కేవలం రెండు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు మాత్రమే ఉండేవని, రైతుల అవసరాలకు అనుగుణంగా కొత్త ఫ్యాక్టరీల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధిపేటలో నూతన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించారని, ప్రస్తుతం కల్లూరుగూడెంలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం చివరి దశకు చేరుకుందని, ఆగస్టు 15న ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు అనుగుణంగా ప్రతి జిల్లాలో ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో ఆయిల్ పామ్ గెలల ధర టన్నుకు రూ.12 వేలుగా ఉండేదని, ప్రభుత్వం చేసిన నిరంతర కృషి ఫలితంగా ప్రస్తుతం టన్నుకు రూ.23,852కు పెరిగిందని మంత్రి తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసంతో పాటు శ్రీరామచంద్రుని అనుగ్రహంతో ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే అవకాశం లభించిందన్నారు. జిల్లాలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులను కూడా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. బుగ్గపాడులో ప్రస్తుతం ఏర్పాటు అవుతున్న పరిశ్రమతో



పాటు మరో రెండు మూడు నెలల్లో మరో రెండు మూడు పరిశ్రమలు కూడా వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.అభివృద్ధి అన్ని రంగాల్లో ఖమ్మం జిల్లాను తెలంగాణలోనే నెంబర్ వన్ జిల్లాగా నిలపడం తన లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సీఎస్‌గా సంజయ్ జాజు నియామకం



హైదరాబాద్: తెలంగాణ సీఎస్‌గా సంజయ్ జాజును నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి, ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజు తెలంగాణకు తిరిగి వచ్చారు. ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న కె. రామకృష్ణారావు పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. సంజయ్ జాజు ప్రస్తుతం ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. మూడు రోజుల కిందట ఆయన కేంద? సర్వీసుల నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన అంతకుముందు సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ ముఖ్యకార్యదర్శిగా, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా, విశాఖపట్టణం కమిషనర్‌గా, పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా, సహాయ పునరావాస శాఖ కమిషనర్‌గా, నీటిపారుదల ఆయకట్టు ప్రాంత అభివృద్ధి శాఖ కమిషనర్‌గా, ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీగా పనిచేశారు.

## ఆస్పత్రిలో ముద్రగడను పరామర్శించిన బొత్స, తోట త్రిమూర్తులు




హైదరాబాద్: మాజీ మంత్రి, కాపు నేత ముద్రగడ పద్మనాభం తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్ హైటెక్ సిటీలోని సింధు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కిడ్నీ సంబంధిత సమస్యల కారణంగా ఆయన్ను ఆసుపత్రిలో చేర్పించగా, ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.ముద్రగడ అనారోగ్యం గురించి తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు ఇద్దరూ ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందుతున్న వైద్య సేవలను, ఆరోగ్యం మెరుగుపడుతున్న తీరును అక్కడి వైద్యులను అడిగి ఆరా తీశారు. ముద్రగడ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ముఖ్య నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు కూడా ఆసుపత్రికి వెళ్లి ముద్రగడను పరామర్శించిన విషయం తెలిసిందే.

## రాహుల్‌పై బీజేపీ 'మీమ్స్' వార్.. కాంగ్రెస్ కౌంటర్




ఢిల్లీ: రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపై సోషల్ మీడియా వేదికగా బీజేపీ మరో డిజిటల్ వార్ మొదలుపెట్టింది. రాహుల్ విదేశీ పర్యటనలపై మీమ్స్‌తో పోస్టులు పెడుతూ.. విమర్శలు గుప్పిస్తోంది. రాహుల్ గాంధీ ఎక్కడున్నారు? ఆయన తరచూ చేసే విదేశీ పర్యటనలకు అయ్యే ఖర్చు ఎక్కడి నుంచి వస్తోందంటూ నిలదీసింది. బీజేపీ విమర్శలకు కాంగ్రెస్ పార్టీ కౌంటర్ ఇస్తూ.. రాహుల్ గాంధీ గ్లోబల్ లీడర్ అని.. అనేక దేశాలు, సంస్థలు ఆయనను ఆహ్వానిస్తుంటాయంటూ పేర్కొంది. ప్రముఖ సినిమా టైటిళ్ల ఆధారంగా రూపొందించిన 'ఛడ్ దే ఇండియా' (ఇండియాను వదిలేయ్), 'లాపతా రాహుల్' (కనిపించకుండా పోయిన రాహుల్) పోస్టర్లతో బీజేపీ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. గో రాహుల్ గాన్, టూరిస్ట్ జిందా హై, పరదేశ్ వంటి మరికొన్ని పోస్టర్లు కూడా వైరల్‌గా మారాయి. రాహుల్ గాంధీపై బీజేపీ విమర్శలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ప్రపంచవ్యాప్తంగా చాలా మంది ఆయనను కలవాలని అనుకుంటున్నారని స్పష్టం చేసింది. ఆయన చాలా తక్కువ సమయం మాత్రమే కేటాయించగలరు కాబట్టి, ఆయన పర్యటనలు చిన్నవిగా, తరచుగా ఉంటాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ పేర్కొన్నారు. "రాహుల్ గాంధీ కేవలం మన దేశానికి మాత్రమే నాయకుడు కాదు. ప్రపంచవ్యాప్తంగా చాలా మంది ఆయనను ఒక గొప్ప నాయకుడిగా భావిస్తారు. చాలా మంది ఆయన కోసం ఎదురుచూస్తున్నారు. ఈ వరుస ఆహ్వానాల కారణంగా ఆయన కేవలం రెండు రోజులు, నాలుగు, ఐదు రోజులు మాత్రమే సమయం కేటాయించి ప్రయాణిస్తున్నారు. ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్కరూ బీజేపీతో ఏకీభవించరని గ్రహించాలి. ప్రజలు భారతదేశాన్ని విభిన్న కోణాల్లో చూస్తారు, ఆ కోణంలోనే వారు రాహుల్ గాంధీని కూడా చూస్తారు" అని ఖుర్షీద్ పేర్కొన్నారు. విదేశీ పర్యటనలు చేయవద్దని ప్రజలకు పిలుపునిచ్చిన వెంటనే స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా విదేశాలకు వెళ్లారని కాంగ్రెస్ ఎంపీ మనోజ్ కుమార్ గుర్తు చేశారు. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్తే తప్పేంటి? విదేశాలకు వెళ్లవద్దన్నా ప్రధాని.. ఆ తర్వాత తనే స్వయంగా విదేశీ పర్యటనకు వెళ్తారు. రాహుల్ గాంధీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నాయకుడంటూ ఆయన సమర్థించారు.ం

## ఈ వారంలోనే కేంద్ర క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ..

### - రాష్ట్రపతిని కలిసిన అమిత్ షా



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని మంత్రివర్గంలో కీలక మార్పులు జరగబోతున్నట్లు సమాచారం. ఈ వారమే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టబోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ అంశంపై వివరించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును గురువారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా కలిశారు. మరోవైపు బీజేపీలోనూ సంస్థాగత నిర్మాణంలో మార్పులు జరగనున్నాయి. కేంద్రం మంత్రివర్గంతోపాటు బీజేపీ కేంద్ర పదవుల్లోనూ మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనిపై బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ చర్చలు, సంప్రదింపులు జరుపుతున్నారు. తన కొత్త టీంను ఎన్నుకునే పనిలో ఉన్నారు. బీజేపీలో పదవుల నియామకం, మార్పులు వంటివి ఈ నెలాఖరులోపు పూర్తవుతాయి. మంత్రివర్గంలో మార్పులు, చేర్పుల గురించి కొందరు కేంద్ర మంత్రులతో కూడా నితిన్ నబిన్ ఇదివరకే మాట్లాడినట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్, బీజేపీ కార్యవర్గాన్ని కూడా ఇటీవల మార్చిన సంగతి తెలిసిందే. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని యూబీ బీజేపీ కార్యవర్గంలో మార్పులు చేశారు. ఇదే సమయంలో కేంద్ర మంత్రివర్గ పునర్వ్యస్థీకరణకు సంబంధించి తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొందరు మంత్రులకు ఇటీవల పార్టీ పరమైన బాధ్యతల్ని కూడా అధిష్టానం అప్పగించింది. ఇటీవలే కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ తన పదవికి రాజీనామా చేశారు. అలాగే, ఇటీవలే కొందరు కొత్తగా ఎంపీలుగా రాజ్యసభలోకి అడుగుపెట్టారు. వీరిలో కొందరికి కేంద్ర మంత్రి పదవులు దక్కే అవకాశాలున్నాయి. అయితే, ఈ అంశంపై మోదీ, అమిత్ షా సహా బీజేపీ నాయకత్వం పూర్తి గోప్యత పాటిస్తోంది. మోదీ తన చర్యల్ని చివరి నిమిషం వరకు వెల్లడించరు. అందువల్ల మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై అధికారిక ప్రకటన వరకు ఎదురు చూడాల్సిందే.

# పగబట్టిన ప్రకృతి!



శతాబ్ద కాలంలో ఎన్నడూ చవిచూడని పెను ఉత్పాతం గురువారం (స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి) వెనెజులాపై విరుచుకుపడింది. సెకన్ల వ్యవధిలో రెండుసార్లు వచ్చిన భూకంపాలు-- మొదట రిక్టర్ స్కేల్‌పై 7.2 తీవ్రతతో, అటుపై 7.5 తీవ్రతతో--ఆ దేశాన్ని కాటేశాయి. వెంటవెంటనే ఇంత తీవ్రతతో భూకంపాలొస్తే జన నష్టం, ఆస్తి నష్టం అపారంగా ఉండే అవకాశాలుంటాయి. అటుపై వరసగా 30 సార్లు ప్రకంపనలు వచ్చాయంటే అదెంత భయానకమో ఊహించవచ్చు. దీంతోపాటే అమెరికాలోని కాలిఫోర్నియాలో, జపాన్‌లో సైతం భూకంపాలు రావటం ప్రపంచవ్యాప్తంగా చాలా మందిని భయపెట్టింది. వీటికితోడు కశ్మీర్‌లో కూడా స్వల్పంగా భూమి కంపించింది. భూ అంతర్భాగంలో ఏదో చోటు చేసుకోవటం వల్లే ఇలా జరిగిందన్న ఆందోళన కలిగినా ఇవి యాదృచ్ఛికమైనవేనని శాస్త్రవేత్తలు తేల్చారు. జపాన్‌లో ఎప్పుడూ భూకంపాల తాకిడి ఎక్కువ గనుక అక్కడ కూడా 7.2 తీవ్రతతో భూకంపం వచ్చినా పెద్దగా నష్టం కలగలేదు. ఇక వెనెజులా భూకంపానికి సంబంధించి అధికారిక లెక్కల ప్రకారం ఇంత వరకూ మృతుల సంఖ్య వందల్లోనే ఉన్నా... శిథిలాలు తొలగించాక ఇది వేలల్లోకి చేరినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. స్వల్ప వ్యవధిలోనే భూకంపాలు రావటంతో తప్పించుకునే వ్యవధి లేక చాలామంది శిథిలాల్లో చిక్కుకున్నారు. పీడ పోకుండానే పిశాచం పట్టుకున్న చందాన వెనెజులా వరస కష్టాలు ఎదుర్కొంటున్నది. ఈ ఏడాది జనవరిలో అమెరికా మెరైన్ దళాలు దాడి చేసి దేశాధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌లను అపహరించి తమ దేశానికి తరలించాయి. ఇప్పుడు మదురోపై విచారణ ప్రహసనం నడుస్తోంది. అంతకు చాన్నాళ్ల ముందే అమెరికా ఆంక్షల చట్రంలో ఊపిరాడని దేశ ఆర్థిక వ్యవస్థ 2013 తర్వాత మరింత దెబ్బ తింది. చమురు నిల్వల్లో ప్రపంచంలోనే నంబర్ వన్‌గా ఉన్న వెనెజులా అమెరికా పీడ లేకుంటే అత్యంత సంపన్నవంతమైన దేశంగా నిలిచేది. కానీ భారీ ద్రవ్యోల్బణం, అవినీతి, అమెరికా ఆర్థిక ఆంక్షల పర్యవసానంగా దాని జీడీపీ 80 శాతం పడిపోయింది. ఇప్పుడు తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్యూజ్ నేతృత్వంలోని ప్రభుత్వం అమెరికా కను సన్నల్లో నడుస్తోంది. దీర్ఘకాలంగా ఉన్న 24,000 కోట్ల డాలర్ల రుణ చెల్లింపును పునర్వ్యవస్థీకరించాలని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్)ను ఆ దేశం కోరింది. ఈ రెండు భూకంపాలవల్లా దేశ ఆర్థికవ్యవస్థకు దాదాపు పదివేల కోట్ల డాలర్ల వరకూ నష్టం సంభవించి ఉండొచ్చని అమెరికా భౌగోళిక సర్వే అంచనా వేస్తోంది. ఆంక్షల వల్ల దశాబ్దాలుగా మౌలిక సదుపాయాల్ని మెరుగుపరచటం ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. వంతెనలూ, రోడ్లు, ఆసుపత్రులు, విద్యుత్ గ్రిడ్‌లు కాలం చెల్లినవి కావటంతో అవి భూకంపం తాకిడికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇతరేతర విపత్తులు ముందస్తు సూచనలు అందించి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లడానికి వీలుగా మనిషికి కొద్దిపాటి వ్యవధినిస్తాయి. కానీ భూకంపాలు ఎలాంటి సూచనా అందించవు. ఏం జరిగిందో గ్రహించే లోగానే శిథిలాల గుట్టలతో భీతావహుల్ని చేస్తాయి. ఈసారి కొంత నయం. ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్‌లో ఉండే యాక్సెలెరోమీటర్ అనే సెన్సర్ అయిదు, పది సెకన్ల ముందు హెచ్చరించటంతో చాలామంది అప్రమత్తమై భారీ భవంతులనుంచి దూరం జరిగి ప్రాణాలు కాపాడుకున్నారు. భూకంపం బయలు దేరినప్పుడు మొదట విడుదలై శరవేగంతో విస్తరించే పీ--వేవ్స్ (ప్రాథమిక తరంగాలు)ను ఆ సెన్సర్ పసిగడుతుంది. ఒకే ప్రాంతంలో అనేక ఫోన్లు ఈ పనిచేసినప్పుడు గూగుల్ క్లౌడ్ సర్వర్‌లోని అల్గారిథమ్ వెనువెంటనే అన్ని ఫోన్లకూ హెచ్చరిక సందేశాన్ని విడుదల చేస్తుంది. 'భూకంపాల క్రియాశీల దశ'లోకి భూమి చేరుకుని ఉండొచ్చని పదేళ్లక్రితం భూభౌతిక శాస్త్రవేత్తలు అనుమానాలు వ్యక్తం చేశారు. దానిపై ఇంతవరకూ నిర్ధారణగా చెప్పిందేమీ లేదుగానీ...దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రపంచ దేశాలన్నీ ముందు జాగ్రత్తలు తీసుకోవటం మేలు. జపాన్ ఈ విషయంలో చాలా ముందంజలో ఉంది గనుక, ఇతర దేశాలు దాన్ని అనుసరించాలి. అలాగే ప్రకృతికి చేటుతెచ్చే విధానాలు కట్టిపెట్టాలి. ఉన్నంతలో పర్యావరణహిత విధానాలు అనుసరిస్తే ఇలాంటి విపత్తులకు ఆస్కారం తక్కువ ఉంటుంది.

# రక్షణ వలయాలు రహస్య వ్యూహాలు

దేశాధినేతల భద్రత వెనుక ఉండే అత్యంత రహస్య వ్యూహాలు, కఠినమైన నిబంధనల గురించి మాజీ ఐబీ అధికారి యశోవర్ధన్ ఆజాద్ ఈ ఎపిసోడ్‌లో మాట్లాడారు. ఒబామా పర్యటన, మోదీ కాన్వాయ్ ఉల్లంఘన; రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీ హత్యల వంటి కీలక ఘటనలు భారత భద్రతా వ్యవస్థల పని తీరును ఎలా మార్చిందీ వివరించారు.



### ముంబైలో ఒబామా పర్యటన

"అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ముంబైని సందర్శించినప్పుడు, ఒక అగ్రరాజ్యంతో కలిసి భద్రతా ఏర్పా ట్లను సమన్వయం చేసుకోవడం ఎంత పెద్ద సవాలో మాకు తొలిసారి అవగాహనకు వచ్చింది. అమెరికా భద్రతా విభాగమైన 'యూఎస్ సీక్రెట్ సర్వీస్' పనిచేసే విధానం పూర్తిగా వేరే స్థాయిలో ఉంటుంది. వారు తమ సొంత భారీ రక్షణ కవచం ఉన్న వాహనం 'ద బీస్ట్'ను ముంబైకి తీసుకొచ్చారు. ఒబామా అడుగుపెట్టే ప్రతి ప్రాంతంలో వ్యూహాత్మక నియంత్రణను తామే చూసు కుంటామని పట్టుబట్టారు. ఒక ఉన్నతస్థాయి భారతీయ ఇంటెలిజెన్స్ అధికారిగా ఆ సమయంలో నాకున్న పెద్ద సవాలు ఏంటంటే... వారి కఠినమైన, వెనక్కి తగ్గని భద్రతా డిమాండ్లను నెరవేరుస్తూనే, మన దేశ సార్వభౌ మాధికారాన్ని గట్టిగా చాటడం! వారి 'బీస్ట్' వాహనం మన రోడ్లపై సులువుగా ప్రయాణించేలా చూస్తూనే, మన సొంత గడ్డపై భారతీయ బలగాలే ప్రధాన రక్షణ కవచంగా ఉండేలా మేము భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించాం.

### పంజాబ్ ఫ్లైఓవర్‌పై మోదీ

"ఒక పరిపూర్ణమైన ప్రణాళిక ఎలా విఫలమవుతుందో మీరు అర్థం చేసుకోవాలనుకుంటే, పంజాబ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ కాన్వాయ్ ఒక ఫ్లైఓవర్ మీద నిలిచి పోయినప్పుడు ఏం జరిగిందో చూడాలి. అది నిఘా విభాగం వైఫల్యం కాదు. స్థానిక నిర్వహణ లోపానికి నిలువెత్తు నిదర్శనం. మేము ఒక వి.వి.ఐ.పి. రూట్‌ను ప్లాన్ చేసినప్పుడు, స్థానిక రాష్ట్ర పోలీసులు కచ్చితంగా 'క్లియరెన్స్ సిగ్నల్' ఇవ్వడంతో పాటు, ఒక ప్రత్యా మ్నాయ బ్యాకప్ రూట్‌ను కూడా సురక్షితంగా సిద్ధం చేయాల్సి ఉంటుంది. కానీ ఆ సమయంలో, నిబంధనలు పూర్తిగా ఉల్లంఘనకు గురయ్యాయి. నిరసనకారులు దారిని అడ్డుకోవడానికి వీలు కలిగింది. దానివల్ల ప్రధాని ఒక వంతెనపై, కదలకుండా ఆగిపోయిన వాహనంలో 15 నుండి 20 నిమిషాల పాటు ఎలాంటి రక్షణ లేకుండా ఉండిపోవాల్సి వచ్చింది. భద్రత అనేది కేవలం కాగితంపై బాగుంటే సరిపోదని స్థానిక నిర్వహణ కూడా లోపరహి తంగా ఉండాలని ఆ ఘటన స్పష్టంగా నిరూపించింది.

### రాజీవ్ హత్య నేర్పిన పాఠం

"మన ఆధునిక భద్రతను మరింత పటిష్టం చేయటానికి మేము తరచూ గతంలో జరిగిన విషాదాలను పరిశీ లిస్తుంటాం. అందులో భాగంగానే మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య ఉదంతాన్ని మేము మైక్రోస్కోప్ కింద పెట్టి మరీ విశ్లేషించాం. ఆ నిర్దిష్ట సమయంలో ఆయన కేవలం ఒక అభ్యర్థి మాత్రమేనని, అందువల్ల ఎస్పీజీ రక్షణ వలయం ఆయనకు మునుపటిలా అందుబా టులో లేదనే విషయాన్ని ప్రజలు మర్చిపోతుంటారు. అక్కడ జరిగిన వైఫల్యం మానవ రక్షణ వలయానికి సంబంధించినది. ఆ ఒక్క ఘటనే ఆ తర్వాత నుంచీ మానవ సంబంధాలు, శారీరక సామీప్యత, ప్రవేశ నియం త్రణను నిర్వహించే విధానాన్ని పూర్తిగా మార్చేలా చేసింది. వీవీఐపీకీ, ప్రజలకూ మధ్య కఠినమైన భౌతిక అడ్డంకులను అమలు చేస్తూ, మేము అందరి దృష్టిలో 'చెడ్డవాళ్లుగా' మారడానికి కారణం ఆ దుర్ఘటనే.

### ఇందిర హత్య తర్వాతే 'ఎస్పీజీ'

"1984లో ప్రధాని ఇందిరా గాంధీ తన అంగరక్షకుల చేతిలోనే దారుణ హత్యకు గురైనప్పుడు, అది మన నిఘా, భద్రతా వ్యవస్థలను మూలాల నుండి కుదిపేసింది. ఆ విషాదానికి ముందు, దేశంలో వీవీఐపీల 'అత్యంత సమీప' రక్షణ వలయం కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన దళం అంటూ ఏదీ లేదు. ఆ వ్యవస్థాగత వైఫల్యం కేవలం భౌతిక భద్రతలో జరిగిన లోపం మాత్రమే కాదు, అది ప్రధాని అంగరక్షకుల ఎంపిక పరిశీలనలో జరిగిన నిఘా లోపం కూడా. ఈ హత్య తర్వాత, దేశాధినేతను అంతర్గత ముప్పుల నుండి రక్షించడానికి కేవలం సాధారణ పోలీసు పద్ధతులు సరి పోవని గ్రహించాం. ఆ గ్రహింపే బీర్బల్ నాథ్ కమిటీ ఏర్పాటుకు, 1985లో 'స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్' స్థాపనకు తక్షణ ఉత్ప్రేరకంగా మారింది.

# గుండెకు బ్యాడ్ మార్నింగ్

**పగటివేళ 'ఆహార'ఎంపికలతో గుండెకు ముప్పు..**
**గుండె ఆరోగ్యానికి చేటు తెస్తున్న అధిక చక్కెరలు, కెఫిన్**
**నీళ్లు తాగకపోవడంతో జీవక్రియలకు అంతరాయం**
**జీవక్రియలను ప్రభావితం చేసే సర్కాడియన్ రిథమ్**
**గుండెకు హాని పగలే జరుగుతోందంటున్న నిపుణులు**



హైదరాబాద్: పగటి పూట తీసుకునే ఆహారాలు శక్తి స్థాయిలు, జీవక్రియ, జీవ గడియారం తీరుపై (సర్కాడియన్ రిథమ్)పై తీవ్ర ప్రభావం చూపుతాయా? దీర్ఘకాలంలో ఇవి గుండె ఆరోగ్యంపై ప్రతికూలమైన ప్రభావానికి కారణమవుతాయా? ఈ ప్రశ్నలకు నిపుణుల నుంచి అవుననే సమాధానం వస్తోంది. గుండె ఆరోగ్యానికి మేలు చేసే అలవాట్ల విషయానికి వస్తే, క్రమంతప్పని వ్యాయామం, ఎక్కువ మోతాదులో కూరగాయలు తినడం, ఏటా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు వంటి సమాధానాలు టక్కు న వస్తాయి. ఇవి ఆరోగ్యపరిరక్షణకు దోహదం చేసినప్పటికీ, గుండె ఆరోగ్యం వీటిపై మాత్రమే ఆధారపడి ఉండదని, మరికొన్ని జాగ్రత్తలు అవసరమని తెలుస్తోంది. మధ్యాహ్నం అధిక మోతాదులో చక్కెరలు ఉన్న స్నాక్స్ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగడం, నీరు తాగకుండా ఎక్కువసేపు కూర్చోవడం వల్ల జీర్ణక్రియ సరిగ్గా జరగకపోవడం, సాయంత్రం ఆరు గంటల తర్వాత టీ, కాఫీ వంటివి (కెఫిన్ పదార్థాలు) తీసుకోవడం వల్ల నిద్ర ఆలస్యం కావడం వంటివి నిశ్శబ్ద ఆరోగ్య ప్రమాదాలుగా పరిణమిస్తున్నాయని వైద్యనిపుణులు, పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

### క్రోనోన్యూట్రిషన్ అంటే ఏమిటి?

' క్రోనోన్యూట్రిషన్ అంటే ఆహారపుటలవాట్లలోని సమయం, క్రమబద్ధతలు శరీరం యొక్క అంతర్గత సర్కాడియన్ రిథమ్‌తో సంకర్షణ చెంది జీవక్రియను, ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో వివరించే శాస్త్రం. మీరు ఏమి తింటారనేది ఎంత ముఖ్యమో, ఎప్పుడు తింటారనే విషయం కూడా అంతే ముఖ్యమని ఈ శాస్త్రం చెబుతుంది.

### సర్కాడియన్ రిథమ్‌ను నియంత్రించేది ఏది?

' సర్కాడియన్ రిథమ్ శరీరం లోపల జన్యువులు, హార్మోన్ల ద్వారా నియంత్రితమవుతుంది. శరీరం బయటి నుంచి ప్రభావితం చేసే కూడా కారకాలున్నాయి. వాటిని జైట్ గేబర్స్ అంటారు. సూర్యరశ్మి, వ్యాయమం, ఆహారం వంటివి.

### మన వెంట ఉన్న ప్రమాదాలివి..

' క్యాండీలు, పేస్ట్రీలు, చక్కెర వేసిన కాఫీల వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరిగి, అంతే వేగంగా పడిపోతాయి. ఇది హృదయనాళ వ్యవస్థపై భారాన్ని, ఇన్సులిన్ నిరోధకతను పెంచుతుంది.

' సాయంత్రం తర్వాత కాఫీలు, ఎనర్జీ డ్రింక్స్ తాగడం వల్ల 'అడెనోసిన్ రిసెప్టర్ల'ప్రేరేపితమై మనిషిని మెలకువగా ఉంచుతూ, సహజ నిద్ర చక్రానికి అంతరాయం కలిగిస్తాయి.

' మధ్యాహ్న భోజనం చేయకపోతే సాయంత్రానికి అతిగా ఆకలి వేస్తుంది. ఇది ఆహారాన్ని ఎక్కువ మోతాదులో తినేటట్లు ప్రేరేపించడంతోపాటు మనసును అనారోగ్యకరమైన ఆహారం మీదకు మళ్లిస్తుంది.

' పనిలో పడి పగలంతా నీళ్లు తాగకపోతే డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. ఇది మతిమరుపుకు, అతిగా తినడానికి, అనారోగ్యకరమైన చక్కెర పానీయాలను తాగేలా ప్రభావితం చేస్తుంది.

### ఆహారపు అలవాట్లు ఇకపై ఇలా

' ప్రోటీన్, ఫైబర్‌పై దృష్టి పెట్టాలి. గ్రీక్ యోగర్ట్, నట్స్, పండ్లు, కూరగాయలతో కూడిన హమ్మస్ వంటి సమతుల ఆహారం తీసుకోవాలి. ఇవి కడుపు నిండిన అనుభూతినివ్వడంతోపాటు నీరసం రానివ్వకుండా ఎక్కువ సేపు శక్తిని అందిస్తాయి.

' గంటకొకసారి 5 నిమిషాలపాటు దేహానికి కదలిక కోసం నడవాలి. మధ్యాహ్న భోజనం తర్వాత తేలికపాటి నడక వల్ల చక్కెర స్థాయి అకస్మాత్తుగా పెరగకుండా నిలువరించవచ్చు.

' రాత్రి భోజనం ఎనిమిది గంటలకు ముగిస్తే శరీర సహజ జీవప్రక్రియలు సజావుగా సాగుతాయి. ఈ అలవాటు కేలరీలను మెరుగ్గా దహించడానికి వీలు కల్పిస్తుంది.

' పగలంతా నీటిని కొద్దికొద్దిగా తాగడాన్ని అలవాటుగా పాటించాలి. శరీరంలో నీటిశాతం తగినంత ఉంటే కెఫిన్ డ్రింక్స్ తీసుకోవాలనే కోరిక కలగదు.

## గోశాలలు కాసుల కురిపిస్తాయా?



బెంగళూరు: భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మరో కొత్త విప్లవానికి గోశాలలు కేంద్రబిందువుగా మారగలవా? ఒకప్పుడు అమూల్ సహకార మోడల్ దేశంలోని కోట్లాది పాల రైతుల జీవితాలను మార్చినట్లే.. ఇప్పుడు గోశాలలను ఆధారంగా చేసుకుని కొత్త సహకార ఆర్థిక వ్యవస్థను నిర్మించవచ్చనే ప్రతిపాదన ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. భారతదేశంలో ప్రస్తుతం సుమారు 7,676 నమోదిత గోశాలలు ఉండగా, అనధికారిక ఆశ్రయాలు, పింజరపోల్స్ కలిపితే వాటి సంఖ్య 15 వేల వరకు ఉండొచ్చని అంచనా. అయితే వీటిలో చాలా గోశాలలు పెరుగుతున్న పశుగ్రాస ఖర్చులు, వైద్య సంరక్షణ వ్యయాలు, మార్కెట్ సౌకర్యాల కొరత, నాణ్యత నియంత్రణలో లోపాలు, విభిన్నంగా పనిచేయడం వంటి కారణాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఫలితంగా చాలా వరకు విరాళాలపైనే ఆధారపడి కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు 'నేషనల్ గోశాల కోఆపరేటివ్ మోడల్' అనే కొత్త ఆలోచనను నిపుణులు ముందుకు తెస్తున్నారు. ఇందులో ప్రతి గోశాల విడివిడిగా పనిచేసే కేంద్రంగా కాకుండా, దేశవ్యాప్తంగా విస్తరించిన ఒక పెద్ద సహకార వ్యవస్థలో భాగంగా పనిచేస్తుంది. గోశాలలు కేవలం పశు సంరక్షణ కేంద్రాలుగా కాకుండా, దేశీయ ఆవు ఆధారిత ఉత్పత్తుల తయారీ, సేకరణ కేంద్రాలుగా మారే అవకాశం ఉందని సూచిస్తున్నారు. ఈ ప్రతిపాదన ప్రకారం ప్రాంతీయ స్థాయిలో ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, నాణ్యత నియంత్రణ, లాజిస్టిక్స్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేయవచ్చు. వెటర్నరీ కళాశాలలు ఆరోగ్య సంరక్షణ, వ్యాధి నిరోధక చర్యలు, శాస్త్రీయ సహకారం అందించవచ్చు. అలాగే ఈ-కామర్స్ వేదికల ద్వారా గోశాలల్లో తయారయ్యే ఉత్పత్తులను నేరుగా దేశవ్యాప్తంగా వినియోగదారులకు విక్రయించే అవకాశం కల్పించవచ్చని భావిస్తున్నారు. ఈ మోడల్‌లో కేవలం పాల ఉత్పత్తులకే పరిమితం కాకుండా గోమయం(పేడ), గోమూత్రం ఆధారిత ఉత్పత్తులు, సేంద్రియ ఎరువులు, బయోఫర్టిలైజర్లు, సహజ వ్యవసాయ ఉత్పత్తులు, వెల్‌నెస్ ఉత్పత్తులు వంటి రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం పాలు ఇవ్వని ఆవులను ఆర్థిక భారంగా భావిస్తున్న పరిస్థితిని మార్చి, వాటినీ గ్రామీణ సర్క్యులర్ ఎకానమీలో భాగంగా మార్చవచ్చని అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రతిపాదనను జాతీయ డెయిరీ పరిశోధన సంస్థ (ఎన్‌డీఆర్ఐ)కు చెందిన అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ డాక్టర్ ఆదర్శ గౌడ ముందుకు తెచ్చారు. గోశాలలను ఒక సమగ్ర సహకార వ్యవస్థలో అనుసంధానం చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కొత్త అవకాశాలు సృష్టించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. గోశాలలను ఒక సమగ్ర సహకార వ్యవస్థలో అనుసంధానం చేయగలిగితే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పశు సంక్షేమం, సేంద్రియ వ్యవసాయం, గ్రామీణ ఆదాయ వనరులు కూడా బలోపేతమవుతాయి. గోశాలలను వాణిజ్యీకరించడం లక్ష్యం కాదని, వాటిని ఆర్థికంగా స్వావలంబన చేయడమే ఈ ప్రతిపాదన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. మొత్తానికి, అమూల్ మాదిరిగా గోశాలల చుట్టూ కూడా ఒక సమగ్ర సహకార వ్యవస్థను నిర్మించగలిగితే.. భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మరో కొత్త అధ్యాయానికి నాంది పలికే అవకాశం ఉందనే చర్చ ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## అయోధ్య విరాళాల స్కామ్.. కీలక సభ్యుల రాజీనామా



లక్నో: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కోట్లాది మంది భక్తులు సమర్పించిన కానుకలు దుర్వినియోగం అయ్యాయన్న ఆరోపణల నేపథ్యంలో.. అయోధ్య రామమందిర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్‌రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా కూడా బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఈ పరిణామం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. దర్యాప్తులో భాగంగా ఇప్పటికే చంపత్‌రాయ్ వ్యక్తిగత డ్రైవర్ టిన్ను యాదవ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతనితో పాటు మరో ఎనిమిది మందిని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. ఈ కేసులో అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, అవినాష్ శుక్లా, టిన్ను యాదవ్, మనీష్ యాదవ్ తదితరుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్లు 306, 316(5), 317(4), 317(5), 61, 3(5) కింద కేసులు నమోదు చేసి సిట్ దర్యాప్తు కొనసాగిస్తోంది. దర్యాప్తు సంస్థల ప్రాథమిక అంచనాల ప్రకారం.. రామమందిరానికి భక్తులు సమర్పించిన రూ.200 కోట్లకు పైగా విరాళాలు గల్లంతైనట్లు ఆరోపణలు ఉన్నాయి. హుండీల్లో పడిన నగదు, విలువైన కానుకల నిర్వహణలో తీవ్ర అవకతవకలు జరిగినట్లు విచారణలో వెలుగులోకి వస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో మరింత సంచలనంగా మారిన అంశం.. సీసీటీవీ ఫుటేజీ మాయమవడం. అలాగే ఆలయ హుండీల తాళాలు అధికారిక ట్రస్ట్ ప్రతినిధుల వద్ద కాకుండా అనధికార వ్యక్తుల వద్ద ఉన్నట్లు సిట్ గుర్తించింది. దీంతో విరాళాల నిర్వహణ వ్యవస్థపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తులు విశ్వాసంతో సమర్పించిన డబ్బు, కానుకలను అంతర్గతంగా ఉన్నవారే దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు కేసుకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చాయి. ప్రస్తుతం అరెస్టయిన నిందితులను సిట్ అధికారులు ముమ్మరంగా విచారిస్తున్నారు. విరాళాల సొమ్ము ఎక్కడికి మళ్లింది? ఇందులో ఇంకా ఎవరెవరి పాత్ర ఉంది? ట్రస్ట్‌లోని మరికొందరికి ఈ వ్యవహారంతో సంబంధాలు ఉన్నాయా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. దేశంలో అత్యంత పవిత్ర క్షేత్రాల్లో ఒకటైన అయోధ్య రామమందిరంలో భక్తుల విశ్వాసానికి ప్రతీకగా సమర్పించిన విరాళాలే అక్రమాలకు గురయ్యాయన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. ట్రస్ట్‌లో ఇద్దరు కీలక సభ్యుల రాజీనామా, పలువురు అరెస్టులు, భారీ విరాళాల మాయంపై ఆరోపణలు వెలుగులోకి రావడంతో ఈ వ్యవహారం మరింత సంచలనంగా మారింది. ప్రస్తుతం ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తు ఫలితాలపైనే అందరి దృష్టి నెలకొంది.

### యోగి ఏమన్నారంటే..

అయోధ్య విరాళాల చోరీ కేసుపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం స్పందించారు. "అయోధ్య మన విశ్వాసానికి ప్రతీక. అయోధ్యపై నిరాధార ఆరోపణలు చేయొద్దు.. శ్రీరాముడిని గౌరవించడం నేర్చుకోండి. సిట్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ముందే చెప్పాం. ఇప్పుడు నివేదిక వచ్చింది.. చర్యలు కూడా ప్రారంభమయ్యాయి" అని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించిన ఆయన.. "ఈరోజు ఆరోపణలు చేస్తున్నవారే ఒకప్పుడు శ్రీరాముడి ఉనికినే ప్రశ్నించారు. అయోధ్య ఉద్యమాన్ని మొదటి నుంచే వ్యతిరేకించారు. 'జై శ్రీరామ్' నినాదాలు చేసిన వారిపై లాఠీచార్జీలు, కాల్పులు జరిపారు. రామనవమి వేడుకలను అడ్డుకునేందుకు, కావడ్ యాత్రను నిషేధించేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ దేశాన్ని దోచుకోవడమే కాకుండా ముక్కలు చేసింది. ఎవరి వద్దైనా ఆధారాలు ఉంటే వాటిని సిట్‌కు అందించాలి. రామభక్తుల విశ్వాసంతో చెలగాటం ఆడొద్దు" అని యోగి అన్నారు.

## తెలంగాణలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ




హైదరాబాద్: తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం రేవంత్ సలహాదారుగా ప్రస్తుత సీఎస్ కె.రామకృష్ణరావును నియమించింది. మొత్తం 13 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగులు ఇచ్చింది. సబ్యసాచి ఘోష్‌కు హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖ అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. శైలజా రామయ్యర్‌కు ఈఎఫ్ఎస్ అండ్ టీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేసింది. అహ్మద్ నదీమ్‌కు పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చింది. ఎన్ శ్రీధర్ ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా, రాహుల్ బొజ్జాకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఎం.రఘునందన్ రావుకు మైన్స్ అండ్ జియాలజీ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం.. అజిత్ రెడ్డి ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా బదిలీ చేసింది. పి. కాత్యాయని దేవి హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ స్పెషల్ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చిన ప్రభుత్వం.. కె. గంగాధర్ ఆర్అండ్‌బీ శాఖ స్పెషల్ సెక్రటరీగా బదిలీ చేసింది. టి. వెంకన్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చింది. కె. విద్యాసాగర్ టూరిజం డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# ఫలకాల కదలికల వల్లే

### ఒకే రోజు 4 భారీ భూకంపాలు.. చాలా అరుదు

20000ం! ఏడాది కాలంలో భూమ్మీద సంభవించే భూకంపాల సంఖ్య ఇది. అంటే సగటున రోజుకు 55 వరకూ భూకంపాలు చోటు చేసుకుంటూ ఉంటాయన్నమాట. సాధారణంగా వీటిల్లో చాలావరకూ తక్కువ తీవ్రత ఉన్నవే. మనుషులు గుర్తించలేనివి కూడా. కానీ...బుధవారం అటు అమెరికాలోని కాలిఫోర్నియాలో... దక్షిణ అమెరికాలోని వెనెజువెలా, తూర్పున ఉన్న జపాన్‌లో వచ్చిన భూకంపాలు మాత్రం కొంచెం ప్రత్యేకమని చెప్పాలి. కాలిఫోర్నియాలోని రెడ్‌వుడ్ వ్యాలీలో సుమారు 5.6 తీవ్రతతో భూకంపం రాగా.. ఏడు గంటల తరువాత వెనెజువెలాలో 7.2 తీవ్రతతో ఒకసారి.. 39 సెకన్ల తరువాత 7.5 తీవ్రతతో రెండోసారి భూమి కంపించింది. ఈ డబుల్ భూకంపాల తరువాత 25 నిమిషాలకే జపాన్‌లోని కుజి వద్ద సముద్రంలో మరోసారి భూమి సుమారు 6.9 తీవ్రతతో కంపించింది. ఇలా 24 గంటల వ్యవధిలో ఇంత ఎక్కువ తీవ్రత ఉన్న భూకంపాలు రావడం అరుదైన విషయమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. ఈ ఘటనలకు కారణం ఆయా ప్రాంతాల్లోని టెక్టానిక్ ఫలకాల కదలికలు కావడం.



### భూమి పొరల కదలికలు...

భూమి ఉపరితలం నుంచి సుమారు 70 కిలోమీటర్ల లోతు వరకూ ఉండే క్రస్ట్.. దాని దిగువన ఉండే మాంటెల్ పై భాగం భారీ ఫలకాలుగా విడిపోయి ఉంటుంది. వీటినే టెక్టానిక్ ఫలకాలంటారు. వీటిల్లో పసిఫిక్, నార్త్ అమెరికన్, యురేసియన్, ఆఫ్రికన్, అంటార్కిటిక్, ఇండో--ఆస్ట్రేలియన్, సౌత్ అమెరికన్ ఫలకాలు ప్రధానమైనవి. కరీబియన్, నాజ్కా, కోకస్, అరేబియన్, ఫిలిప్పీన్ పేర్లతో కొన్ని చిన్న ఫలకాలూ ఉన్నాయి. టెక్టానిక్ ఫలకాలు నిత్యం కదులుతూ ఉంటాయి. ఏడాది కాలంలో సుమారు పది సెంటీమీటర్ల దూరం ప్రయాణిస్తాయని అంచనా. సుమారు ఐదు కోట్ల ఏళ్ల క్రితం యురేసియన్ ఫలకాన్ని ఇండియన్ ఫలకం ఢీకొన్న ఫలితంగా హిమాలయ పర్వత శ్రేణి ఏర్పడింది. ఇండియన్ ఫలకం ఇప్పటికీ ఏడాదికి ఐదు సెంటీమీటర్ల చొప్పున యురేసియన్ ప్లేట్‌ను ముందుకు తోస్తోంది కూడా. ఢీకొనడం కాకుండా.. ఒకదాని కిందకు ఒకటి చేరిపోవడం వల్ల ఆయా ప్రాంతాల్లో భూకంపాలు చోటు చేసుకునే అవకాశాలు పెరుగుతాయి. కొన్ని సందర్భాల్లో ఈ టెక్టానిక్ ఫలకాల రాపిడి కాస్తా అగ్నిపర్వతాలు ఏర్పడేందుకు కారణమవుతూంటుంది. టెక్టానిక్ ఫలకాలు దూరం దూరంగా జరగడం వల్ల భారీ లోయలూ పుడతాయి. సెయింట్ ఆండ్రియాస్ ఇందుకు ఒక ఉదాహరణ. వెనెజువెలాలో ఏం జరిగింది?: దక్షిణ అమెరికాలోని వెనెజువెలా సౌత్ అమెరికన్, కరీబియన్ ఫలకాల సంగమ స్థలిలో ఉంటుంది. కరీబియన్ ఫలకం తూర్పు వైపునకు కదులుతూ సౌత్ అమెరికన్ ఫలకంపై ఒత్తిడిని పెంచుతూంటుంది. బోకాన్, సాన్ సెబాస్టియన్, ఎల్ పిలర్, మోర్న్ ప్రాంతాల్లోని ఫాల్ట్ జోన్లలో ఈ ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. బుధవారం నాటి భూకంపాలు ఈ ఫాల్ట్ జోన్లు ఉన్న చోటే సంభవించడం గమనార్హం. మూడు ఫలకాల రాపిడి: జపాన్‌లో భూకంపాలు నిత్యకృత్యం అంటే అతిశయోక్తి కాదు. పసిఫిక్, ఫిలిప్పీన్, యురేసియన్ ఫలకాలు మూడూ ఇక్కడే కలుసుకుంటూండటం ఇందుకు ఒక కారణం. బుధవారం నాటి భూకంపం ఇవాటే ప్రాంతంలో సుమారు 50 కిలోమీటర్ల లోతులో సంభవించింది. సాన్ ఆండియాస్ ఫాల్ట్: కాలిఫోర్నియాలో తరచూ సంభవించే భూకంపాలు సాన్ ఆండ్రియాస్ ఫాల్ట్ వల్లనే. ఇక్కడ పసిఫిక్ ఫలకం నార్త్ అమెరికన్ ఫలకం కింది నుంచి వెళుతూంటుంది. బుధవారం సాయంత్రం కాలిఫోర్నియాలో సుమారు ఎనిమిది కిలోమీటర్ల లోతున భూకంపం సంభవించింది.

# మనకు కావాలి 'ఏఐ రిస్క్ ఫండ్'

పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు
ఏఐ నిధులు దాచాలి

కెరీర్‌లో ఒడిదుడుకులను
తట్టుకోవడానికి దోహదపడే కవచం

మారుతున్న కాలానికి అనుగుణంగా
అవసరమంటున్న నిపుణులు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మన కళ్ల ముందే సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిస్తోంది. నిత్యం చేసే పనులు, డేటా విశ్లేషణ వంటి రంగాలను ఏఐ వేగంగా భర్తీ చేస్తోంది. దీనివల్ల భవిష్యత్తులో సంప్రదాయ ఉద్యోగాల సంఖ్య తగ్గే ప్రమాదం ఉంది. ఫలితంగా, కాలేజీ పూర్తి చేసుకుని బయటకొచ్చే యువతకు మొదటి ఉద్యో గం సంపాదించడం మునుపటి కంటే సవాలుగా మారవచ్చు. మారుతున్న కాలంలో పిల్లలను కేవలం పరీక్షల్లో మార్కులు తెచ్చుకునే యంత్రాలుగా మార్చకుండా.. సృజనాత్మకంగా ఆలో చించేలా, సరికొత్త నైపుణ్యాలు పెంపొందించుకునేలా, ఏఐతో కలిసి పనిచేసేలా తీర్చిదిద్దడం తల్లిదండ్రుల ప్రాథమిక బాధ్యత అని నిపుణులు చెబుతున్నారు.




### 'ఏఐ రిస్క్ ఫండ్' నేటి తరం అత్యవసరం!

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పిల్లల భవి ష్యత్తు కోసం 'ఏఐ రిస్క్ ఫండ్' లేదా ఒక ప్రత్యేకమైన పొదుపు ఖాతాను ఏర్పాటు చేయడం ఇప్పుడు చాలా అవసరం. పిల్లల పెళ్లిళ్లకు, కాలేజీ ఫీజులకు డబ్బు దాచినట్లే.. ఏఐ యుగంలో వారి కెరీర్ స్థిరపడే వరకు ఎదురయ్యే ఒడిదుడుకులను తట్టుకోవడానికి ఒక 'రిస్క్ మేనేజ్‌మెంట్ ఫండ్' అవసరమని తల్లిదండ్రులు గుర్తించాలని నిపుణులు సూచిస్తున్నారు. గతాన్ని గమనిస్తే, ఏ కొత్త సాంకేతికత వచ్చినా పాత ఉద్యోగాలను తుడిచేసి, సరికొత్త అవకాశాలను సృష్టిస్తున్నట్లు తెలుస్తుంది. అయితే, పాతవి పోవడానికి, కొత్తవి పుట్టుకురావడానికి మధ్య కొంత సమయం (ట్రాన్సిషన్ పీరియడ్) పడుతుంది. ఈ లోపు పిల్లలు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పడకుండా నిలబడడానికి ఈ 'రిస్క్ ఫండ్' ఒక సంజీవనిలా పనిచేస్తుంది.

### ఏఐని శత్రువుగా కాదు.. మిత్రుడిగా చూడాలి!

ఒకప్పుడు మంచి మార్కులు, పెద్ద డిగ్రీలు ఉంటే ఉద్యోగం గ్యారంటీ అనే నమ్మకం ఉండేది. కానీ నేడు కేవలం మార్కులు సరిపోవు. ఏఐ యుగంలో రాణించాలంటే సృజనాత్మకత, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం, వినూత్న ఆలోచనలు ప్రాణాధారాలు. పిల్లలు ఏఐని చూసి భయపడకుండా, దానిని ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగించడం నేర్చుకోవాలి. ముఖ్యంగా, ఏఐ నుంచి సరైన సమాధానాలు రాబట్టడానికి 'సరైన ప్రశ్నలు అడగడం' అనేది అత్యంత కీలకమైన నైపుణ్యంగా మారబోతోంది.

### 'ఏఐ ఫండ్' వల్ల ముఖ్య ప్రయోజనాలు

పిల్లలు చదివిన చదువుకు సంబంధించిన ఉద్యోగం ఏఐ వల్ల మారిపోతే, వారు తక్షణమే మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టుగా కొత్త టెక్నాలజీని (ఏఐ టూల్స్, డేటా అనలిటిక్స్ మొదలైనవి) నేర్చుకోవడానికి ఈ డబ్బు ఉపయోగపడుతుంది. చదువు పూర్తి కాగానే వెంటనే ఉద్యోగం రాకపోయినా, ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా, తదుపరి కెరీర్ ప్లాన్ చేసుకోవడానికి ఈ ఫండ్ ఒక రక్షణ కవచంలా నిలుస్తుంది. భవిష్యత్తులో ఉద్యోగాల కోసం వెతకడం కంటే, సొంతంగా ఏఐ టూల్స్ ఉపయోగించి స్టార్టప్‌లు లేదా సరికొత్త వ్యాపారాలు ప్రారంభించడానికి ఈ పొదుపు మొత్తమే తొలి పెట్టుబడిగా మారుతుంది.

# ఏసీల కోసం పొలిటికల్ ఫైట్.. ఎక్కడో తెలుసా?

ఒకప్పుడు పర్యావరణ పరిరక్షణ పేరుతో ఏసీలను వ్యతిరేకించిన దేశంలో.. ఇప్పుడు వాటిపైనే రాజకీయ యుద్ధం మొదలైంది. మండిపోతున్న ఎండలు, మూతపడుతున్న పాఠశాలలు, ఉక్కిరిబిక్కిరవుతున్న ఆస్పత్రులు, ప్రాణాపాయ స్థాయికి చేరుతున్న ఉష్ణోగ్రతలు.. చివరికి రాజకీయ పార్టీలను కూడా రెండు వర్గాలుగా విడగొట్టాయి. ఏసీలు అవసరమా? వద్దా? అన్న అంశమే ఇప్పుడు ఆ దేశ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఆ దేశమే ఫ్రాన్స్. గత కొన్ని రోజులుగా అక్కడ నమోదవుతున్న తీవ్ర ఉష్ణోగ్రతలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ వారం ఏకంగా 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరువైన ఉష్ణోగ్రతలు నమోదవగా.. ఫ్రాన్స్ చరిత్రలోనే అత్యంత వేడిగా నమోదైన రోజు కూడా ఇదేనని అధికారులు వెల్లడించారు. వేడి తీవ్రతతో వేలాది పాఠశాలలు తాత్కాలికంగా మూతపడగా.. ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది, రోగులు ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా పోర్టబుల్ ఏసీల కొనుగోళ్లు ఒక్కసారిగా పెరిగిపోయాయి. పిల్లలు కొంతసేపైనా తరగతి గదుల్లో ఉండేందుకు, అపార్ట్‌మెంట్లలో నివసించే ప్రజలు రాత్రిపూట నిద్రపోయేందుకు ఏసీలే మార్గమవుతున్నాయి. అయితే ఇక్కడే రాజకీయ చర్చ మొదలైంది. ప్రతిపక్షం మాత్రం ఈ వేడి పరిస్థితులను ప్రధాన అస్త్రంగా మార్చుకుంది. కుడిపక్ష (రైట్ వింగ్) నాయకురాలు మరీన్ లె పెన్.. దేశంలోని అన్ని పాఠశాలలు, ఆస్పత్రుల్లో తక్షణమే ఏసీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాదు.. కోట్లాది కుటుంబాలు తమ ఇళ్లలో ఏసీలు అమర్చుకునేందుకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని ప్రతిపాదించారు. ప్రజల ప్రాణాల కంటే పర్యావరణ సిద్ధాంతాలు ముఖ్యమా? అంటూ ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తున్నారు. అదే సమయంలో పర్యావరణవాదులు, గ్రీన్ పార్టీ తమ పాత వైఖరిని కొంత సవరించుకున్నాయి. ఇప్పటివరకు ఏసీలను తీవ్రంగా వ్యతిరేకించిన ఆ పార్టీ.. ప్రస్తుత తీవ్ర ఉష్ణోగ్రతల నేపథ్యంలో కనీసం పాఠశాలలు, ఆస్పత్రుల్లో మాత్రం శీతలీకరణ సదుపాయాలు తప్పనిసరి అని అంగీకరించింది. అయితే దేశవ్యాప్తంగా విచ్చలవిడిగా ఏసీల వినియోగాన్ని ప్రోత్సహించడాన్ని మాత్రం వ్యతిరేకిస్తోంది. అధిక విద్యుత్ వినియోగం, గ్రీన్‌హౌస్ వాయువుల విడుదల, నగరాల్లో వేడి మరింత పెరగడం వంటి పర్యావరణ సమస్యలను గుర్తు చేస్తూ జాగ్రత్తలు అవసరమని చెబుతోంది. మరోవైపు అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ప్రభుత్వం సమతుల్య వైఖరిని



అవలంబిస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో అవసరమైన చోట ఏసీల వినియోగాన్ని సమర్థిస్తూనే.. దేశమంతా ఏసీలను విస్తృతంగా ప్రోత్సహించే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. భవనాల్లో మెరుగైన ఇన్సులేషన్, సహజ గాలి ప్రసరణ, పచ్చదనం పెంపు వంటి శాశ్వత పరిష్కారాలకే ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఆస్పత్రులు, పాఠశాలలు వంటి కీలక ప్రాంతాల్లో శీతలీకరణ సదుపాయాలు అనివార్యమనే విషయాన్ని కూడా అంగీకరిస్తోంది. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో కేవలం 25 శాతం ఇళ్లలో మాత్రమే ఏసీలు ఉన్నాయి. అదే స్పెయిన్, ఇటలీల్లో ఈ సంఖ్య 50 శాతం కాగా.. అమెరికా, జపాన్‌లలో దాదాపు 90 శాతం ఇళ్లలో ఏసీలు ఉన్నాయి. దీంతో పెరుగుతున్న వేడి పరిస్థితుల్లో ఫ్రాన్స్ కూడా తన పాత విధానాన్ని మార్చక తప్పదనే అభిప్రాయం బలపడుతోంది. మొత్తానికి.. ఒకప్పుడు పర్యావరణ పరిరక్షణ పేరుతో ఏసీలను దూరంగా ఉంచిన ఫ్రాన్స్.. ఇప్పుడు అదే ఏసీల అవసరంపై రాజకీయంగా, సామాజికంగా కొత్త చర్చను ఎదుర్కొంటోంది. వాతావరణ మార్పుల తీవ్రత పెరుగుతున్న కొద్దీ.. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలా? లేక ప్రజల ప్రాణాలను కాపాడేందుకు శీతలీకరణ సదుపాయాలను విస్తరించాలా? అనే ప్రశ్న ఇప్పుడు ఫ్రాన్స్ రాజకీయాల్లోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారింది.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: టిడిపి నాయకులు



కుప్పం,/ జూన్ 26 రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పి.ఎస్. మునిరత్నం, పి.కె.ఎం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా ఆధ్వర్యం వహించారు. కుప్పం నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ వ్యక్తిగత, సామాజిక, రెవెన్యూ, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, భూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన వినతిపత్రాలను సమర్పించారు. నాయకులు ఒక్కో సమస్యను ఓర్పుతో, శ్రద్ధగా విని సంబంధిత అధికారులతో వెంటనే చర్చించి, సాధ్యమైన వాటికి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మిగిలిన సమస్యలను కూడా నిర్దిష్ట గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి సమస్యలను నేరుగా స్వీకరించి, వేగవంతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ఇటువంటి గ్రీవెన్స్ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ప్రతి వినతిని ప్రాధాన్యంతో పరిశీలించి ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని నమోదు చేసి, సంబంధిత శాఖల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యల పరిష్కారం జరిగే వరకు చర్యలు కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలు తమ సమస్యలను ఓపికగా విని స్పందించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి రైల్వే పోలీసుల అంత్యక్రియలు




కుప్పం,/ జూన్ 26: కుప్పం - గుడుపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందిన ఘటనలో, బంధువులు ఎవరూ గుర్తించకపోవడంతో రైల్వే పోలీసులు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 22వ తేదీ రాత్రి సుమారు 11 గంటల సమయంలో కుప్పం - గుడుపల్లి రైల్వే స్టేషన్ల మధ్య మున్సిపల్ డంపింగ్ యార్డు సమీపంలో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి ఏదో బలమైన వ్యక్తిగత కారణంతో గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి మృతుడి వివరాలు తెలుసుకునేందుకు రైల్వే పోలీసులు పలు మార్గాల్లో ప్రయత్నాలు చేపట్టామన్నారు. మృతదేహం ఫోటోను విడుదల చేసి, బంధువుల కోసం నిరీక్షించినప్పటికీ ఎవరూ ముందుకు రాకపోవడంతో చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేశామన్నారు. అనంతరం కుప్పం రైల్వే పోలీసుల ఆధ్వర్యంలో, డీకే పల్లి మాజీ సర్పంచ్ మణి సహకారంతో మృతదేహానికి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించినట్టు తెలిపారు.

## కన్నలి ప్రతాప్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జల కుటుంబం





శ్రీకాళహస్తి నియోజకవర్గం, (26.06.2026):కన్నలి ప్రతాప్ రెడ్డి జన్మదిన వేడుకలు నేడు శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి బొజ్జల రిషిత రెడ్డి ల సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, తన బంధుమిత్రుడు, ఆత్మీయుడు అయిన కన్నలి ప్రతాప్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా తొట్టంబేడు మండలం, కన్నలి గ్రామంలోని ప్రతాప్ రెడ్డి స్వగృహానికి విచ్చేయడం చాలా సంతోషం గా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి తో కేక్ కట్ చేయించి, ఆయన కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో కలిసి కాసేపు ఆత్మీయంగా, సరదాగా సమయాన్ని గడపడం చాలా ఆనందంగా అనిపించిందని తెలిపారు. అనంతరం, కన్నలి గ్రామంలోని కూటమి కార్యకర్తలు, గ్రామస్తులతో కలిసి కాసేపు సరదాగా గడుపుతూ, ఒక 'ఆత్మీయ సమావేశం' నిర్వహించారు. గ్రామ ప్రజలను నేరుగా కలుసుకుని, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, స్థానికంగా ఉన్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. కూటమి ప్రభుత్వ హయాంలో కన్నలి గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తన వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా గ్రామస్తులకు భరోసా ఇచ్చాను.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ!



కుప్పం,/ కుప్పం మాజీ షాది మహల్ చైర్మన్ అన్సర్ భాషకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను స్థానిక ప్రజాప్రతినిధులు అందజేశారు. కుప్పం మాజీ షాది మహల్ చైర్మన్ అన్సర్ భాష కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ 12 లక్షలు మంజూరైంది. ఆయన అనారోగ్యంతో మరణించిన నేపథ్యంలో కుటుంబ సభ్యులకు ఈ ఆర్థిక సహాయం అందించారు. ఈ చెక్కును రాష్ట్ర ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, టిడిపి నేతలు గోపీనాథ్, జాకీర్, సర్దార్, వెంకటేష్, అప్పు ముకేష్ తదితరులు, అన్సర్ భాష భార్య, కుమారుడు వినోద్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సహకరించిన ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, పీకేఎం--యూడీఏ చైర్మన్ డా. సురేష్ బాబు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థికంగా పెద్ద ఊరట కలిగిస్తోందని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మునాఫ్, జాలు, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీ పత్రాలు అందజేసిన మంత్రిగొట్టిపాటి రవి కుమార్

రూ.101 కోట్లతో అద్దంకికి తాగునీటి పథకం

ఏ.ఐ.ఐ.బి.సహకారంతో పనులకు టెండర్లు

5 వేల నీటి కనెక్షన్లు.. 85 కి.మీ. పంపిణీ పైప్‌లైన్

హౌసింగ్, మున్సిపల్ పనులపై మంత్రి గొట్టిపాటి సమీక్ష



అద్దంకి జూన్ 26 అద్దంకి పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రూ.101 కోట్లతో సమగ్ర మంచినీటి పథకం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏ.ఐ.ఐ.బి.) సహకారంతో అమలు కానున్న ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. సంతమాగులూరు క్యాంపు కార్యాలయంలో అద్దంకి మున్సిపల్, హౌసింగ్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. తమ్మవరం నుంచి అద్దంకి పట్టణానికి తాగునీటిని తరలించే విధంగా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు కింద పట్టణంలోని సుమారు 5 వేల గృహాలకు కొత్త నీటి కనెక్షన్లు ఇవ్వడంతో పాటు 85 కిలోమీటర్ల మేర పంపిణీ పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు. పట్టణ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు మంత్రి తెలిపారు.గృహ నిర్మాణాలకు వేగంప్రధానమంత్రి ఆవాస్ యోజన (పి.ఎం.ఏ.వై)1.0 కింద అద్దంకిలో 7,383 గృహాలు మంజూరయ్యాయని, వాటిలో 4,039



గృహాలు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మరో 2,769 గృహాలు వివిధ దశల్లో ఉండగా, వాటి నిర్మాణానికి అవసరమైన నిధులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పి.ఎం.ఏ.వై 2.0 కింద అద్దంకి మున్సిపాలిటీలో 177 గృహాలు మంజూరయ్యాయి. వాటిలో 83 గృహాలు నిర్మాణ దశలో ఉండగా, 94 గృహాల పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. అదనంగా మరో 143 గృహాల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా, త్వరలోనే ఆమోదం లభించే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 5,283 మంది అర్హులను గుర్తించి గ్రామసభల ఆమోదం అనంతరం ఆగస్టులో గృహాలు మంజూరు చేసే ప్రక్రియ చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. ౹ాహౌ 1.0 కింద నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. కేంద్రం అందించే రూ.1.80 లక్షలతో పాటు ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు.రూ.కోటికి పైగా ఆర్థిక సాయంసమీక్షకు ముందు సంతమాగులూరు క్యాంపు కార్యాలయంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు, ఎల్ఓసీ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 60 మంది లబ్ధిదారులకు రూ.44 లక్షలకు పైగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేయగా, 23 మందికి రూ.56 లక్షలకు పైగా విలువైన ఎల్ఓసీ పత్రాలు అందించారు. మంత్రికి కృతజ్ఞత తెలిపిన లబ్ధిదారులుఅద్దంకి నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన వినతులపై విద్యుత్ శాఖ మంత్రి, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. అద్దంకి పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 1096లో ఉన్న 19 ఎకరాల 48 సెంట్ల భూమి 2015 నుంచి నిషేధిత భూముల జాబితాలో ఉండటంతో అక్కడ దశాబ్దకాలంగా నివాసం ఉంటున్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. తమ ఆస్తులపై హక్కులు పొందలేక పలువురు లబ్ధిదారులు మంత్రికి వినతి చేశారు. ఈ విషయాన్ని వెంటనే పరిశీలించిన మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సంబంధిత రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఫలితంగా నిషేధిత జాబితా నుంచి సమస్య పరిష్కారమై, అర్హులైన కుటుంబాలకు హక్కు పత్రాలు అందజేశారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించిందంటూ లబ్ధిదారులు శుక్రవారం మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులు వెంటనే పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందేలా పనిచేయాలని సూచించారు.

## బీసీల సంక్షేమం ఎన్డీయే కూటమితోనే సాధ్యం



శ్రీకాళహస్తి నియోజకవర్గం, (26.06.2026):గడచిన నాలుగు దశాబ్దాలుగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలబడి, వారి అభ్యున్నతికి ప్రత్యేకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న తెలుగుదేశం పార్టీ మరియు ఎన్డీయే కూటమితోనే బీసీలకు మేలు జరుగుతుందని శ్రీకాళహస్తి నియోజకవర్గ, తెలుగుదేశం పార్టీ నాయకులు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విధ్వంసకర వైసిపి పాలన అంతమై, వికాసం వైపు అడుగులు వేస్తూ ముందుకు వెళుతున్న చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మరో 10 మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇందులో బాలికల కోసం 5 గురుకులాలు, బాలుర కోసం 5 గురుకులాలను 2026--27 విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించేలా చర్యలు చేపట్టారని తెలిపారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని కొనియాడారు. వడ్డెర సోదరులు వారి కుల వృత్తిని ఆధారంగా చేసుకొని జీవనోపాధి పొందేందుకు ప్రభుత్వ మైనింగ్ లీజులు ఇవ్వాల్సిందిగా యువగళం పాదయాత్ర సమయంలో వడ్డెర సోదరులు మంత్రి లోకేష్ కు విన్నవించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి లోకేష్ చొరవతో వడ్డెర సొసైటీలకు ప్రాధాన్యత కల్పిస్తూ క్వారీ లీజుల కేటాయింపు పై ప్రభుత్వం ఉత్తర్వులివ్వడం ద్వారా ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు లోకేష్ కు వడ్డెర సోదరులు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాకతో బీసీలకు మంచిరోజులు ప్రారంభమయ్యాయని, దానికి కొనసాగింపుగానే బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని తెలిపారు. అధికారంలోకి రాగానే స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, గీత కార్మికులకు మద్యంషాపులు, బార్లలో 10 శాతం మేర కేటాయింపు, వడ్డెరలకు క్వారీల కేటాయింపుల్లో 33 శాతం మేర రిజర్వేషన్లతో పాటు 50 శాతం మేర సినరేజీ ఫీజు, ప్రీమియంలో మినహాయింపు ఇచ్చిన ఘనత చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వానిది అని కొనియాడారు. చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచడం, మత్స్యకారుల వినతి మేరకు జీవో 217 రద్దు చేయడం జరిగింది. అలాగే నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ ను 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచడం, దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు గౌరవ వేతనం రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పెంపుదల చేయడం జరిగిందని తెలిపారు. 93 వేల మంది నేతన్నలకు 200 యూనిట్లు,11 వేల మంది మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.వాల్మీకి మహర్షి, వడ్డే ఓబన్న, మొల్ల, సర్దార్ గౌతు లచ్చన్న, భక్త కనకదాస జయంతులను రాష్ట్ర పండుగగా నిర్వహించామన్నారు. సుమారు రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 పథకాన్ని అమలుకు సన్నాహాలు చేస్తూనే, ఆదరణ 3.0 పథకం కింద శాశ్వత ఉపాధి కల్పించనున్నారని, ఇందుకోసం ఆధునిక పరికరాలు అందజేయబోతున్నదని తెలిపారు. అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాముల స్మృతి వనం మాదిరిగా బీసీల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతివనం కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డా.జి.దశరథాచారి,వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు,తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ భాస్కర్ ముదిరాజ్,నాయకులు డి.వి.నారాయణ,వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి -- డీఎంహెచ్ఓ డా. ధనరాజ్

జూన్ 28న 568 కేంద్రాల్లో పోలియో చుక్కలు --

94,321 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు లక్ష్యం

లోకల్ గైడ్ సిద్దిపేట, జూన్ 26:జిల్లాలో ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఎంహెచ్ఓ డా. ధనరాజ్ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 0--5 సంవత్సరాల వయస్సు గల 94,321 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 568 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమం పర్యవేక్షణ కోసం 57 మంది సూపర్వైజర్లను నియమించగా, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో 32 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.అలాగే ఇటుక బట్టీలు, భవన నిర్మాణ ప్రాంతాలు, సిమెంట్ ఫ్యాక్టరీలు, క్వారీలు, వలస కుటుంబాలు నివసించే ప్రాంతాల్లో ప్రత్యేక మొబైల్ బృందాలు పర్యటించి అర్హులైన చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తాయని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, బస్తీ దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు తదితర ప్రాంతాల్లో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ ఇచ్చి అవసరమైన సూచనలు అందించినట్లు తెలిపారు.దూర ప్రాంతాలు, వలస కుటుంబాల పిల్లలను గుర్తించి ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. గతంలో పోలియో చుక్కలు వేసినా మరోసారి వేయించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.ఆదివారం కేంద్రాలకు రాని చిన్నారులకు జూన్ 29, 30 తేదీల్లో ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు.జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామపంచాయతీ సిబ్బంది, ఐసీడీఎస్, విద్యాశాఖతో పాటు ఇతర శాఖల అధికారులు సహకరించాలని డీఎంహెచ్ఓ డా. ధనరాజ్ కోరారు.

## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న జర్నలిస్టు సంజీవ్‌రెడ్డి తండ్రిని పరామర్శించిన హరీష్‌రావు

యశోద ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న మాజీ మంత్రి



లోకల్ గైడ్ సిద్దిపేట, జూన్ 26:సిద్దిపేట జిల్లా సీనియర్ జర్నలిస్ట్, ప్రజాజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి సంజీవ్‌రెడ్డి తండ్రి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.హరీష్‌రావు పరామర్శకు సంజీవ్‌రెడ్డి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# మొహర్రం పండుగ వేడుకల్లో

ఎన్కతల వైభోగం- గ్రామ సర్పంచ్ పటేల్ గారి శ్రీకాంత్ గౌడ్ అలాయ్ బాలాయిలో నృత్యం



లోకల్ గైడ్:వికారాబాద్ జూన్ 26 మోమిన్ పెట్ మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలోని మొహరం పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో,అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎన్కతల గ్రామం లో నుంచి అలంకరించిన పీర్లను ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఊరేగింపుగా తీసుకువచ్చారు.ఎన్కతల వీధుల్లో పీర్ల ఊరేగింపు సాగుతుండగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.డప్పుల వాయిద్యాల నడుమ యువకులు ఉత్సాహంగా విన్యాసాలు ప్రదర్శించగా, ప్రజలు హర్షధ్వానాలతో వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు కూడా అధిక సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు.మొహరం సందర్భంగా హిందూ, ముస్లిం సోదరులు కలిసి వేడుకల్లో పాల్గొనడం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, ఉప సర్పంచ్ లంబాడి సరోజ సురేష్ వార్డునెంబర్ లు కార్బర్ కట్టెల నాగరాజు,గ్రామ పెద్దలు, నిర్వాహకులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.ఎన్కతల గ్రామం లో జరిగిన మొహరం వేడుకలు భక్తి, సంప్రదాయం, సామరస్యానికి ప్రతీకగా నిలిచి స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# ఈ నెల 28న పల్స్ పోలియో కార్యక్రమం 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. సాంబశివ రావు....వెల్లడి



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్26(లోకల్ గైడ్ న్యూస్):దేశవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ (ఆదివారం) నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని వరంగల్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. సాంబశివ రావు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 0నుండి 5 సంవత్సరాల వయస్సు గల 75,621 మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించేందుకు 456 పోలియో బూత్‌లు, 16 ట్రాన్సిట్ పాయింట్లు (బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు), 21 మొబైల్ బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జిల్లాలో 89 హై-రిస్క్ ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న 3,740 మంది చిన్నారులకు మొబైల్ బృందాల ద్వారా పోలియో చుక్కలు వేయించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలయ్యేలా 46 మంది పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్సింగ్ అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, సూపర్వైజర్లు, వాలంటీర్లు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది భాగస్వాములవుతున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాన్ని ఆరుగురు ప్రోగ్రాం అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 29, 30 నాడు ఆరోగ్య సిబ్బంది ఇంటి ఇంటి సందర్శన చేసి వివిధ కారణాలతో పోలియో చుక్కలు వేయించు కోని వారిని గుర్తించి వారికి పోలియో చుక్కలు వేస్తారు అని అన్నారు.0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం రోజున తమ సమీపంలోని పోలియో బూత్‌కు చిన్నారులను తీసుకువెళ్లి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రయాణాల్లో ఉన్న తల్లిదండ్రులు బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన ట్రాన్సిట్ పోలియో బూత్‌లలో తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకోవాలని సూచించారు.

# క్యాథలిక్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక జేమ్స్ సిల్వెస్టర్ అధ్యక్షుడిగా ఎన్నిక

ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన బృందానికి అభినందనల వెల్లువ




కుత్బుల్లాపూర్ జూన్ 26 (లోకల్ గైడ్ ప్రతినిధి)క్యాథలిక్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ( సి ఏ హెచ్) 2026--2029 పదవీకాలానికి సంబంధించిన ఎన్నికలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యాయి. ఎన్నికల కమిటీ ఆధ్వర్యంలో నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించగా, నామినేషన్ గడువు ముగిసే నాటికి ఒకే ప్యానల్ నామినేషన్ దాఖలుకావడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించారు.ఎన్నికల షెడ్యూల్‌ను మే 26న విడుదల చేసి, జీవితకాల సభ్యులు, అన్ని పారిష్‌లకు చెందిన ఫాదర్లకు సమాచారం అందించారు. నామినేషన్ల పరిశీలన అనంతరం అన్ని నామినేషన్లు చెల్లుబాటు అయ్యాయని ఎన్నికల కమిటీ వెల్లడించింది. అనంతరం జూన్ 26న ఫలితాలను అధికారికంగా ప్రకటించింది.నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా జేమ్స్ సిల్వెస్టర్ ఎన్నిక కాగా, ఉపాధ్యక్షుడిగా లివి. లారెన్స్‌లి, ప్రధాన కార్యదర్శిగా ఇవానో బెర్నార్డ్ వాజ్, సంయుక్త కార్యదర్శిగా మోనాలిసా, కోశాధికారిగా కె. జోసెఫ్ దేవస్తీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అదేవిధంగా మేనేజింగ్ కమిటీ సభ్యులుగా లిలిమార్టిన్ మైకేల్, గాదె బాల్ రెడ్డి, ఎస్. ఆంథోనీ, మెల్విన్ బెనెడిక్ట్, జోసెఫ్ కె.డి., ఎడ్వర్డ్ హ్యారీ జేమ్స్, అరుల్ రాజన్, అరోకియనాథన్, అరుల్ ఫ్రెడ్రిక్ జోసెఫ్, జయ సుధా రాణి, సి. రవీంద్రనాథ్ జోసెఫ్, స్టాన్లీ అబ్రహాం, క్రిస్టోఫర్ జోసెఫ్, హ్యారీ ప్యాట్రిక్, మారియా క్రిస్టినా అలెక్స్, ఆనంద్ ఫ్రాన్సిస్, జేవియర్ జో ఫెలిక్స్, దాస్ మాథ్యూ పాల్, లెరాయిడ్ అనిల్, జోసెఫిన్ ఫ్రాన్సిస్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తితో, పరస్పర అవగాహనతో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం సంఘ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. నూతన కార్యవర్గం సభ్యులంతా సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, యువత ప్రోత్సాహం, సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణకు అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు సంఘ సభ్యులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి నాయకత్వంలో క్యాథలిక్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ మరింత అభివృద్ధి సాధించి సమాజానికి విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ ఎన్నికల ప్రక్రియను రిటర్నింగ్ ఆఫీసర్ స్లీవా గల్లెల్లి, సహాయ రిటర్నింగ్ ఆఫీసర్లు .క్లారెన్స్ డన్. అలెగ్జాండర్ ఫిలిప్స్ ఫాబియన్ జోసెఫ్ సమర్థవంతంగా నిర్వహించారు.

# జీలకుంట గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం...

కాంగ్రెస్ పార్టీలో చేరిన జీలకుంట గ్రామ సర్పంచ్ మంగ

రూ. 15.28 లక్షల ఐవీఖీ నిధులతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనం ప్రారంభం...

విద్యాలయాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట...

భూదాత దివంగత మల్లారెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచేలా నామకరణం...

ఇంటి స్థలం ఉన్న ప్రతి అర్హునికి

రూ. 5 లక్షల ఇందిరమ్మ ఇల్లు...



ఓదెల మండలం జీలకుంట గ్రామంలో రూ. 15.28 లక్షల డీఎంఎఫ్‌టీ (ఐవీఖీ) నిధులతో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని శుక్రవారం రోజున ప్రారంభించిన తదుపరి జీలకుంట గ్రామ బీజేపీ పార్టీకి సంబంధించిన సర్పంచ్ రాగిడి మంగ శ్రీనివాస్ రెడ్డి తో పాటు వార్డు సభ్యులు బంగారి పద్మా శ్రీనివాస్ మరియు వారి అనుచరులకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు .తదుపరి ఓదెల మండల కేంద్రంలోని ఖ+దీఎ విద్యాలయంలో 20 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన అదనపు డార్మిటరీ మరియు టాయిలెట్స్ ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు ..గ్రామాభివృద్ధికి, మహిళల ఆర్థిక స్వావలంబనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆనాడు మహిళా సంఘం భవన నిర్మాణానికి 2.5 గుంటల స్థలాన్ని దానం చేసిన దివంగత మల్లారెడ్డి గారి త్యాగాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు కొనియాడారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పేరు చిరస్థాయిగా నిలిచేలా ఈ మహిళా భవనానికి 'భూదాత మల్లారెడ్డి' పేరు పెట్టాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. మహిళల సౌకర్యార్థం ఈ భవనానికి కాంపౌండ్ వాల్, మెట్లు, ప్రత్యేక టాయిలెట్ల నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులను ఆగస్టు 15 లోపు ప్రారంభించి, దసరా పండుగ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జీలకుంట నుండి పందిల్ల వీళ్ళే రోడ్డు పనులను త్వరలోనే పూర్తిస్థాయి బీటీ రోడ్డుగా మారుస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గత రెండున్నర ఏళ్లలో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు రూ. కోటికి పైగా నిధులు మంజూరు చేశామని, రాబోయే రోజుల్లో ప్రతి గల్లీలోనూ రోడ్డు ఉండేలా చూస్తామన్నారు. పాఠశాల స్థలం అన్యాక్రాంతం కాకుండా నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ పనులను రాబోయే రెండు నెలల్లో పూర్తి చేయిస్తామన్నారు. అలాగే పెద్దపల్లి కి వచ్చే ప్రధాన రహదారి పనులను పూర్తి చేసి, వారం రోజుల్లో నిధులు క్లియర్ చేసి సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని ఎమ్మెల్యే విజయరమణ రావు వివరించారు. జీలకుంట గ్రామంలో 2026-27 సంవత్సరానికి గాను రూ. 54 లక్షల బ్యాంక్ లింకేజీ, రూ. 80 లక్షల స్త్రీనిధి రుణాలు అందించామన్నారు. అలాగే 2023-24 కాలానికి సంబంధించి 1,579 మహిళా సంఘాలకు రూ. 227.42 లక్షల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. గ్రామంలో కొత్తగా 313 మందికి రేషన్ కార్డులు, లబ్ధిదారుల డివిజన్ పూర్తి చేశామన్నారు. కస్తూరిబా పాఠశాలలో చదువుకున్న ప్రతి విద్యార్థికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని సంక్షేమ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులు గొప్ప స్థాయిలో నిలవాలని కోరుకున్నారు. గతంలో సాగునీటి కోసం రైతులు అల్లాడి పోయేవారని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాల్వల ద్వారా నిరంతరాయంగా నీరు అందించడం వల్ల ఈసారి ప్రతి రైతుకు ఎకరాకు 35 నుండి 45 క్వింటాళ్ల వరకు మక్కజొన్న, వరి పంటల దిగుబడి రావడం సంతోషకరమన్నారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు ఇళ్లు ఇస్తామని చెప్పి ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పించిందే తప్ప ఇళ్లు కట్టించలేదని విమర్శించారు. ఇల్లు లేని ప్రతి అర్హునికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు. ఈ పథకం కింద ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని పారదర్శకంగా నాలుగు దశల్లో అందిస్తామని బేస్‌మెంట్ దశకు: రూ. 1 లక్ష, లింటెల్ లెవెల్‌కు: రూ. 1 లక్ష, స్లాబ్ లెవెల్‌కు: రూ. 2 లక్షలు, ఇల్లు పూర్తిగా పూర్తయితే: రూ. 1 లక్ష (మొత్తం రూ. 5 లక్షలు) నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు.ఓదెల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు..ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## పీఏడిపై డయాబెటిస్ బాధితులకు అవగాహన అవసరం

- అవగాహన లేకుంటే కాలు కోల్పోయే ప్రమాదం: డా.శ్రీకాంత్ రాజు




మహబూబ్ నగర్ జూన్ 26 (లోకల్ గైడ్ ప్రతినిధి)డయాబెటిస్ రోగుల్లో కాళ్లకు రక్తప్రసరణ తగ్గే సమస్య అయిన పెరిపెరల్ ఆర్టీరియల్ డిసీజ్ (పీఏడీ)పై అవగాహన అత్యవసరమని యశోద హాస్పిటల్స్ (హైటెక్ సిటీ యూనిట్) సీనియర్ కన్సల్టెంట్ వాస్కులర్ సర్జన్, ఎండోవాస్కులర్ సర్జన్, క్లినికల్ డైరెక్టర్ డా. ఎస్. శ్రీకాంత్ రాజు గారు ఈరోజు మహబూబ్ నగర్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో వివరించారు.డయాబెటిస్ ఉన్నవారిలో పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్ (పీఏడి) సమస్య వేగంగా పెరుగుతోందని, డయాబెటిస్ రోగుల్లో ఈ సమస్య తీవ్రంగా ఉండి చిన్న గాయాలు కూడా మానకుండా పుండ్లుగా మారే ప్రమాదం ఉందన్నారు. నరాల సమస్య కారణంగా కొందరిలో నొప్పి తెలియకపోవచ్చని హెచ్చరించారు. నడిచేటప్పుడు కాళ్లలో నొప్పి రావడం, కాళ్లు త్వరగా అలసిపోవడం, పాదాలు చల్లగా ఉండటం, మానని) గాయాలు ఏర్పడటం, వేళ్లు నల్లబడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సకాలంలో కాళ్ల రక్తప్రసరణ పరీక్షలు, డాప్లర్ స్కాన్ వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యను ముందుగానే గుర్తించి చికిత్స చేయవచ్చన్నారు.డయాబెటిస్ రోగులు రక్తంలో చక్కెర స్థాయిని కట్టుదిట్టంగా నియంత్రించుకోవాలని, పొగతాగడం పూర్తిగా మానాలని సూచించారు. అవసరమైతే మందులు లేదా యాంజియోప్లాస్టీ వంటి ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజు పాదాలను పరిశీలించడం, చిన్న గాయాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సలహా తీసుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు.ముందస్తు అవగాహన మరియు సకాలంలో చికిత్సతో కాలు కోల్పోయే ప్రమాదాన్ని పూర్తిగా నివారించవచ్చని డా. శ్రీకాంత్ రాజు స్పష్టం చేశారు.

# మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం..జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని డిసిపి ఎ భాస్కర్,మంచిర్యాల ఎసిపి ప్రకాష్,గుడిపేట13వ పటాలం కమాండెంట్ లతో కలిసి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ఐబి చౌరస్తా వరకు చేపట్టిన ర్యాలీ కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి,యువత భవిష్యత్తుకు ప్రమాదకరమని,అందరం సమిష్టిగా కృషి చేసి మంచిర్యాలను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని అన్నారు.ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుని,మాదకద్రవ్యాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.మాదకద్రవ్యాల ఉత్పత్తి,రవాణా,విక్రయం,వినియోగాన్ని నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రిలో డ్రగ్స్ రిహాబిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసామని,బాధితులకు సేవలు అందించనున్నట్లు తెలిపారు.చట్ట విరుద్ధంగా మద్యం,గంజాయి, సిగరెట్లను విక్రయించే లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయాలని తెలిపారు.మాదక ద్రవ్యాల నియంత్రణలో అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని తెలిపారు.అనంతరం డిసిపి మాట్లాడుతు మాదకద్రవ్యాల తరలింపులపై ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేసి నిరోధిస్తున్నామని,ఎక్కడైనా మత్తుపదార్థాల నిల్వ ఉన్నట్లు తెలిస్తే వెంటనే డయల్100కు సమాచారం అందించి తగ్గుముఖం పట్టేలా సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

# కొనసాగుతున్న విత్తనమేల.



బెల్లంపల్లి (లోకల్ గైడ్) మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామపంచాయతీలో గల రైతు వేదికలో విత్తనమేల కార్యక్రమం కొనసాగుతుంది.ఈ సందర్భంగా మండలంలోని రైతులు విత్తనమేల సెంటర్ కు చేరుకొని విత్తనాలు కొనుగోలు చేశారు.విత్తన మేలా సెంటర్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు లభ్యం అవుతాయని అధికారులు తెలిపారు.కాగా ఈ విత్తన మేలాకు రైతుల నుండి స్పందన అంతంత మాత్రమే ఉంది.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఎడిఎ రాజ నరేందర్,జిల్లా టెక్నికల్ ఎడిఎ గోపి,బెల్లంపల్లి వ్యవసాయ శాఖ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్,ఎఈఓ తిరుపతి సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 28న జరగబోయే బిసి ఎస్సీ ఎస్టీ జేఏసీ వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలి

ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ ఇన్చార్జి చందా మల్లయ్య...వెల్లడి




హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్26(లోకల్ గైడ్ న్యూస్):హన్మకొండ,బీసీ, ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 28న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగబోయే జేఏసీ మొదటి వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ ఇన్చార్జి చందా మల్లయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కొన్ని జాతులకు మాత్రమే రాజ్యాధికారం దక్కిందని, బహుజనులకు రాజ్యాధికారం రావాలనేటువంటి సంకల్పంతో ఏర్పాటుచేసిన విశారదన్ మహారాజు ఏర్పాటుచేసిన బిసి,ఎస్సీ ఎస్టీ జేఏసీ రాజ్యాధికార దిశగా పోరాటం కొనసాగిస్తుందని, ఎస్సీ ఎస్టీ బీసీలను జాగృతం చేస్తూ అనేక కార్యక్రమాలను కొనసాగిస్తుందన్నారు. అందులో భాగంగా ఈనెల 28న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జేఏసీ మొదటి వార్షికోత్సవ సభను ఏర్పాటు చేస్తున్నామని, ఈ సభలో సబండవర్గాలు మేధావులు, విద్యార్థులు, బీసీ, ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ పొదిల సాయిబాబా, మేకల సుమన్ ధర్మ, టీచర్ యూనిట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామెర ఉపేందర్, జిల్లా ఉపాధక్షులు అడ్లూరి పద్మ, మాదసి కుమారస్వామి,కొట్టే ప్రవీణ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల విముక్తికి ప్రత్యేక చర్యలు....

మంచిర్యాల డిసిపి ఎ భాస్కర్.



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ కేంద్రాన్ని మంచిర్యాల డిసిపి ఎ భాస్కర్ సందర్శించారు.మత్తు పదార్థాలకు బానిసలై మానసిక,శారీరక ఇబ్బందులతో బాధపడుతున్న వారికి ఈ కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో వైద్య చికిత్స,కౌన్సెలింగ్ అందిస్తున్నారు.ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితి,వారికి అందుతున్న వైద్య సేవల గురించి డిసిపి అడిగి తెలుసుకున్నారు.అనంతరం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆధ్వర్యంలో బాధితులకు క్యారమ్ బోర్డులు,చెస్ బోర్డులు,ఇతర ఆట వస్తువులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎసిపి ఆర్ ప్రకాష్,మంచిర్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రావు,ఎస్ఐ ఆది మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## 7వ వార్డులో ఎస్ఐఆర్ సర్వే.

బెల్లంపల్లి (లోకల్ గైడ్)మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని 7వ వార్డులో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించారు.బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి 7వ వార్డులోని సుభాష్ నగర్ తదితర ఏరియాలలో ఎస్ఐఆర్ సర్వేలో స్థానిక ప్రజలకు అవగాహన కల్పించి పత్రాలు అందజేశారు.ఎస్ఐఆర్ సర్వే విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.బిఎల్ఓ లు ఇంటింటికి వెళ్లి సంబంధిత ఫారాలను పంపిణీ చేస్తారని,ఓటర్లు వాటిని పూర్తిచేసి సంబంధిత బిఎల్ఓ లకు తిరిగి అందజేయాలని సూచించారు.ఈ సర్వే ప్రక్రియలో అధికారులు,ప్రజాప్రతినిధులు,సిబ్బంది సమన్వయంతో పనిచేసి సర్వేను విజయవంతం చేయాలని కోరారు.అర్హులైన ఓటర్లు ఏ ఒక్కరి ఓటు కూడా మిస్ కాకుండా ఎలాంటి పొరపాట్లు జరగకుండా కాంగ్రెస్ బిఎల్ఎ లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## తీవ్ర రోడ్డు ప్రమాదం.. తలకు గాయం..

### సూపర్‌బగ్ న్యూమోనియా.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న 62 ఏళ్ల వ్యక్తిని కాపాడిన వరంగల్ మెడికవర్ వైద్యులు



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్26(లోకల్ గైడ్ న్యూస్):వరంగల్,రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరిన 62 ఏళ్ల వ్యక్తికి మెడికవర్ హాస్పిటల్స్, వరంగల్ వైద్యులు అత్యాధునిక చికిత్స అందించి కొత్త జీవితం ప్రసాదించారు. తలకు తీవ్ర గాయం, ఛాతీ ఎముకలు విరగడం, ఊపిరితిత్తులు కుంచించుకుపోవడం, వెంటిలేటర్‌పై చికిత్స, అనంతరం అత్యంత ప్రమాదకరమైన మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ (సూపర్‌బగ్) న్యూమోనియా సోకినప్పటికీ వైద్య బృందం సమిష్టి కృషితో రోగిని పూర్తిగా కోలుకునేలా చేసిందని తెలిపారు.ప్రమాదం జరిగిన వెంటనే అపస్మారక స్థితిలో మెడికవర్ హాస్పిటల్‌కు తరలించిన రోగికి అత్యవసర చికిత్స అందించి ఐసీయూలో చేర్చారు. పరీక్షల్లో మెదడుకు తీవ్ర గాయంతో పాటు ఛాతీ కుడి భాగంలోని పలు పక్కటెముకలు విరిగినట్లు, ఊపిరితిత్తిలో గాలి చేరి శ్వాస తీసుకోవడం కష్టంగా మారినట్లు వైద్యులు గుర్తించారు. దీంతో వెంటనే ప్రత్యేక చికిత్స ప్రారంభించారు.కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డా. అభిజాన్ ఎస్. మాట్లాడుతూ, ప్రమాదం కారణంగా రోగి ఊపిరితిత్తుల పనితీరు తీవ్రంగా దెబ్బతిందన్నారు. ఛాతీలో పేరుకున్న గాలిని తొలగించేందుకు ప్రత్యేక ఛెస్ట్ డ్రెయిన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం సుమారు 15 రోజుల పాటు వెంటిలేటర్ సాయంతో చికిత్స అందించాల్సి వచ్చిందని చెప్పారు.చికిత్స పొందుతున్న సమయంలో రోగికి సాధారణ యాంటీబయాటిక్స్‌కు స్పందించని ప్రమాదకరమైన మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ న్యూమోనియా సోకిందన్నారు. బ్రోంకోస్కోపీ ద్వారా శ్వాసనాళాల్లో పేరుకుపోయిన రక్తగడ్డలు, శ్లేష్మాన్ని తొలగించి, ప్రత్యేక కల్చర్ పరీక్షల ఆధారంగా లక్ష్యిత యాంటీబయాటిక్ చికిత్స అందించినట్లు వివరించారు.క్రిటికల్ కేర్ ఫిజీషియన్ డా. లక్ష్మీ దీపక్ మాట్లాడుతూ, రోగి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో వెంటిలేటర్ నుంచి తొలగించే ప్రయత్నాలు మూడు సార్లు విఫలమయ్యాయని తెలిపారు. అయినప్పటికీ వైద్యులు, రెస్పిరేటరీ థెరపిస్టులు, ఫిజియోథెరపిస్టులు, ఐసీయూ నర్సింగ్ బృందం సమన్వయంతో నిరంతరం చికిత్స అందించి చివరకు రోగిని వెంటిలేటర్ నుంచి విజయవంతంగా బయటకు తీసుకువచ్చామన్నారు.చికిత్స సమయంలో రోగికి పేగుల పనితీరు తాత్కాలికంగా నిలిచిపోయే సమస్య కూడా తలెత్తగా, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ నిపుణులు శస్త్రచికిత్స అవసరం లేకుండా విజయవంతంగా చికిత్స అందించారు.ప్రస్తుతం రోగి స్వయంగా శ్వాస తీసుకుంటూ ఆరోగ్యంగా కోలుకుంటున్నారని, తదుపరి ఊపిరితిత్తులు, నాడీ వ్యవస్థకు సంబంధించిన పునరావాస చికిత్స కొనసాగుతోందని వైద్యులు తెలిపారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, తీవ్రమైన రోడ్డు ప్రమాదాల్లో సరైన సమయంలో ట్రామా కేర్, ఆధునిక ఐసీయూ సదుపాయాలు, ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ సేవలు, నిపుణుల సమన్వయంతో కూడిన మల్టీడిసిప్లినరీ వైద్యం అందితే ఎంత క్లిష్టమైన పరిస్థితుల్లోనైనా రోగులను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ విజయవంతమైన చికిత్సలో డా. అభిజాన్ ఎస్. (కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్), డా. లక్ష్మీ దీపక్ (క్రిటికల్ కేర్ ఫిజీషియన్) నేతృత్వంలో న్యూరోసర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, రెస్పిరేటరీ థెరపీ, ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్, ఐసీయూ నర్సింగ్ బృందాలు సమిష్టిగా పాల్గొన్నాయి.

## ఇచ్చిన మాటకు కట్టుబడి సొంత నిధులతో హైమాస్ట్ లైట్స్ ఏర్పాటు చేసిన బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి



నారాయణపేట జూన్ 26(లోకల్ గైడ్ న్యూస్)::మక్తల్ నియోజక వర్గంలోని వివిధ మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తల కోరిక మేరకు స్వంత నిధులతో హైమాస్ట్ లైట్స్ ఎపిస్తానని మాట ఇచ్చిన ప్రకారం సొంత నిధులతో బిజేపి రాష్ట్ర నాయకుడు బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు.అందులో భాగంగానే కృష్ణ మండలంలోని గుడెబల్లూర్, హిందుపూర్ చౌరస్తా దగ్గర, ఉట్కూర్ మండలంలోని వల్లంపల్లి గ్రామం, మరికల్ మండలంలోని పుట్టగడ్డ అప్పంపల్లి గ్రామాల్లో స్వంత నిధులతో హైమాస్ట్ లైట్స్ ను బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి నారాయణపేట జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు పగడాకుల శ్రీనివాస్ తో కలిసి కొన్ని చోట్ల భూమి పూజ కూడా చేసారు. హైమాస్ట్ లైట్స్ ఏపించిన బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డికి బీజేపీ శ్రేణులు అభినందనలు తెలిపారు.ఇట్టి హైమాస్ట్ లైట్స్ ని త్వరలోనే ప్రారంభిస్తారని ఆయా గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు శ్యాంసుందర్ గౌడ్ , వల్లంపల్లి సర్పంచ్ వెంకట్రాములు, మరికల్ మండలం జిల్లా కౌన్సిల్ సభ్యులు వై. తిరుపతి రెడ్డి , కృష్ణ మండలం బీజేపీ అధ్యక్షులు నల్లే నర్సప్ప, బీజేపీ పదాది కారులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో వసతులు మెరుగు పరచాలి ఓబీసీ మోర్చ జిల్లా నాయకులు బాల్ రాజ్.



నారాయణపేట జూన్ 26:(లోకల్ గైడ్ న్యూస్):ఒక్క బడిని చూపి మురిసిపోవడం కాదు26 వేల ప్రభుత్వ పాఠశాలల దుస్థితి మార్చి రాష్ట్ర ప్రభుత్వం వసతులు కల్పించాలని ఓబీసీ మోర్చా జిల్లా నాయకుడు బాల్ రాజ్ యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.ప్రజాసమస్యలను గాలికొదిలేసి కేవలం పబ్లిసిటీ తోనే పాలిస్తామంటే జనం ఆగ్రహానికి గురి కాక తప్పదన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో విద్యను వ్యాపారంగా చేసి ముడు పువ్వులు ఆరు కాయలుగా అన్న చందంగా తయారైందన్నారు. రాష్ట్రంలో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని విద్యా హక్కు చట్టం స్పష్టంగా పేర్కొంటుందని ఆయన తెలిపారు సంపన్నులు, నిరుపేదలు అనే తేడా లేకుండా అందరికీ నాన్యామైన విద్య అందించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అయితే అనేక ప్రైవేటు పాఠశాలలు విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడం లేదని దీంతో పేద విద్యార్థులు ఫీజుల భారం మోయలేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారాయణ పేట జిల్లా లో సుమారు 70 ప్రైవేటు పాఠశాలలు ఉన్నట్లు ఆ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు. అట్టీ ప్రైవేటు పాఠశాలలపై వేంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# మాదకద్రవ్యాలను సమాజానికి దూరం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

డ్రగ్స్ మత్తు పానీయాలు సేవించడం వ్యాధి కంటే ప్రమాదకరం

ప్రజల సహకారంతో గంజాయి రహిత సమాజమే లక్ష్యం.. పోలీస్ కమిషనర్ సునీల్ దత్

డ్రగ్స్ బారిన పడినట్లు అనుమానం వస్తే 1908 కు సమాచారం అందించాలి

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, పోలీస్ కమీషనర్






ఖమ్మం, జూన్ – 26లోకల్ గైడ్ :మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, బాధ్యతగా కృషి చేయాలని, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు.అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం ఖమ్మం నగరం మమత రోడ్డు లోని వివిసి టాటా సర్వీస్ సెంటర్ నుంచి లాకారం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు, యువత, పోలీస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తో కలిసి రన్ లో కలెక్టర్, పోలీస్ కమిషనర్ లు పాల్గొని స్ఫూర్తినిచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో యువత పాత్ర చాల కీలకమని, యువతకు ఉపాధి కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు కేటాయిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే అప్రమత్తం కావాలని అన్నారు.యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకోవాలని, మాదకద్రవ్యాలు, మత్తు పానీయాలు సేవించడం వ్యాధి కంటే ప్రమాదకరమని వివరించారు. డ్రగ్స్ వాడకం వల్ల ఒకరి జీవితం మాత్రమే ప్రభావితం కాదని, కుటుంబం, సమాజాన్ని నాశనం చేస్తుందని అన్నారు. డ్రగ్స్ నియంత్రణ కేవలం అధికారులు మాత్రమే చేయలేరని, ప్రజలంతా సమిష్టిగా ఉంటూ అధికారులకు సహకరిస్తేనే మెరుగైన ఫలితాలు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు.డ్రగ్స్ వాడకం ప్రారంభించకముందే మనమంతా మేల్కొనాలని, యువత డ్రగ్స్ వంటి వాటి వైపు వెళ్లకుండా దూరంగా ఉండాలని, తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ఆరోగ్యశాఖ, మాదకద్రవ్య నివారణ సంస్థలు, సమాజం అందరూ కలిసి సమష్టిగా చైతన్యం పెంచినప్పుడే మాదకద్రవ్యాల ప్రమాదం నుంచి దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించగలుగుతామన్నారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని అన్నారు. యువత దృష్టి అంతా జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలని, నిషేధిత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు ఆకర్షితులు కావద్దని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడితే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పాడు చేస్తుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన, గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తునమన్నారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1908 కు సమాచారం అందించాలన్నారు. మీ వివరాలు గోప్యం గా ఉంచడం జరుగుతుందని అన్నారు. అనంతరం ప్రజలు, యువత, విద్యార్థులు, అధికారులతో కలిసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం పై ప్రతిజ్ఞ చేశారు. తర్వాత "ఐయామ్ యాంటీ డ్రగ్ సోల్జర్స్" సెల్ఫ్ పాయింట్ వద్ద ఫోటోలు దిగడంతో పాటు సైన్ బోర్డు వద్ద సంతకాలు చేసి మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, ఎస్బి ఏసీపీ మహేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు, ఎస్సై లు, అధికారులు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమం కోసమే ఎఐఎస్ఎఫ్

## కూల్చిన ఇండ్ల చోటనే పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలి

### ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాసరావు

గుండ్ల సింగారంలో నిరాశ్రయులైనా విద్యార్థులకు నోట్ బుక్స్, విద్యావసరాల వస్తువుల పంపిణీ



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్26(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ:విద్యార్థుల హక్కులు, సంక్షేమం కోసమే అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) పనిచేస్తోందని, గుండ్ల సింగారంలో ఇండ్ల కూల్చివేతతో నిరాశ్రయులైనా విద్యార్థులకు ఎఐఎస్ఎఫ్ అండగా ఉంటుందని, కూల్చిన ఇండ్ల చోటనే పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం హనుమకొండ మండలం గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లో ఇటీవలే కాలంలో ఇండ్ల కూల్చివేతతో నిరాశ్రయులైనా కుటుంబాల విద్యార్థులకు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థులకు 500 నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్, విద్యావసరాల వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాసరావు, అతిథులుగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, మాజీ రాష్ట్ర నాయకులు కర్రె బిక్షపతి లు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్ అధ్యక్షతన జరిగిన సభలో తక్కలపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గుండ్ల సింగారంలో గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలు వేసుకొని నివసిస్తున్న 360 మంది పేదల ఇళ్ళను కూల్చి వేయడం దారుణమని అన్నారు. ప్రభుత్వం పేదల గుడిసెలు కూల్చి వేసే ముందు సర్వే నిర్వహించాలని, అనర్హులు ఉంటే తొలగించాలని, కానీ ఏమాత్రం సమాచారం లేకుండా ఒక్కసారిగా పేదల గుడిసెలపై బుల్డోజర్ లతో దాడి చేయడం ప్రభుత్వానికి తగదని అన్నారు. రోజు రోజుకు నగరం విస్తీర్ణం పెరుగుతున్న క్రమంలో గ్రామీణ ప్రాంతాల వలస వచ్చి కూలీ, నాలీ చేసుకుని జీవించే వారు ఇండ్లలో కిరాయిలు కట్టలేని పరిస్థితిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుండి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నప్పటికీ ప్రస్తుతం ఈ ప్రభుత్వం పేదలను లక్ష్యంగా చేసుకున్నదని, పేదల జీవించే హక్కును కాలరాస్తున్నదని అన్నారు. సొంత ఇంటి కలను దూరం చేయడమే ఈ ప్రభుత్వానికి సరి కాదని అన్నారు. గుండ్ల సింగారంలో నిరాశ్రయులైనా కుటుంబాల విద్యార్థులకు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, విద్యావసరాల వస్తువులు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. అదేవిధంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ నిరాశ్రయులైన విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు కర్రె బిక్షపతి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల పట్ల ప్రభుత్వం తీరు సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికల రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సొంతుకు ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు వుట్కూరి ప్రణీత్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, ల్యాదళ్ల శరత్, ములుగు జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్, రాష్ట్ర నాయకులు అన్వర్, హరీష్, సీపీఐ హనుమకొండ మండల సహాయ కార్యదర్శి గుంటీ రాజేందర్, నాయకులు పొనుగోటి రాముగోపాల్ చారి, పూజారి అమృతయ్య, కోడపాక బాబు, మామునూరి దామోదర్, పూజారి నరేందర్, కేతపాక ప్రసాద్, తాడికొండ ప్రశాంత్, మాలోత్ మంగ, నలువాల సంధ్య, బైసా మౌనిక, తాటికంటి మమత, గుంటీ రజిత, కాలనీవాసులు, విద్యారులు తదితరులు పాల్గొన్నారు.

## మొహరం వేడుకల్లో ఆధ్యాత్మిక శోభ.. సందడిగా పీర్ల ఊరేగింపు



లోకల్ గైడ్: ఆమనగల్లు, జూన్ 26 రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో మొహరం పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని దర్గా ప్రాంగణం నుంచి అలంకరించిన పీర్లను ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఊరేగింపుగా తీసుకువచ్చారు.పట్టణ ప్రధాన వీధుల్లో పీర్ల ఊరేగింపు సాగుతుండగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. డప్పుల వాయిద్యాల నడుమ యువకులు ఉత్సాహంగా విన్యాసాలు ప్రదర్శించగా, ప్రజలు హర్షధ్వానాలతో వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు కూడా అధిక సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు.మొహరం సందర్భంగా హిందూ, ముస్లిం సోదరులు కలిసి వేడుకల్లో పాల్గొనడం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పెద్దలు, నిర్వాహకులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.ఆమనగల్లు పట్టణంలో జరిగిన మొహరం వేడుకలు భక్తి, సంప్రదాయం, సామరస్యానికి ప్రతీకగా నిలిచి స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## కొమ్ముగూడెం లో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం



ఖమ్మం జిల్లా, కారేపల్లి : లోకల్ గైడ్, జూన్ 26 .మండలంలోని కొమ్ముగూడెం గ్రామపంచాయతీ లో ఐటీడీఏ భద్రాచలం వైటీసీ ఇల్లందు యువ శిక్షణ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ టైలరింగ్ లో ఉపాధి కల్పించేందుకు శిక్షణ కేంద్రం శుక్రవారం నాడు స్థానిక సర్పంచ్ కల్తీ భద్రయ్య ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ దేగల ఉపేందర్ యాదవ్, గ్రామపంచాయతీ సెక్రటరీ లోకేశ్వరి , శిక్షణ సెంటర్ మేనేజర్ సన్నీ , ట్రైనింగ్ మేడం విజయకుమారి , వైటీసీ సిబ్బంది చైతన్యకుమార్ , మల్లయ్య , వార్డ్ నెంబర్ వెనక నాగేష్ , కరపటి భవాని , ట్రైనింగ్ నేర్చుకునే గ్రామ పంచాయతీ మహిళలు , తదితరులు కార్యక్రమం పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మం...



లోకల్ గైడ్. ఖమ్మం.మాదకద్రవ్యాలను సమాజానికి దూరం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత: జిల్లా కలెక్టర్ప్రజల సహకారంతో గంజాయి రహిత సమాజమే లక్ష్యం : పోలీస్ కమిషనర్ మాదకద్రవ్యాలను సమాజానికి దూరం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు.అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఖమ్మం నగరంలోని వివిసి టాటా సర్వీస్ సెంటర్ నుంచి లాకారం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... దేశ నిర్మాణంలో యువత పాత్ర చాల కీలకమని, యువతకు ఉపాధి కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు కేటాయిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే అప్రమత్తం కావాలని అన్నారు.పోలీస్ కమిషనర్ మాట్లాడుతూమాధకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని అన్నారు. యువత దృష్టి అంతా జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలని, నిషేధిత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు ఆకర్షితులు కావద్దని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడితే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పాడు చేస్తుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.మాదకద్రవ్యాల నిర్మూలన, గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తునమన్నారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1908 కు సమాచారం అందించాలన్నారు. మీ వివరాలు గోప్యం గా ఉంచడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, యువత, అధికారులతో కలిసి మాదక ద్రవ్యాల నిర్ములనకై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాధకద్రవ్యల నిర్ములన కై "ఐయమ్ యాంటీ డ్రగ్ సోల్జర్స్" సెల్ఫ్ పాయింట్ వద్ద ఫోటో, సైన్ బోర్డు వద్ద సంతకం చేశారు.కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, ఎస్బి ఏసీపీ మహేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు, ఎస్సై లు పాల్గొన్నారు.



## పాలేరు నియోజకవర్గం కూసుమంచిమండల అధ్యక్షుడి ప్రమాణ స్వీకార కార్యక్రమం



లోకల్ గైడ్. ఖమ్మం కూసుమంచి:పాలేరు నియోజకవర్గంలోని లినూతనంగా నియమితులైన కూసుమంచి మండల అధ్యక్షుదు బజ్జూరి వెంకట్ రెడ్డి. , కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో.ఖమ్మం జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ప్రమాణ స్వీకారం చేయించడం జరిగిందిసందర్భంగా వారికి జిల్లా అధ్యక్షులు హృదయపూర్వక శుభాకాంక్షలు. తెలియజేశారు..ఈ సందర్భంగా ఖమ్మం ఉమ్మడి జిల్లా క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవే లక్ష్యంగా, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పని చేస్తూ ప్రజల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు....ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## ఘనంగా కొండ మహిపాల్ జన్మదిన వేడుకలు:



లోకల్ గైడ్. కూసుమంచి.కూసుమంచి:ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న యువ నాయకుడు కొండ మహిపాల్ జన్మదిన వేడుకలు కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, తుంబూరి దయాకర్ రెడ్డి మరియు అభిమానులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఆయురారోగ్యాలతో, మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల ఆదరణతో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా అధ్యక్షులు, మరియు తుంబూరి దయాకర్ రెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు నాలుగు మండలాల అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు కార్యకర్తలు అభిమానులు పాల్గొనడం జరిగింది.

## ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ -- దుబ్బాకలో పోస్టర్ ఆవిష్కరించిన ఎస్సై కీర్తి రాజు

**అఖల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ టెస్ట్, ఫ్రీ కోచింగ్ సెంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం**



లోకల్ గైడ్ దుబ్బాక: అఖిల రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్సై, కానిస్టేబుల్ నియామకాల కోసం నిర్వహించనున్న ఉచిత కోచింగ్ సెంటర్ మరియు స్కాలర్‌షిప్ టెస్ట్ పోస్టర్‌ను దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో గౌరవ ఎస్సై కీర్తి రాజు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్సై కీర్తి రాజు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న ఎస్సై, కానిస్టేబుల్ నియామకాల కోసం సిద్ధమవుతున్న అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు అఖిల రాజ్ ఫౌండేషన్, శ్రీధర్ కాలేజ్ ఆఫ్ కాంపిటేటివ్ కోచింగ్ సెంటర్ సంయుక్తంగా అందిస్తున్న ఉచిత కోచింగ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అఖిల రాజ్ ఫౌండేషన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పోలీస్ ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని నిర్వాహకులు కోరారు.

## జూలైలో చేప పిల్లలు పంపిణీ చేయకపోతే అసెంబ్లీ ముట్టడి: ముదిరాజ్ నాయకులు

మత్స్యకారులను ప్రభుత్వం విస్మరించింది

ఉచిత చేప పిల్లలు, సబ్సిడీ వాహనాల పంపిణీ చేపట్టాలని డిమాండ్



లోకల్ గైడ్ సిద్దిపేట, జూన్ 26: రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా మత్స్యకారులకు ఉచిత చేప పిల్లలు పంపిణీ చేయకుండా, సబ్సిడీ వాహనాలు అందించకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య ఆరోపించారు.శుక్రవారం విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో చెరువుల అభివృద్ధితో పాటు ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా మత్స్యకారుల జీవనోపాధికి ప్రోత్సాహం లభించిందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం రెండేళ్లుగా ఉచిత చేప పిల్లలు పంపిణీ చేయకపోవడంతో మత్స్యకార కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని విమర్శించారు.ఈ ఏడాదికి సంబంధించిన ఉచిత చేప పిల్లలను జూలై నెలలోనే అన్ని చెరువులు, చెక్‌డ్యాంలలో విడుదల చేయాలని, అలాగే మత్స్యకారులకు సబ్సిడీ వాహనాలను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ చేయలేని పరిస్థితి ఉంటే, అందుకు కేటాయించిన నిధులను నేరుగా మత్స్యశాఖ సహకార సంఘాల ఖాతాల్లో జమ చేయాలని సూచించారు.జూలై నెలలో ఉచిత చేప పిల్లల పంపిణీ చేపట్టకపోతే రాష్ట్ర అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కీసరి పాపయ్య, రెడ్డి యాదగిరి ముదిరాజ్, రావుల రాజు, రేగుల దేవయ్య, యాట రాజేష్, బుస్స మహేష్, పండగ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖద్దరు చాటున కబ్జా పర్వం? సర్పంచ్ దంపతుల అరాచకం!

స్వంత తమ్ముడి భూమికే ఎసరు

అశ్వారావుపేట రెవెన్యూలో మరో

భూ భాగోతం బయటపడ్డ వైనం!

న్యాయం కోసం అధికారుల

చుట్టూ తిరుగుతున్న బాధితుడు

మనుగొండ సత్యనారాయణ ఆవేదన!

లోకల్ గైడ్ : ?అశ్వారావుపేట. రక్షించాల్సిన వారే భక్షకులుగా మారితే, న్యాయం చెప్పాల్సిన వారే అక్రమాలకు తెరలేపితే ఇక సామాన్యుడికి దిక్కెవరు? గ్రామానికి ప్రథమ పౌరుడిగా ఉంటూ ఆదర్శంగా నిలవాల్సిన ఒక సర్పంచ్ దంపతులు, అధికార బలంతో కళ్ళు మూసుకుపోయి స్వంత బంధువుల భూమినే కబ్జా చేసిన అరాచక ఘటన అశ్వారావుపేట రెవెన్యూ పరిధిలో తీవ్ర కలకలం రేపుతోంది. ఎటువంటి హక్కు, ఎలాంటి కాగితాలు లేకపోయినా మాకు తిరుగేలేదు అన్నట్లుగా ఐదెకరాల భూమిని దర్జాగా ఆక్రమించుకుని, ప్రశ్నిస్తే చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్న సర్పంచ్ దంపతుల బాగోతం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

### అసలేం జరిగిందంటే..?

బాధితుడు మనుగొండ సత్యనారాయణ కథనం ప్రకారం.. అశ్వారావుపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 108/34 లో గల 5 ఎకరాల భూమిని 22-12-2000 సంవత్సరంలో కొదుమూరి కృష్ణమూర్తి వద్ద నారంవారిగూడేనికి చెందిన మనుగొండ సత్యనారాయణ చట్టబద్ధంగా కొనుగోలు చేశారు. అయితే, ఆ భూమి తనదంటూ చవ్వా సత్యనారాయణ అనే వ్యక్తి స్వాతంత్ర సమరయోధుడి పట్టా పేరుతో వివాదం సృష్టించడంతో, బాధితుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వివాదం ఇప్పటికీ కోర్టు పరిధిలోనే నడుస్తోంది.



### మధ్యలో సర్పంచ్ దంపతుల ఎంట్రీ.. బెదిరింపుల పర్వం!

కోర్టులో వివాదం నడుస్తుండగానే, సదరు భూమితో ఎలాంటి సంబంధం లేని నారంవారిగూడెం సర్పంచ్ దంపతులు రంగంలోకి దిగారు. బాధితుడు మనుగొండ సత్యనారాయణకు స్వంత బంధువులు అయినప్పటికీ, కనీస మానవత్వం లేకుండా గత ఏడాది కాలంగా సత్యనారాయణను పొలంలోకి అడుగుపెట్టనివ్వకుండా అడ్డుకుంటున్నారు. ఈ భూమి మాదే అడ్డం వస్తే చంపేస్తాం, తన్ని తరిమేస్తాం' అంటూ రౌడీయిజం చేస్తూ, బాధితుడిని భయభ్రాంతులకు గురిచేసి పొలం నుండి వెళ్లగొట్టారు.బాధితుడి కన్నీటి ఆవేదన కష్టపడి కొనుక్కున్న భూమిని కబ్జా చేశారు. ఒకవైపు కోర్టు చుట్టూ తిరగలేక, మరోవైపు నా భూమిని కాపాడుకోలేక నరకయాతన అనుభవిస్తున్నాను. సర్పంచ్ అనే పెద్ద పదవిలో ఉండి ఇలాంటి అక్రమాలకు పాల్పడటం ఎంతవరకు సబబు? బంధువులని కూడా చూడకుండా నన్ను రోడ్డున పడేశారని మనుగొండ సత్యనారాయణ తమ ఆవేదన వెలిబుచుతున్నాడు.అధికారులకు వేడుకోలు.. చర్యలు తీసుకునేది ఎప్పుడు సర్పంచ్ దంపతుల అఘాయిత్యాలపై విసిగిపోయిన బాధితుడు మనుగొండ సత్యనారాయణ న్యాయం కోసం స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్, ఆర్డీవో లకు కూడా లిఖితపూర్వకంగా వినతి పత్రాలు సమర్పించారు. తాను కొనుగోలు చేసిన ఐదెకరాల భూమిని తనకు అప్పగించాలని, అధికార గర్వంతో కబ్జాకు పాల్పడిన నారంవారిగూడెం సర్పంచ్ దంపతులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. ?గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే ఇలా భూకబ్జాలకు పాల్పడటం, ప్రాణభయంతో సామాన్యులు అధికారుల చుట్టూ తిరగడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని, ఇటువంటి అక్రమాలు పునరావృతం కాకుండా ఉండాలంటే, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ జరిపించి సర్పంచ్ దంపతుల అరాచకాలకు అడ్డుకట్ట వేసి, బాధితుడు మనుగొండ సత్యనారాయణకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది.

## కార్మికుల కడుపు కొడితే ఏమి వస్తది...? అజంజాహిమిల్లు భూముల వేలంపాటపై ఎర్రబెల్లి ప్రదీప్ రావు తీవ్ర ఆగ్రహం.



వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి,జూన్26(లోకల్ గైడ్ న్యూస్):వరంగల్ అజంజాహిమిల్లు భూముల ప్రభుత్వ వేలంపాటను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు చేస్తున్న ఆందోళనకు బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు సంపూర్ణ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ,"సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దుర్మార్గం, రేవంత్ రెడ్డి వారి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇదే కార్మికులకు ఇక్కడే భూమి ఇస్తానన్నది నిజం కాదా, 318 మంది కార్మికులకు మిల్లు స్థలంలోనే భూములు కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ వేలంపాటల పేరుతో వారి హక్కులను కాలరాస్తోంది" అని మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక మంత్రి కొండా సురేఖ, కార్మికుల కడుపు కొడితే ఏమి వస్తది చెప్పాలి..? వారి కుటుంబాల భవిష్యత్తును నాశనం చేయడం మీ పాలన లక్షణమా?" అంటూ తీవ్రంగా ప్రశ్నించారు.కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుంది -- అవసరమైతే మరింత తీవ్రంగా ఉద్యమిస్తాం" అని ఎర్రబెల్లి ప్రదీప్ రావు స్పష్టం చేశారు.



## మాదకద్రవ్యాలపై హాస్టల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ప్రతిజ్ఞ**



లోకల్ గైడ్ సిద్దిపేట, జూన్ 26: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేటలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉమెన్ పోలీస్ స్టేషన్ (డబ్ల్యూపీఎస్) ఇన్‌స్పెక్టర్ దుర్గ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటి నివారణ చర్యలపై విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ దుర్గ మాట్లాడుతూ, యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసై తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. క్షణికానందం కోసం అలవాటు పడే డ్రగ్స్ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగులుస్తాయని అన్నారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. తమ పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్‌కు సంబంధించిన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.అనంతరం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ఇన్‌స్పెక్టర్ దుర్గ సమక్షంలో విద్యార్థులందరితో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.




## ప్రపంచ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా 2కే రన్‌లో ఎమ్మెల్యే నాయిని..



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్26(లోకల్ గైడ్ న్యూస్):హనుమకొండ,ప్రపంచ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు నిర్వహించిన ఈ అవగాహన ర్యాలీలో ప్రజలకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై చైతన్యం కల్పిస్తూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు కే.ఆర్. నాగరాజు , డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద , పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి వర్గం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అందరూ కలిసి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు.



## డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణంలో యువత ముందుకు రావాలి



హనుమకొండ జిల్లా ప్రతినిధి,జూన్26(లోకల్ గైడ్ న్యూస్):డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం యువత ముందుకు రావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ప్రపంచ మాదరద్రవ్యాల దుర్వినియోగం, ఆక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకోని సెంట్రల్ జోన్ పోలీసుల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2కె పరుగును వరంగల్ పోలీస్ కమిషనర్ ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, కుడా చైర్మన్‌తో కలసి ప్రారంభించారు. ట్రై సిటి పరిధిలోని యువత విద్యార్థులు పాల్గోన్న ఈ పరుగు వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయము నుండి సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వరకు కోనసాగింది. ఈ పరుగులో ప్రతిభ కబరిచిన యువతకు ముఖ్య అతిధిల చేతుల మీదుగా పతకాలు, సర్టిఫికేట్లను అందజేశారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథి వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల సంబంధించి ప్రస్తుత సమాజంలో పెద్ద సమస్యగా మారిందని, యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి పోవద్దని, ఒక్కసారి వాటిని వినియోగించడం ద్వారా యువత జీవితాలు అంధకారం మారుతాయని, ముఖ్యంగా మత్తు పదార్థాలను విక్రయాలు, వినియోగించడంలాంటి చర్యలకు పాల్పడి చిక్కుల్లో పడోద్దని, విద్యార్థులు కేవలం చదువులపైనే దృష్టి పెట్టాలని, అదే విధంగా యువత తమ ఉన్నంత లక్ష్య సాధనకై కృషి చేయాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, మాట్లాడుతూ యువత చేడు వ్యసనాలను దూరంగా వుంటూ ఆరోగ్యంతో వుండాలని, మత్తు పదార్థాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగివుండటంతో పాటు, ఇతరులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణకై ఈగల్ ఫోర్స్ విభాగాన్ని చేయడమైనదని, ఎవరైన మాదకద్రవ్యాలు విక్రయించిన, వినియోగించిన తక్షణమే 1908 నంబర్‌కు సమాచారం అందించాలని, వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు తెలిపారు. హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్ వున్న యువత మత్తుకు దూరంగా వుండాలని, డ్రగ్స్‌కు బానిసలయ్య వారి కుటుంబాలు, ముఖ్యంగా తల్లులు అనుభవించే వేదన వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేసారు. అనంతరం ఈ పరుగులో పాల్గోన్న యువత, విద్యార్థుల మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సైనికుడిలా పనిచేస్తామని అంటు ప్రతిజ్ఞ చేయించడంతో పాటు ఈ కార్యక్రమానికి హాజరయిన ముఖ్య అతిధిలు మాదకద్రవ్యాల నిర్మూలనకై "ఐయాం యాంటీ డ్రగ్స్ సోల్జర" సెల్ఫీ పాయింట్ ఫోటోలు దిగి యువతను స్ఫూర్తిగా నిలిచారు.ఈ కార్యక్రమములో శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్ నాగరాజు, టిజీ ఎన్‌పిడిసిఎల్ , సి. యం.డి వరుణ్ రెడ్డి, వరంగల్, హన్మకొండ కలెక్టర్లు డా.సత్యశారద, చాహత్ బాజ్‌పాయి, కుడా చైర్మన్ ఇనగాల వెంట్రామిరెడ్డి, డిసిపిలు దార కవిత, అంకిత్‌కుమార్, అడిషినల్ కలెక్టర్ సంధ్యతో పాటు అడిషినల్ డిసిపిలు,ఎసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు,ఆర్.ఐలు, ఎస్.ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDY Published from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499\\\